

కవికొండల వెంకటరావు

సీ. శృంగారవంతమౌ శ్రీరంగపట్టణ
జనపదరాజంబు జన్మభూమి,
సకలవేదజ్ఞానసంపన్నసత్తముం
డలభరద్వాజుండు కులగురుండు,
కవికొండలాన్వయార్ణవపూర్ణచంద్రుండు
నరసింహ మతియశోన్నతుఁడు దండ్రి,
గాడిచర్లకులాబ్ధిగర్భముక్తాఫలం
బమలసుగుణ శేషమాంబ తల్లి,
పేరు వేంకటరావు.

# సమాగమము

అప్రయత్నమ్మ్నుగా లభ్యమైన యట్టి
తావకసమాగమమ్ము సాధ్వసమునందు
లీన మగునేని, యుద్రిక్తమానసమ్ము
శాంతి గనజాలు నెట్టు లీసమయమందు ?

ఇంతకాల మసాధ్యమై యీమనోజ్ఞ
పుష్యమాసప్రభాతముపుణ్యవేళ
సంఘటిల్లిన యేకాంతసమయమందు
పలుక వేటికి ? ప్రియురాల! భయము వీడి.

ఒసగితివి పెక్కుసార్లు కర్ణోత్సవముగ
నాకు పూర్వము ప్రతివచనమ్ము, లిపుడు
సిగ్గుపడుచున్నదాన వో జీవితేశ్వ
రీ! నికటభూమి నన్నన్నిరీక్షణమున !

విదితమయ్యెను భవదీయహృదయనిహిత
దివ్యవిమలానురాగసందీప్తి నాకు,
ఇపుడు కన్నెత్తి నన్ను వీక్షింపవేని
మన్ముఖవికాస మకట! యేమాడ్కి నొదవు ?

అన్య లౌకస్మికమ్ముగా ననుగుదెంతు
రేమొ ప్రాణప్రియా! ఒకయింత యనుము
పెదవి కదపక, ఉన్నది ప్రేమ మనెడు
సలలితోక్తులు మకర్ణజాహమందు.

ఎగిరి పోవుచు నున్నవి యీయమూల్య
భంగురాల్పక్షణంబులు ! పలుక వేమి
భవదసంబద్ధమానమ్ము బాధపెట్టు
బాఢముగ, జీవితేశ్వరీ! భగ్నహృదయు.

కోపము వహింపబోకు ! నీకోమలాంగ
మధురసంస్పర్శవశమున మామకీన
నిష్ఠురశరీర మిపుడు పునీతమయ్యె,
కోరకితమయ్యె, నయ్యెను కుసుమితంబు.



శ్రీ శివశంకర శాస్త్రి

# నిట్టూర్పులు



౧

ప్రకృతిమూర్తి నా ఉపాసనమూర్తి. ప్రకృతిలోని ప్రత్యణువు పవిత్రప్రణయంతో పులకించిపోతూ ఉంటుంది. ప్రతిబాధాక్షుభితహృదయాన్ని తనశీతలమృదులాంకములో నిముడ్చుకొని ఆశాగీతాలతో సమాశ్వాసిస్తుంది. ఆప్రకృతిమూర్తి ఎవరి కారాధ్యముకాదు?

౨

వజ్రవైడూర్యవైభవంకన్న గడ్డిపఱక నగ్నసౌందర్యమే నన్నాకర్షిస్తుంది. కాని ఆ సౌందర్యఖండాన్ని ఇనుపపాదాలతో మెట్టి రాచివేస్తారు మానవులు నిరసనాసూయలతో.

౩

సహజముగా మానవహృదయం సున్నితము. ఎంతగా హృదయాన్ని కఠోరత్వంతో పొదిమివేసికొన్న అంతగా జీవితోత్క్రమణపథ సుగమం అవుతుంది.

౪

ఆశ లేనిచో నిరాశ లేదు. ప్రేమార్ద్రము కానిచో హృదయము భావనావీథీవిటంకపాళుల స్వైరవిహారము చేయు లేదు.

౫

కాంక్షితాశయాల శుభాశుభములలోని ఆనందమాధుర్యాలు, విషాదశోకాలుకన్న ప్రతీక్షలో పరిమళించే ఆనందమాధుర్యాలు విషాదశోకాలలోనే మధురిస్తుంది స్వర్గీయసౌఖ్యం.

౬

నీలాంబరాన్ని మిలమిలా మెరసే అనంతకోటి నక్షత్రాలలో ఒకే నక్షత్రాన్ని లక్ష్యం చెదరకుండా దృష్టించి చూడడం అలవరచుకున్నాను. ఏప్రేమమూర్తి కన్నీటికణాలో ఆచుక్కలు స్థాయీభావము వహించాయి.

[illegible]

# హనుమప్ప నాయఁడు

వెలి సేయ లేదు నీ వీర్యసంపద మస్త
కంబుపై నిడికొన్న గడ్డిమోపు;
కలిగింప లేదు సంచలనంబుఁ గుడిహస్త
మున దిగిపోయిన యనుపమేకు;
దాఁచ లేదాంధ్రరక్తము మణిబంధమున్
నరికిన కొడవలి కరకుముండ్లు;
వెనుక పెట్టగ లేదు విజయమ్ము రేనికి
నడిదండ మిడినట్టి యెడమచేయి;
స్వామికార్యనిర్వహణధూర్వహుఁడవగుచుఁ
బ్రాణములనైన ధారవోయంగ సిద్ధ
పడిన నీ యాంధ్రవీర్యసంపదకు వంద
నము లొనర్తును హనుమప్ప నాయకమణి!

[illegible]

'గద్వాల' సంస్థానమును రెండువందల సంవత్సరములకుఁ బూర్వము "సోమనాద్రిభూపాలుఁడు" అను (ఆంధ్ర) వీరవరేణ్యుఁడు పాలించుచుండెను. గద్వాలపట్టణమునకుఁ బదిమైళ్లదూరమున 'ఉప్పేడు' అను నొక ఊరు కలదు. అచ్చటి కోటలో నాకాలమున 'సయ్యదుదావూదుమియ్యా' అను మహమ్మదీయుఁడు ప్రభుత్వము చేయుచుండెను. ఇరుగుపొరుగున రాజ్యము చేయుచుండిన సోమనాద్రికిని, సయ్యదుమియ్యాకును ప్రబలవిరోధ మేర్పడెను.

తనవిరోధి యగు సోమనాద్రి నోడించి యవమానింపవలెనని సయ్యదుమియ్యా తలంచెను. అందుకని అతఁడు సేనలఁ గూర్చుకొని యుద్ధయాత్రకు బయలుదేరెను. సోమనాద్రిభూపాలునకీసంగతి తెలిసెను. తోడనే యాతఁడును స్వపరిమితసేనాసహితుఁడై జైత్రయాత్రకు వెడలెను. ఇరువాగుల సైన్యమును 'అరగిద్ద' యనుచోట తారసిలెను. సందడికయ్యము జరిగెను. తురకరాజు తెలుఁగువీరుని ధాటికి ఆఁగజాలకపోయెను. అప్పుడు బ్రతుకుపై నాశపుట్టి యాతఁడు పలాయనము చిత్తగించెను. ఏనుఁగు నెక్కి సయ్యదుమియ్యా ఉప్పేడు కోటమార్గము పట్టెను. తనసమరాశ్వము నెక్కి సోమనాద్రి అతనివెనుఁదగిలెను.

మఱపుఁగీఁగెవల నింతలో సోమనాద్రిగుఱ్ఱము సయ్యదుమియ్యా ఏనుగును అతిక్రమించెను. అప్పుడా గుఱ్ఱము తనముంగలి కాళ్లు రెంటిని ఎత్తి గజము కుంభస్థలమున నుంచెను. సోమనాద్రి శత్రుని తలనెగరఁగొట్టుటకుఁ గత్తియెత్తెను. ప్రాణభయమునఁ దురకప్రభువు గడగడలాడి సోమనాద్రికి సలాముచేసెను. "నీకుఁ గప్పముకట్టుచు నీ సామంతరాజునై ఉండెదను. నన్ను ప్రాణములతో వదలిపెట్టుము" అని సయ్యదుమియ్యా ఆఁడుదానివలె నేడ్చుచు సోమనాద్రిని ప్రార్థించెను. అంతమీఁద, సదాగశీలుఁడగు గద్వాలప్రభువు మనసు కరిగెను. తోడనే యాతఁడు ఎత్తినకత్తినిదించి సయ్యదుదావూదుమియ్యాతో నిట్లు చెప్పెను: "బ్రతికితివి. పొమ్ము. నాకు నీవు కప్ప మీయనక్కఱలేదు. సామంతుఁడవుగా నుండవలసిన పనియునులేదు. నీవోడిపోయినట్లు గుఱుతుగానుండుటకుఁగాను నీవు యుద్ధమునకుఁ గొనివచ్చిన నగారా, పచ్చజెండా, ఏనుఁగును మాత్రము నాకిమ్ము."

ఇందువలన మానమ్ము పోయినను ప్రాణములు నిలుచును గదాయని సంతోషించి సయ్యదుమియ్యా తన నగారా, పచ్చజెండా, ఏనుఁగును సోమనాద్రికిచ్చి ఉప్పేడుకోటకుఁ జేరుకొనెను. జయలక్ష్మితోఁ బాటు సయ్యదుదావూదు ఇచ్చిన విజయచిహ్నములను గ్రహించి సోమనాద్రి గద్వాల చేరెను అచ్చట అతఁడు నగరమధ్యమున నాకాశమంటు జయస్తంభమును కట్టించెను; తురకరాజువద్దఁ గైకొన్న పచ్చజెండా

వానిపైఁ బెట్టించెను. అది గాలికి రెపరెప కొట్టుకొనుచు సోమనాద్రివిజయమును కీర్తించుచున్నదో యనునట్లుండెను.

పరాభవదుఃఖమున మ్రగ్గుచున్న సయ్యదుమియ్యా కొన్నిదినములవఱకు బయటికి రాకుండెను. ఒకనాఁడా తఁడు తనకోటబురుజుపైనెక్కి యక్కడికిఁ బదిమైళ్ల దూరముననున్న గద్వాలపై దృష్టిఁ బఱపెను. ఉన్నతోన్నతమగు జయస్తంభముపై వాయుసంచలితమగుచున్న తనపచ్చజెండా అతనికిఁ గనపించెను. మానుచున్నపుండు రేగినట్లు మఱుపునొందుచున్న పరాభవదుఃఖము మఱల ఉద్వేలితమయ్యెను. సోమనాద్రి నెటులైన దుంపసుద్ధిగ నాశనము చేయవలెనని ఆతఁడు నిశ్చయించుకొనెను.

హైదరాబాదు పట్టణమున నిజాముఅలీ అనుమహమ్మదీయుఁ డాకాలమున రాజుగా నుండెను. అరాజు సాయమున సోమనాద్రినిమట్టుపెట్ట సయ్యదుతలంచెను. కావున నాతఁడు హైదరాబాదునకుఁ బ్రయాణమై పోయెను. రెండుమూఁడుదినముల కాపట్టణము చేరి యాతఁడు నిజాముఅలీకిఁ దనరాక నెఱింగించెను. మహమ్మదీయుల గురుపరంపరకుఁ జెందిన సయ్యదుజాతీయుఁడగు దావూదుమియ్యా సామాన్యునివలె వచ్చుట కబ్బురపడి నిజాముఅలీ వెంటనే యతనికి దర్శనమిచ్చెను. సయ్యదు నిజాముఅలీని దర్శించిన తోడనే వంగివంగి సలాములుచేసెను; ఒంటికాలిమీఁద నిలుచుండి యిట్లుప్రార్థించెను: "గద్వాలరాజు సోమనాద్రి నాపై నెత్తివచ్చి నన్నోడించినాఁడు. అవమానించినాఁడు. బలాత్కరించి నానవుబతు నగారాను, బావుటాను, ఏనుగును లాగుకొన్నాఁడు. తమ రెత్తివచ్చి ఆతెలుఁగురాజును బంధించి నావీరచిహ్నములను నాకిప్పించవలెను. నాప్రార్థన మీరుత్రోసిపుచ్చిన నే నిచ్చటనే పొడుచుకొని చనిపోయెదను."

సయ్యదుమియ్యా తెగువచూచి తనకిష్టములేకపోయినను నిజాముఅలీ సోమనాద్రిపై యుద్ధసన్నద్ధుఁడయ్యెను. సేనలఁ గూర్చుకొని యాతఁడు సయ్యదుదావూదును వెంటఁబెట్టుకొని పోయి కర్నూలు సమీపమున నున్న నిడుదూరుమెట్టలపై దండువిడిసెను. అతనికి మహమ్మదీయప్రభువులెందఱో సాయమువచ్చిరి. సోమనాద్రిభూపాలుఁ డిది తెలిసికొని యపరిమితసేనాసమేతుఁడై దండయాత్రకు వెడలెను. కలుగోట్లయను ప్రదేశమున నాతఁడు దండువిడిసెను. నిడుదూరు, కలుగోట్ల గ్రామములనడుమ తుంగభద్రానది ప్రవహించుచుండెను.

ముందు తెలుఁగుసైనికులు యుద్ధమును ప్రారంభించిరి. తుంగభద్రానదిని దాఁటి వారు తురకసైన్యమును చుట్టుముట్టిరి. సాయంకాలమగువఱకు సమరము జరుగుచునేయుండెను. మహమ్మదీయసైనికులు తుదకు వెన్నిచ్చిరి. నిజాముఅలీ భయపడి పాఱిపోయి కర్నూలుకోటలోఁ దూరెను. సోమనాద్రి కర్నూలువఱకు శత్రుసైన్యమును తరిమికొనిపోయెను. ఇంతలోఁ బొద్దుక్రుంకెను. అప్పుడు సోమనాద్రి సేనలను మఱలించుకొని తుంగభద్రను దాఁటి కలుగోట్లచేరెను.

సోమనాద్రి మఱలిపోయినవార్త విని నిజాముఅలీ కర్నూలుకోటనుండి తిరిగి నిడుదూరుగుట్టలపైకి వచ్చెను. ఆప్తవర్గమును చూచి యాతఁడిట్లుపలికెను: "సోమనాద్రి మనలను సైతానువలెఁ దగులుకొన్నాఁడు. వాఁడు కాలుపెట్టిన స్థలమంతయు నాశనము చేయుచున్నాఁడు. వాఁడంటేని చంపుమన్నాఁడు కాని వానిని చంపఁగల్గినవాఁడు మనసైన్యమునందొక్కఁడును లేకపోయినాఁడు. చంపుటమాటయటుండి తుదకు వానిని పట్టుకొనువాఁడైనను మనలో లేకపోయినాఁడు. ఇఁక నేమిగతి?"

ఆమాటలకు సయ్యదుమియ్యా ఇట్లుచెప్పెను. "సోమనాద్రి గుఱ్ఱముమీఁదనుండినంతకాలము వానిని పట్టుకొనుట కలలోనివార్త. ఆగుఱ్ఱము బహుచిత్రమైనది. జవసత్త్వములలో దానికి సాటియైన గుఱ్ఱము మీప్రాంతమున మఱియొకటిలేదు. తూనీఁగవలె నది సమరరంగమునందంతటను సంచరించును. అన్నిగుఱ్ఱములును ఏనుఁగులను చూచిన భయపడును. కాని యిది వానికి భయపడదు సరికదా వానినెత్తిమీఁదఁ దనకాళ్లుంచును. అప్పుడు సోమనాద్రి ఏనుఁగుమీఁదనున్న తనశత్రువును

చిత్రవధచేయును. సోమనాద్రిబలమంతయు నాగుఱ్ఱమందేయున్నది. కావున ముందు మన మాగుఱ్ఱమునుపట్టి తెప్పించితిమేని పిమ్మట సోమనాద్రిని సులభముగ నోడింపవచ్చును. ”

నిజాముఆలీ కిది నచ్చెను. అందుమీఁద నాతఁడు “ సోమనాద్రిసమరాశ్వమును పట్టి తెచ్చువానికి గొప్ప బహుమానమిత్తును ” అని పలికెను. వీరాధివీరుఁడగు సోమనాద్రిసమరాశ్వము ను పట్టితెచ్చుట పులిమీసము లనుపట్టి లాగుటయని ఓరుదుమగలుకూడ నాపనికి సాహసింపలేకపోయిరి. తుదకు నిజాముఅశ్వరక్షకుఁడు తా నాగుఱ్ఱమును తెల్లవాఱకమునుపే పట్టుకొని వచ్చెదననిపలికెను.వానికి నిజాముఆలీ యనుజ్ఞ నిచ్చెను. అప్పుడు వాఁడు నడుముకట్టులో గుఱ్ఱపుఁగళ్లెము నొక దానిని రహస్యముగనుంచుకొని వెడలిపోయెను.

అక్కడ కలుగోట్లలో సోమనాద్రి యారాత్రికిఁ జేయవలసిన ఏర్పాటులను చేసెను. శత్రుప్రదేశములనుండి వచ్చుదారులందంతటను నాతఁడు చారులనుంచెను. ‘మావిళ్ళపాడు’ అను గ్రామమార్గమున నిజాముఆలీ అశ్వరక్షకుఁడు కాలినడకను కలుగోట్లవైపునఁ బోవుచుండెను. అచ్చట కావలియున్న సోమనాద్రిచారులు వానినిచూచి యెవఁడో బాటసారి పోవుచున్నాఁడనుకొని యూరకుండిరి. వాఁడు సాగిపోయెను. సగము రాత్రివేళ వాఁడు సోమనాద్రిగుఱ్ఱపుశాలను సమీపించెను. పగలంతయు యుద్ధప్రశంసలోనుండి అలసి యుండినవారగుటచే నచ్చటిభటులు గాఢనిద్రయం దుండిరి. సర్వము అనుకూలమై యుండినందుకు సంతసించి నిజాముఆలీగుఱ్ఱపువాఁడు రాజాశ్వమును సమీపించెను; దానిని కట్టినతాడు విప్పి బయటకుఁ దీసికొని వచ్చెను. తననడుమునను న్న కళ్లెమును ఆగుఱ్ఱమునకుఁ దగిలించెను. దానిపై వాఁడు స్వారియై తమశిబిరము త్రోవఁబట్టించి ‘ మావిళ్లపాడు ’ మార్గమునఁ బోవుచుండెను.

అచ్చటి కావలివారు వానిని చూచిరి. తమశిబిరము దిక్కునుండియే వాఁడు వచ్చుచుండుటచేఁ దమభటులలోఁ నెవఁడో వేఁగునడుపుటకు కర్నూలుకుఁబోవుచున్నాఁడని తలఁచి వారు వానిని అటకాయింపరైరి. వాఁడు నిరభ్యంతరముగ సాగిపోయెను. తెల్లవాఱక ముందే తాను చెప్పినచొప్పున గుఱ్ఱమును తీసికొనిపోయి వాఁడు నిజాముఆలీకి సమర్పించెను. అప్పుడా తురకప్రభువునకుఁ బట్టరాని సంతసము కలిగెను. ఇంతటి దుర్ఘటకార్యముచేసిన తనఅశ్వరక్షకునకు ఆ ప్రభువు బంగారుకడియములు బహుమానముచేసెను. పిమ్మట నతఁడు అశ్వమును శాలలోఁ గట్టించెను; ఇఁక సోమనాద్రిని పట్టుకొనుట సులభమని ప్రజ్ఞలు పలికెను.

తెల్లగఁ దెల్లవాఱెను. సోమనాద్రి శిబిరమున గుఱ్ఱపురౌతులు తమతమగుఱ్ఱములకు మేతవేయించుటకు అశ్వశాలకుఁ బోయిరి. అందు సోమనాద్రిగుఱ్ఱము కనుపించలేదు. వారాసంగతి తమప్రభువునకెఱిఁగించిరి. అప్పుడు సోమనాద్రి వివిధప్రదేశములందుఁ దానునిలిపిన చారులను పిలిచి విచారించెను. మావిళ్ళపాడుదగ్గఱనుండిన చారులు తమప్రభువుతో “ రాత్రి యొకరౌతు కర్నూలువైపునకు వేగమునఁ బోవుచుండుట మేము చూచితిమి. మనశిబిరము దిక్కునుండి వచ్చుటచే వాఁడు మనవాఁడే వేఁగునడుపుటకుఁ బోవుచున్నాఁడని భావించి యూరకుంటిమి” అని చెప్పిరి.

దానితోఁ దనగుఱ్ఱము శత్రుశిబిరమునకుఁ జేరిన సంగతి సోమనాద్రి కవగతమయ్యెను. అప్పటియాతని సంతాపమునకు మేరలేకుండెను. ఆ గుఱ్ఱములేకుండుట ఆతనికిఁ గుడిచేయిపోయినట్లయ్యెను. కావున ఆనాఁటి పోరులో సోమనాద్రి చాల నిరుత్సాహముగ వర్తించెను. ఎట్లో సాయంసమయమగువఱకు యుద్ధముచేసి యతఁడు తనభటులను మఱలించుకొని తుంగభద్రను దాఁటి కలుగోట్లకుఁ జేరెను.

అప్పుడు సోమనాద్రి తనసహాయనాయకుల నొక్కచోఁజేర్చి “ తురకల కన్నుగప్పి యెవరైన నాగుర్రము తీసికొనిరాఁగలరా ? ” అని ప్రశ్నించెను. సింహమున్న గుహలోఁ బ్రవేశించినట్లు యుద్ధప్రశంసలో మునిఁగియున్న శత్రుశిబిరములోఁ జొచ్చి

ఆగుఱ్ఱమును విడిపించుకొనివచ్చుట కందెవ్వరును సాహసింపలేకపోయిరి. రాజభక్తుఁడగు హనుమప్పనాయఁడు అను బోయవీరుఁడప్పుడు తా నాగుఱ్ఱమును తెత్తునని చెప్పెను. సోమనాద్రి యనుజ్ఞనిచ్చెను "తెల్లవాఱులోన ఈసేవకుఁడు గుఱ్ఱమును తేఁగలిగెనా సరియే. లేనిచో నిదియే వాఁడుచేయు తుది నమస్కారము" అని చెప్పి యాసందెచీఁకటివేళ హనుమప్పనాయఁడు బయలుదేరిపోయెను.

చేతిలోఁ గొడవలి, నెత్తిమీఁదఁ జొప్పమోపు పెట్టుకొని యామసకచీఁకటివేళ హనుమప్పనాయఁడు నిడుదూరుమిట్టలపైనున్న నిజాముడేరాలను సమీపించెను. ఒకతురకసిపాయి నాయనిచూచి "ఒరే! ఆమోపు ఎంత?" అని యడిగెను. "అయిదురూపాయిలు. గుడ్డిగవ్వతక్కువైన ఈయను." అని హనుమప్పబదులు పలికెను. "అబ్బా! అగ్గరూపాయకిచ్చే చొప్పమోపు అయిదురూపాయిలా? ఎవరికిఁ గావలెను?" అనుచు నాసిపాయి తనపనిమీఁదఁ బోయెను.

హనుమప్ప ముందు కడుగులు వైచెను. గుఱ్ఱపుశాల పదియడుగుల దూరమున నుండెను. అప్పుడు మఱియొక ముహమ్మదీయ సైనికుఁడు ఆదారిని పోవుచుఁ జొప్పమోపు ఖరీదు విచారించెను. హనుమప్ప మఱల నయిదు రూపాయిలనెను. ఆసిపాయి దానికి వికటముగ నవ్వి "ఒరే! ఎక్కడలేనిఖరీదు చెప్పుచున్నావేమిరా?" అనెను. దానికి హనుమప్ప "సిపాయిగారూ! తమసేన లిచ్చట దిగినప్పటినుండియుఁ బశువులమేత కెక్కడలేని గిరాకిఁదగిలినది." అని బదులు చెప్పెను. తప్పతాగి యున్న ఆసిపాయి మఱిమాట్లాడక ఇచ్చవచ్చినచోటికిఁ బోయెను.

హనుమప్పనాయఁడు గుఱ్ఱపుశాలను సమీపించెను ఆతనికండ్లు గుఱ్ఱములమీఁదనే యుండెను. పరిశీలించిచూచి యతఁడాచీఁకటిలోఁ గట్టముమీఁద సోమనాద్రిగుఱ్ఱమును కనుఁగొనెను. అప్పుడాతఁడు దాని చెంతకుఁబోయెను ఆగుఱ్ఱ ముదయమునుండియు గడ్డి ముట్టలేదు; నీళ్లు తాగలేదు. క్రొత్త మొగములు, క్రొత్త ప్రదేశము. అగుటచే దానికి మేత, నీళ్ళు రుచింపలేదు స్వస్థానమగు గద్వాలనుండివచ్చిన హనుమప్పను మాలువేషమునమున్నను తెలివిగల ఆగుఱ్ఱ మానవాలుపట్టెను. అప్పుడు దానికి వింతవాసనమును తనవాఁడొకఁడు కనిపించినందులకుఁ బట్టరానిసంతోషము కలిగెను. తత్సూచకముగ నది సకిలించెను. అచ్చటనున్న భటులు హనుమప్పనెత్తిమీఁది చొప్పమోపును చూచిరి; గుఱ్ఱము సకిలింపును వినిరి.

అంతట ఆభటులలో నొకఁడు మిగిలినవారితో "ఒరే! ఈ గుఱ్ఱము రేగడిసీమలో దంటుపుల్లలు తిని పెరిగినది. అగుటచేతనే చొప్పను చూచి సకిలించుచున్నది" అని చెప్పెను. మిగిలినభటు లది నిజమని చొప్ప ఖరీదుఅడిగిరి. ఇంతదనుక హనుమప్పనాయఁడా చొప్పమోపుకు హెచ్చువెల చెప్పుచుండెను కాని యిప్పుడొకరూపాయి యని చెప్పెను. ఆమూల్యమున కొడఁబడి సిపాయిలు మోపుదింపించిరి. అచ్చటనున్న యొక తురకవానితో "దివాణములోఁ జెప్పి వీనికి దీనిఖరీదు నిప్పింపుము" అని యాజ్ఞాపించి యాభటులు వెడలిపోయిరి కొంతసేపటి కొకఁడువచ్చి నాయనికి మూల్యమిచ్చి తనదారిని పోయెను

చొప్పవిక్రయదారుఁడగు హనుమప్పనాయఁడు తనడబ్బులు చేతిలోబడినను అచ్చటినుండి లేచిపోలేదు; సోమనాద్రి గుఱ్ఱముదగ్గఱనే కూర్చుండియుండెను. అప్పు డొకతురకభటుఁడు ఆమార్గముగఁ బోవుచు నాయనినిచూచి "ఎవరునీవు?" అని ప్రశ్నించెను. "అయ్యా! నేను చొప్పయమ్మువాఁడను. నాదగ్గఱ చొప్పమోపొకదానినికొని యిచ్చటివారు ఖరీదిప్పించెదమని చెప్పి వెళ్ళినారు. వారింకను రాలేదు వారికొఱకె యెదురుచూచుచున్నాను" అని హనుమప్పనాయఁడు బదులుచెప్పెను. "అచ్ఛా" అని గడ్డము నిమురుకొనుచు నాతురకసిపాయి తనదారిని పోయెను. మఱికొంతసేపటికి మఱియొకతురకసిపాయి వచ్చి హనుమప్పనుచూచి "ఎవరు నీవు?" అని యడిగెను. వీనికిఁ గూడ నాయఁడు మొదటిసిపాయికిఁ జెప్పినట్లే చెప్పెను. అందుమీఁద వాఁడును వెడలిపోయెను. కార్యసాఫల్యమునకైన కాలమునకై హనుమప్ప వేచియుండెను.


కొంతసేపటికి నిజాముఅలీ సేనానివేశమున సద్దణఁగెను. దగ్గఱ ఎవ్వరులేనిసమయమును గనిపెట్టి హనుమప్పనాయఁడు గుఱ్ఱపుశాలలోఁ బ్రవేశించెను. అందొకప్రక్క సోమనాద్రియశ్వముచెంత గడ్డిమోపుగా వేయఁబడియుండెను. నాయఁడా గడ్డికుప్పలో దూరెను. ఎత్తుకనుపించకుండులాగునఁ గాలుసేతులు చాచికొని యతఁడాగడ్డివాములో బల్లపఱుపుగాఁ బరుండెను.

స్వస్థానీయుఁడగు నాయఁడు తనచెంత కూర్చుండి యుండినఁ గారణమున సోమనాద్రియశ్వము సంతోషముతో మేతమేయుచుండెను. మేతమేయు తమకమున నది హనుమప్ప గడ్డిమేటిలో దూరినసంగతి వెంటనే గమనించలేదు కొంతసేపటి కది తనదగ్గఱ నాయఁడు లేనిసంగతి గ్రహించెను. అప్పుడు దానికి కంగారుపుట్టెను. కాళ్ళతో నాగ్రము సత్తువకొద్ది తన్నుకొనెను. అందుచేత దానినికట్టియున్న యినుపగూటము తాడుతోఁగూడ నూడివచ్చెను. ఆ గుఱ్ఱ మప్పు డటునిటు తిరుగాడఁజొచ్చెను తురకసిపాయియొకఁడు గుఱ్ఱము విప్పుకొన్నసంగతి గ్రహించెను వెంటనేవచ్చి వాఁడు తాటితో నూగులాడుచున్న ఇనుపగూటమును పట్టుకొని వచ్చి హనుమప్ప దాగుకొనిన గడ్డిమోపుమంచున భూమిలోఁబాతఁబోడఁగెను. నాయఁడు చేతులు పొడుగుగాఁజాచియుండిన కారణమున ఆగూట మాతని కుడియఱచేతిపై మోపఁబడెను. పైన సమ్మెట ప్రేటులు పడుచుండ నాయినుపగూట మతని అఱచేతిని చీల్చుకొనిపోయి భూమిలో దిగఁబడెను.


అట్లయినను హనుమప్ప కదలలేదు; మెదలలేదు. ఎంతబాధకలిగినను ఆతఁడు మూలుగలేదు; ముక్కలేదు. ఊపిరి బిగఁబట్టి, ప్రాణము లుగ్గఁబట్టి యాతఁడు రాయివలెఁ బడియుండెను కొంచ మలికిడియైనను గూటముపాతుచున్న సిపాయి హనుమప్పను కనుఁగొని యుండును. అప్పుడు హనుమప్ప ఖండింపఁబడియుండును; అందుతో నాతఁడు నిర్వహింపవలసిన రాజకార్యము మొదలంటఁజెడియుండును. ప్రాణములకై అతని కంత చింతలేదు. కాని రాజకార్యము చెడుట కారాజభక్తుఁడు సుతరాము ఒప్పుకొనఁడు. కావున గూటము తనయఱచేతిని చీల్చికొనిపోయినను అతఁడు మేను కదపక, పెదవిమెదపక ఎటులో యోర్చియుండెను.

తిరిగి గుఱ్ఱ మూడఁబెఱుకకుండ మేకును లోతుగఁ బాతి సైనికుఁడు వెడలిపోయెను. రెండుజాముల రాత్రి యయ్యెను. స్కంధావారమున సందడి తగ్గిపోయెను. పగలంతయు సమరప్రశంసతో నలసియుండిన తురకభటులు గాఢనిద్రాముద్రితులైరి. అప్పుడు హనుమప్పనాయఁడు మెమ్మదిగాఁ దనపైనున్న గడ్డిని ఒత్తిగించుకొని లేచికూర్చుండెను. ఆతనికుడియఱచేయి మేకుక్రిందనుండెను. ఎడమచేతితో గూటమును కదలించి పెకలించుట కాతనికి సాధ్యపడలేదు. జాగు జేయుచు నట్లుండిన శత్రువులు తన్ను మూఁడఁగలరు. కావున నాసాహసికుఁడు తనకొడవలితోఁ దన దక్షిణమణిబంధమును నఱుకుకొనెను. మునుపటికంటె రక్తమధికముగాఁ గారఁజొచ్చెను. కాని యారాజభక్తుఁడు దానికి లెక్కచేయలేదు; వెంటనే గుఱ్ఱమును విప్పి బయటకుఁ దెచ్చెను; స్వారియై డేరాలనడుమ నేగుచుండెను నిద్రమెలఁకువవచ్చిన తురకసిపాయి లొకరిద్దఱు తలయెత్తిచూచిరి. అర్ధరాత్రియనక, అపరరాత్రియనక అశ్వపాలకులు గుఱ్ఱములను చేయనున్నతుంగభద్రానదికి నీటికై తీసికొనిపోవుట ఆశిబిరమున నిత్యము జరుగువిషయమే. కావునఁ దమవాఁడే ఎవఁడో గుఱ్ఱమును ఏటికిఁదీసికొని పోవుచున్నాఁడని తలయెత్తి చూచిన తురకసిపాయి లనుకొనిరి. ఎట్టి యనుమానమును లేక వారు మఱల యథాప్రకారము తమతమ పక్కలను గఱచుకొని గుఱ్ఱుపట్టిరి.

రాజాజ్ఞ నెఱవేర్పఁగలిగితినన్న సంతోషమున హనుమప్ప చేతిబాధను మఱచిపోయెను. ఇంటి మొగముపట్టిన సంతోషమున గుఱ్ఱము పిట్టవలె నెగిరిపోవుచుండెను. కావున నతఁడు నిమిషములమీఁద నిజాము డేరాల నతిక్రమించెను; నిడుదూరుమిట్టలను వెనుక వైచెను; తుంగభద్రానదిని దాఁటెను; కలుగోట్ల సమీపించెను; సోమనాద్రిగుడారముచెంత నిలిచెను.




“... ..నా సాహసికుఁడు తనకొడవలితోఁ దన దక్షిణమణిబంధమును నఱకుకొనెను.”




"హాసుమప్పనాయఁడు గుఱ్ఱమును దిగి యెడమచేతితో సోమనాద్రికి సలాముచేసెను."

అప్పటికే సోమనాద్రిలేచి సమరసన్నాహములు నడుపుచుండెను. హనుమప్పనాయఁడు గుఱ్ఱము నుదిగి యెడమచేతితో సోమనాద్రికి సలాము చేసెను. తన యశ్వరత్నమును చూచి రాజానందాతిశయమునఁ బరవశుఁడయ్యెను పిమ్మట అతఁడు నాయఁడు ఎడమ చేతితోఁ దనకు సలాము చేయుట కనుఁగొనెను. అప్పు డాతని మొగమున దన్ప్రారాని కోపచిహ్నములు ముద్రిత మయ్యెను గుఱ్ఱము వచ్చెనన్న సంతోషమున, నాయఁడు ఎడమచేతితో సలాము చేసెనన్న కోపమున నాందోళితుఁడైయున్న సోమనాద్రి కన్ను లాసమయమున మొండియైయున్న హనుమప్పకుడిచేతిపైఁబడెను. అప్పు డాతఁడు మిన్నుముట్టిన యాశ్చర్యముతో "మిత్రుఁడా! ఇదియేమి?" అని హనుమప్పను ప్రశ్నించెను. నాయఁడు జరిగినసంగతి నంతయు వినిపించెను. విషాదము, ఆశ్చర్యము కలిగి సోమనాద్రి హనుమప్పను కౌఁగలించుకొనెను. "నాయఁడా! ఏది అడిగినఁగాని ప్రాణాధారమగు మెతుకులు నోటికిఁజేరవో అట్టికుడిచేయి నాకొఱకు నఱుకొన్నావు. నీ యీఋణము నేను వేయిజన్మములెత్తినను తీర్చుకొనఁజాలను. ప్రాణములను తెగించిన నీవంటి వీరుఁడు; మనసిచ్చి మనసుపుచ్చుకొను నీవంటి స్నేహితుఁడు ఉండఁగా నేను నిజాము అలీనేకాదు, అతనితలఁదన్నినవారినికూడ జయింపఁగలను" అని సోమనాద్రి హనుమప్పతోఁ జెప్పెను.

అంతట సూర్యోదయమయ్యెను. కమలములతోఁబాటు గద్వాలసైనికుల ముఖములు కూడ వికసించెను. సోమనాద్రి యుత్సాహమునకు మేరయే లేదు. అచ్చట నిజాముడేరాలో సోమనాద్రియశ్వము దాఁటిపోయినదని యందఱకుఁ దెలిసెను. ఇది తెలిసికొని నిజాము నిరుత్సాహుఁడయ్యెను. సోమనాద్రి తురల సైతానువలెఁ దమ్ముక్రూరించునని తురకభటులు దిగ్భ్రాంతులైరి. అప్పుడు సోమనాద్రి నగారా మ్రోయించెను. ఆమ్రోత వినినతోడనే నిడుదూరుమిట్టలపై నిజాము సైనికుల హృదయములు గద్వాలరణభేరివలెనే దడదడ కొట్టుకొన నారంభించెను. ఎట్లో మనసు కుదుటఁబెట్టుకొని నిజాముఅలీ, సయ్యదుమియ్యాలు తమసేనలను మొగ్గరము దిద్దుచుండిరి. ఇంతలో సోమనాద్రి తనసమరాశ్వము నెక్కి సేనాసమేతుఁడై వచ్చి తురకసైన్యమును చుట్టుముట్టెను అప్పుడు సమరము తీవ్రతరమయ్యెను. తురకసేన తెనుఁగువీరుల కౌకకుఁ దాళఁజాలక కకావికలయ్యెను. చేయునదిలేక అప్పుడు నిజాముఅలీ, సయ్యదుమియ్యాలు సోమనాద్రితో సంధిమాటలు నడపిరి ఉదారశీలుఁడగు సోమనాద్రిభూపాలుఁడు సంధి కంగీకరించెను. తామోడినందుకు గుఱుతుగా నాముహమ్మదీయప్రభువు లొకగొప్పఖిల్లతును సోమనాద్రికి సమర్పించిరి.

దానిని స్వీకరించి సోమనాద్రి తనసేనలతో గద్వాల నగరమును చేరెను. పిమ్మట నాతఁడు సభకు వచ్చి కూర్చెను. సహాయముగా వచ్చి ప్రశంసాపాత్రముగా మెక్కపోని బీరమున సమరమునల్పి తనకు జయలాభమొనగూర్చిన వీరుల కందఱకు నగలు, నాణెములు; మడులు; మాన్యములు ఇచ్చి సోమనాద్రి నిండుసభలో వారిని సత్కరించెను. అంతట ముఖ్యముగ హనుమప్పనాయనినిపిలిచి సోమనాద్రి భూపాలుఁ డిట్లు చెప్పెను.

"మిత్రుఁడా! విజయప్రశంసాత్మకమగు నీసభ నేఁడిట్లు వచ్చుట కూడుటకు మీరు కలిగించినది నీభాగ్యఫలములు. ప్రాణాపాయమునకు శంకింపక శార్దూలవదనము వంటి శత్రుశిబిరమును చొచ్చినావు. అంగవికలత్వమునకుఁ గూడ సహించి సాహసముగ నీవు పులినోటికండ్లగు నైన నా అశ్వరత్నమును విడిపించుకొని వచ్చినావు. ఇంతటిమేటి యుపకృతిచేసిన నీకుఁదగిన ప్రత్యుపకృతి నే నేమిచేయఁగలను? నీవుచేసిన సాహసకృత్యము ధనముతోఁగాని, భూమితోఁగాని వెలఁబెట్టుటకు అతీతమై యున్నది. అయినను నీవు వెల్లడిచేసిన రాజభక్తికి మెచ్చిన ట్లేదేని నీకొసంగి నా విశ్వాసమును ప్రకటింపఁగాని గద్వాలలో వెలసియున్న కేశవస్వామివారి నామైగోపురింపుగ. కాపున నీకు గ్రామముగ 'చెంగన్నపల్లి' నీకు సర్వాగ్రహారముగా ధారాదత్తము చేయుచున్నాను. నీవు కనఁబఱచిన సాహసమునకుఁ జిన్న గ్రామమిచ్చుట జీవరత్నమునకు బదులు చిల్లిపెంకు యిచ్చుటయే యగును. ప్రత్యుపకృతి గాఁగాక నీయందు

నాయకుల విశ్వాసప్రకటనమునకుఁ గాను నీ కీ గ్రామమిచ్చుచున్నాను. స్వీకరించి పుత్ర పౌత్ర పారంపర్యముగ సుఖాన అనుభవింపుము."

మును, రక్షోజనతాపరీవృతమహీపుత్రిన్ విలోకించి యా
హనుమంతుం డొనరించినాడు విభుకార్యంబున్ వెసన్; శత్రురా
ణ్ణనమధ్యంబుననున్న నీప్రభువునశ్వశ్రేష్ఠముందెచ్చి తో
హనుమప్పా! మరువంగఁజాలరుగదయ్యా! తెన్గుబిడ్డల్ నినున్.
పాణిభ్రంశ వినిర్గళద్రుధిర సంపాతమ్మునన్ దాపక
ప్రాణత్యాగ సమున్ముఖామల మనోభావమ్మునన్ నేఁటికిన్
రాణింపంగల స్వామికార్యపరతంత్రత్వంబు, సద్భక్తిపా
రీణత్వం బెఱిఁగించు నాంధ్రజనయిత్రీ పుత్ర కీర్త్యున్నతుల్.

ఇట్లుచెప్పి సోమనాద్రి దానశాసనము వ్రాయించి బొచ్చుంగన్నపల్లి హనుమప్పనాయనికిచ్చెను. ఆ రాజభక్తుని సంతతివారు నేఁటికిని గంద్వాల సంస్థానమునందు ఆ బొచ్చుంగన్నపల్లి యగ్రహారమును సుఖాన ననుభవించుచున్నారు. ప్రపంచము నందలి వివిధదేశచరిత్రలలో ఏదేశచరిత్రమందును ఈ ఆంధ్రరాజభక్తుని చరిత్రవంటి చరిత్ర కానరాదు.

# కోల్పడిన ప్రేమకు

కనులు విచ్చి నీదుసమాధి కాంచ లేను
అట గులాబి తీయని దెంతయైన నేమి!
నా అడుగులంట పర్వు శూన్యతను కడుగు
పెనుతరంగాల మ్రోతల వినుటె చాలు!

ఊరట వహింతునా? మహాదూరమున వ
సింతువేమొ జీవాత్మవై, ఎదో అగాధ
నీరవత ఆవరించగా తారకలకు
చుట్టు నెలకొను నిశ్శబ్ద మట్టిది విను.

శీతలిని నీ వైతివి! ద్యోతలాన
నివసముందువు నీయంత నీవె, అచటి
అమితమతిమంతమైన నీహాయిలోన
పరిహృత మ్మిమ్మహృదున్నత్తభావమెల్ల.

కాని యైన నొక్కొక వేళ కాంచెదీవు
కడచు నొక్కనిశ్వాసమ్ము. గాఢబాధ;
చకితనౌదు తెరువంబడి స్వర్గమందు
ద్వారమొకడు వెన్వెంట మూతపడినట్లు.

సంచలింతు నీవింత ప్రశాంతములగు
ప్రార్థనాగీత లచ్చటి వాగిపోవు,
సగము స్మరియింతు నీవొక్కక్షణము నన్ను:
మరల నీశాంతిలోనికి మరిగిపోదు.

ఐన నయ్యయో! ఇకపై ననారతమ్ము
నీదు చూపు, నవ్వు, హాయులు, నీగళమ్ము,
వివిధతావకభూలోకవిభ్రమములు
పోవు నెన్నెన్నొ చినిచిన్ని ముచ్చటలవి.

కాన తావకీనసమాధి కాంచ లేను
అట గులాబి తీయని దెంతయైన కాని,
నాఅడుగులంట పర్వు శూన్యతను కడుగు
పెనుతరంగాల మ్రోతలే వినగవలతు.

— స్టీఫెన్ ఫిల్లిప్స గీతముల కనువాదము.

శ్రీరంగం శ్రీనివాసరావు

# సింహళ ద్వీపం కైఫియ్యతు

## [మధుర ఆంధ్రనాయకరాజు సింహళద్వీపపురాజును జయించిన వృత్తాంతము.]

ఆదియందు పాండ్యదేశానకు రాజైన రాజా విశ్వనాథనాయనిగారి కొమారుడైన రాజా పెద్ద కృష్ణప్పనాయడు రాజ్యపరిపాలనం చేస్తూవున్నప్పుడు వర్ణసహస్రం గుఱ్రంకట్టి తుంబిచ్చినాయడని వ్యాకరిపాళయప్పట్టు ఆతుంబిచ్చినాయడనేవాడు పరమగుడిలో కోటవేసుకుని ఆరాజ్యమంతా కట్టుకొని పాండ్యదేశం చోళదేశంలో సరిపోయినట్టు కొల్లపెట్టి చిల్లర చేస్తుండగా పాండ్యదేశానికి రాజైనటువంటి పెద కృష్ణప్పనాయనివారు వీని దుర్మార్గములువిని జోరు తాకీతులుగా వ్రాశిపంపించినందున అది లక్ష్యంశాయక మరిన్ని గుఱ్రంపట్లంజా అధికముగా శేఖరంచేసుకుని వీరిమీదను యెదరాళిగాను వీరితాణీవులువున్న తావులలో వచ్చిపడి హాతపరిచి మరిన్ని శీమయందు కొల్లపెట్టుతువున్నందుచాత రాజా పెద కృష్ణప్పనాయనివారు విని చాలా ఆగ్రహంతోకూడా తమ సైన్యానికి వ్రాసి రప్పించుకొని తమదళనాయకుడైన పెద్ద కేశవప్పనాయనివారికి వుత్తరవుయిచ్చి తుంబిచ్చినాయనిమీద రణభేరివేయించి దళనాయకుడైన పెద్దకేశవప్పనాయనివారిని దళంతోటట్టు ముందర సాగమని ఆజ్ఞాపించిన ప్రకారం యుద్ధసన్నాహముగా మానామధురలో తుంబిచ్చినాయనికోటమీద తాకి యుద్ధమైనందున తుంబిచ్చినాయడి తమ్ముడు చినవీరతుంబిచ్చినాయడున్ను పదివేళదళమున్ను, రెండువేలగుఱ్రమున్ను పరమగుడి నుంచి రాత్రిరేవచ్చి కోటలోపల చొచ్చి ముందరవున్న జనంతో రెండువేలజనం కూడా నుంచి ఆరాత్రే యీపెండుమీదవచ్చి తాకినందున పెద కేశవప్పనాయని వారు వుశారుజేసుకొని పాళయం నఖముఖాలకున్ను మత్తాపులువేయించి ఆరాత్రి ముచ్చెట బహుయుద్ధమై తుంబుచ్చినాయడిదండులో యేనూరు గుఱ్రమున్ను, రెండువేల కాలబలమున్ను ఛేదమై చినవీరతుంబిచ్చినాయనికిన్ని రెండుగాయములుతాకి అంతట విరిగి కోటకుపోయి చేరినాడు. పెద్దకేశవప్పనాయనివారి దండులో మున్నూరుగుఱ్రమున్ను, వేయిన్నేనూరు జనమున్ను ఛేదమయినది.

అది సద్దశాయక నాడు పగలు ముచ్చెట కోటచుట్టుకొని జగడంచేశి ఆరాత్రే కోటకు నఖముఖాలా నాలుగు మోర్జాలువేసి ఫిరంగులు యెక్కించి కోటమీదనున్ను, కోటకులోపలనున్న గుండ్లప్రయోగం చేశినందున కోటలో చాలాజనులు ఛేదమైనయెడల ఆ తుంబిచ్చినాయడి బావమరుదులు పెదవీర బొమ్మినాయడనిన్ని రణవీర బొమ్మినాయడనిన్ని వీరిద్దరున్ను అనేకయుద్ధములలో జయించి రణశూరులని తుంబిచ్చినాయడివద్ద కితాపులు పుచ్చుకొన్నవారు గనక వారిద్దరున్ను వారిదళములో నాలుగువేలజనం వొఖవయసువారినిగా యేర్పరిచి రెండుచేతులుగా యిద్దరున్ను పంచుకొని రెండు మోర్జావులమీదవచ్చి పడి మోర్జావుల్లోవున్న జనమున్ను హతంజేసి మోర్జావులున్ను సాపుచేశి పిరంగులున్ను తీసుకుని కోటకుపోతూవుండగా పెద్ద కేశవప్పనాయడివద్దనుంచి యెలకోలు వీరప్పనాయడున్ను రెండువేలజనమున్ను అడ్డంతాకి బహుయుద్ధమై వుభయత్రాల్లో జనఛ్ఛేదమయి రణశూర బొమ్మినాయడిక్కి వొఖతొడ గుండుతాకి విరిగి అతణ్ని సమాళించి యెత్తుకుని హతశేషాన్ని శేఖరించుకొని పట్టిన పిరంగులలో యెలగోలు వీకప్పనాయడు రెండు ఫిరంగులు అడ్డంతాకి తిప్పుకొన్నదిపోగా కడమ నాలుగు ఫిరంగులున్ను గాయకాళ్లనున్ను సమాళించి తీసుకొని రణవీర బొమ్మినాయడు కోటలోపలికిపోయి చేరి బందుబస్తుచేసుకొని వున్నంతలో యీసమాచారం రాజువిని యింకా ఆకోటతియ్యక తామసంచేస్తువున్నాడా దళవాయి అని బహుకోపముతో ప్రయాణసన్నాహమయి డెబ్బై రెండు పాళయగాండ్లకున్ను తాకీదులు వ్రాశి వారివారి సయిన్యసహితముగా మానామధుర

పాళెంవచ్చి చేరుమని అజ్ఞాపించి బహుదళసమేతముగా తిరుభువనంవచ్చి అచ్చట పాళెందిగినారు.

ఆసమాచారం చినకేశవప్పనాయడు తండ్రికి వ్రాయగానే ఆకాశితం పెద్దకేశవప్పనాయడు చదువుకొని బహుచింతాక్రాంతుడై యేలినస్వామివారే యీసమానంలేని పాళెగాడిమీద యుద్ధానికి వచ్చినట్టయితే మనం సేనాధిపతిత్వంజేసి యిన్నిదినాలు అనేకయుద్ధములు చేసి జయించినదెల్లా వ్యర్థమాయనని ఆక్షణమే తిరుగా నాలుగుమోర్జాలు తయారుచేసి ఫిరంగులు యెక్కించి ఆమోర్జాల్లో తానేపోయివుండి గుండ్లచాత కోట బహుదూరం పడకొట్టి యెలకోలు వీరప్పనాయడిని వోఖపార్శ్వమున్ను తాను వోఖపార్శ్వమున్ను లగ్గయెక్కినందున పెద్దవీరబొమ్మనాయడు వోఖపార్శ్వమున్ను [illegible] నాయడు వోఖ పార్శ్వమున్ను లగ్గయెక్కిన జనంమీదికి తిరిగి లగ్గయెక్కనీయక అని పోట్లాడినందున యెలకోలు వీరప్పనాయడు లగ్గయెక్కిన పార్శ్వం పెదవీరబొమ్మనాయడు యెదిరించి బహుజనాన్ని ఛేదపరిచి యెలకోలు వీరప్పనాయడు పెదవీరబొమ్మనాయడిచేత బరిచిపోటు మోశి ఆక్షణం మరణమాయను.

అంతట ముందునిలిచిన సర్దారుడు పడగానే జనం వెనక్కుతీశెను. అతనితమ్ముడు చినగురువప్పనాయడు అన్నపడ్డసమాచారమున్ను జనంతిరిగివచ్చేది జూచి [illegible] జనాన్ని తిరిగివచ్చేజనాన్ని నేకరించుకొని పెదవీరబొమ్మనాయడు నిలిచియుండేపార్శ్వం బోయి తగిలి బహుయుద్ధంచేసి బహుదళాన్ని ఛేదపరిచి అన్నపగదీర్చవలెనని పెదవీరబొమ్మనాయడున్ను చిన్నగురువప్పనాయడున్ను యెదురునిలిచి పోట్లాడినందున చిన్నగురువప్పనాయడు పట్టాసాము సాధనలో సమర్థుడు గనక యెదటిచాలాపోట్లు తప్పించి పట్టాతీసి నరికినందున వోఖభుజంతెగి కిందపడగానే ఆపెదవీరబొమ్మనాయణ్ణి తలకోసి సెండామీదకట్టి జయభేరివేశిన మాత్రమే యీతట్టుపళెం విరగబడి చిన్నతుంబిచ్చినాయడిదళంతోను చేరి పెద్దకేశవప్పనాయడివారిమీద బహుకాఠిణ్యయుద్ధముగాను చేసివచ్చుయెడల యెలగోలు చిన్నగురవప్పనాయడున్ను జయభేరివేశిన దళమున్ను వెనక్కువచ్చి తాకి పెదకేశవప్పనాయడువారు వోఖపార్శ్వమున్ను చిన్నగురవప్పనాయడు ఒక పార్శ్వమున్ను నెగ్గి యుద్ధంచేశినందున చినవీరతుంబిచ్చినాయడికిన్ని దళానికిన్ని నిర్వాహకంచేయలేక వకావకలై విరిగి జనమంతా పారిపోయిన్ని చినతుంబిచ్చినాయడు మహాశూరుడు గనక మననేరు మాత్రం పోతున్నదేయని యీపైజనముతోను యెదిరించి మహాఘోరయుద్ధంచేశినందున పెద కేశవప్పనాయడువారు తమ సైన్యానికి తాకీదుచేశి చంపకుండా చెయిపట్టుగా పట్టితెమ్మని తాకీదుచేశినందున చెయిపట్టుకు తగలక మంచిమంచి పేరైన గురికాండ్లను ఛేదంచేశినందుచేత కొట్టివేయమని వుత్తరువైనందున నెగ్గియుద్ధంచేశి తలకాయకోశి యీతలకాయనున్ను సెండామీద కట్టివున్న పెదవీరబొమ్మనాయడి తలకాయనున్ను యీ రెండు తలలున్ను జయపత్రికవ్రాశి త్రిభువనానకు యేలినవారి సముఖానకు పంపించి ఆకోటలో తగుజనాన్ని ఠాణీ వుంచి తక్కిన దళసమేతముగా పరమగుడి కోటమీదికి సాగి కోట పరమగుడిన్ని, తోళుచాత్తు నూరున్నూగా పంపుయావత్తున్ను తిరిగి త్రిభువనముందుండే దండున్ను యేలినవారున్ను మానామధుగుసు యింకా కోటశెయ్యేశేదేయని వస్తూనుండగా యెదురుగానే యీ రెండు తలలున్ను జయపత్రికానున్ను వచ్చింది.

[illegible] మానామధుగుసులో వచ్చి దండుదిగి దళనాయకుడైన పెద కేశవప్పనాయడివారికి సంగరకిరీటియనే కితాబున్ను రత్నభూషణాంబరములున్ను చిన్నగురువప్పనాయడికిన్ని కూడా యుద్ధంచేశిన సరుదార్లకున్ను భూషణాంబరములున్ను పంపినందున పెదకేశవప్పనాయనివారి మొదలైన సరుదార్లు యెదురుకొనివచ్చి నగరిబహుమతులు శిరసావహించి ధరించుకొని మహాసంతోషముతోను వీరాధివీరులై పరమగుడిమీదికి యుద్ధానికి సకలదళసన్నాహముతో పరమగుడిమీదికి పొయ్యేటప్పటికి వర్ణమాయిరతుంబిచ్చినాయడు బహుక్రోధుడై మానామధుగునకోటనుతీసుకొని తమ్ముణ్ణి భావమరిదిని చంపి అనేకదళ

ఛేదమున్నుచేసి యిచ్చటికి వచ్చిరేయని చాలాకోపం తోదట్టి పదివేలు మంచిశిపాయిలున్ను నాలుగు వేల గుఱ్ఱమున్ను శేఖరించుకొని యెదురుగావచ్చి ఉదయం మొదలు అస్తమానంవరకు బహుయుద్ధమైనందున తుంబిచ్చినాయిడి దళమందు గొప్పజగడాలు చేశితేరిన సరుదార్లుగా పదిహేడు మనిషిన్ని వారి బంధువుల్లో ప్రముఖులైన రఘునాధనాయుడు, నరణ శింగమనాయుడు, పాల ముద్దినాయడు, దొడ్డ చిక్కమనాయడు, వీర పాండినాయడు, జక్కమనాయడు, తాడువెట్టి వీరమ నాయడు, మోటు మల్లప్పనాయడు, పులికుత్తి లక్కమ నాయడు యిట్లా తొమ్మిదిమనుషులున్ను మహాయుద్ధం చేశి అనేకులను చంపి తామున్నుచచ్చిపోయిరి. యిది గాక వేయిగుఱ్ఱమున్ను, మూడువేల కాల్బలమున్ను హతమైనారు. పెదకేశవప్పనాయిడివారిదండులో గొప్పసరదార్లలో బంగారు నాగులనాయుడు, తొర యూరు నారశింహ్మనాయుడు, మిట్టపాళయం అయ్యప్పనాయడు, గొజ్జంగి కోసలనాయడు,అమరగంటి ముద్దునాయడు,. పంది సుబ్బలనాయడు, అమరం కొమరప్ప నాయడు, తేన్బహు సామినాయుడు, గొంటుపురం ముద్దు సామినాయుడు, తుపాకుల రామకృష్ణమనాయడు, వీరబాణం కస్తూరిరంగరాజున్ను, గొట్టిముక్కల తిమ్మరాజున్ను, కాకి అళగిరిరాజున్ను, పసుపావడ గంగరాజున్ను, గుర్రాల సెంగమరాజున్ను, కోరివి కృష్ణమరాజున్ను, చందపాటి రాఘవరాజున్ను, ఆవులమంద కృష్ణరాజున్ను, వీరవల్లి రామరాజున్ను, మళ్లపురం గణపతిరాజున్ను, పూసపాటి కొండ్రాజున్ను, రావిళ్ళ రమణప్పనాయడు, పెమ్మసాని రుద్రప్పనాయడు, పచ్చా కస్తూరినాయడు, నాదిళ్ళ నారణప్పనాయడు, నారిగంటి నరసానాయుడు, సరాఫుల వెంకట్రామినాయడు అంతు యిరువైయేడు సరదార్లున్ను, మూడువేల చావున్ను, వెయిజనం గాయములున్ను యీప్రకారం వుభయదళాలున్ను తప్తమై వుండేసమయమందలి మానామధురలో వచ్చి దిగివుండే యేలినస్వామి:వారి పెద్దదండులో యీ సమాచారం తెలిశేతెలిశే అంచల్లో కబురు పోతూనుండగా రాజా పెదకృష్ణమనాయినివారు మనసైన్యమందు యింత జనమున్ను, పేరైన గొప్పసరదార్లు యిందరున్ను మృతిబొందిన్ని యింకా తుంబిచ్చి సరిగ్గా అని పోట్లాడుతున్నాడుగదా అని బహుఆగ్రహముతో తనవద్దవుండే సయిన్యములో అర్థభాగం తయారుచేసి అందు పైన గొప్ప సరుదార్లను నేమకంచేసి దళకర్త పెదకేశవప్పనాయినికి సహాయంగా అంపించినందున మానామధురకు పరమగుడి పదిఘడియలదూరం గనుక అస్తమానమైన జామును యీసైన్యంపోయి చేరగానే పెదకేశవప్పనాయినికిన్ని, అతనివద్ది సేనకున్ను బహుధైర్యమున్ను, వుత్సాహమున్ను కలిగి పెదకేశవప్పనాయినివారి బాకిదళమున్ను, వచ్చినదళమున్ను రెండున్ను విజృంభించి ఆ రాత్రే వారిదండుమీదపోయి మూడుచేతులుగా పంచుకొని యుద్ధంచేశినందున తుంబిచ్చినాయుడు ముందరను అనేకఛేదమై అనేకమొనకాండ్లుగా సరదారులు పోయినందువల్లనున్ను యిప్పుడు మూడుచేతులుగా పంచి యుద్ధంచేశినందున అనేక ఛేదమై వకావకలుగా విరగపడితేశింది వేశినట్లా పారి పరమగుడి కోటలోపల చొరబడిరి

పెదకేశవప్పనాయడున్ను, దండున్ను వాడు పారవేశిన ఆయుధములు, సామానులు యావత్తున్ను యెత్తుకొని కోటకు ముత్తిగెవేశి నఖముఖాలాచుట్టుకొని దండంతాదిగి గాయకాండ్లను గాయాలుకట్టి సావధానం శాయమనిన్ని నకముఖాలా మోర్చాలువేయమనిన్ని, సరుదార్లనున్ను, కామాటమున్ను నేమించి బత్తేరులలో ఫిరంగులు యెక్కించి కోటమీదగుండ్లు ప్రయోగించి వోభపార్శ్వంకోట యిడతోట్టి లగ్గయెక్కిటప్పటికి తుంబిచ్చినాయుడున్ను వానిదగ్గనుండే సరుదారులున్ను మంచి మొనజనమున్నువచ్చి లగ్గముఖాన ఆని తుపాకులచాతనున్ను బల్యాలచేతనున్ను ముందర లగ్గయెక్కిన జనాన్ని బహుశా ఛేదపరచి లగ్గయెక్కిన జనాన్ని చచ్చినవారుపోగా కడమ దిరిగి పలాయనమయినందున దళకర్త పెదకేశవప్పనాయడు బహు ఆగ్రహముతో దిరిగిన జనాన్ని. శేఖరించుకొని మరిన్ని వుండదగ్గ సరుదార్లనున్ను వారి పార్శ్వపుజనాన్నిన్ని

శేఖరించుకొని తానే లగ్గయెక్కేటప్పటికి. తుంబిచ్చి నాయడున్ను వారిజనమున్ను చేయికలశి సంకులసమర మయినందున వుభయత్రా బహుజనమున్ను మంచి మంచి మొనగాండ్లున్ను పడిరి. అప్పుడు దళనాయకుడైన పెదకేశవప్పనాయడికి శరకోలగుండు రొమ్మున తాకి పీపునదున్న క్షణమే మృతిబొందినందుచేత దళం నిభాయించకూడక కొంతజనం విరిగి పాళెం వచ్చిచేరను. కొంతమొనగాళ్లు సరుదార్లు అక్కడనే పడి మృతిబొందిన్ని గాయాలతో పడిరి. దళకర్త అల్లుడు మంగపతి నాయడు మాత్రం జెయించినయుకో నిలచి గాయికాండ్లనున్ను పెదకేశవప్పనాయణ్ణి యెత్తించుకొని పాళెం వచ్చిచేరి యీసమాచారం యేలినవారికిన్ని దళవాయి కొమారుడు చిన్నకేశవప్పనాయడికిన్ని కాకి తంవ్రాశి పంపించి తాను యధాప్రకారం పాళెమున్ను, మోర్జాలును బందుబస్తు చేసుకొని భద్రముగా వుండెను.

తుంబిచ్చినాయడు అక్కడి గాయకాండ్లున్ను వారికిన్ని బహుఖేదముగనక బయలువేరుట శక్తిలేక కోటలోగానే వుండుకొని వుండిరి. యీ వర్తమానములు మానామధురలో చేరిన మాత్రమందు యేలినవారు బహు ఆగ్రహంతోడనున్ను ఆక్షణమున తామే సయినమయి యుద్ధసన్నద్ధులైన సమయమందు విదళకర్త ప్రధానులైన పెదకేశవప్పనాయడువారి కొమారుడు చిన్నకేశవప్పనాయడు యేలినవారిసమక్షమందు వచ్చి మా తండ్రిని చంపినపగనే తీర్చుకోవలెకాని యీపనలకు యేలినస్వామి బయలుదేరవలసినది యేమియున్నది. క్షణమాత్రమందు వానికోట నుగ్గుచేశి పుత్రమిత్రాదులతోను హతంచేశి వస్తున్నానని ప్రతిజ్ఞచేశి రణభేరి వేసుకొని బయలుదేరేటప్పటికి యీపాళెన్నుంచి మంచి మొనకలిగిన జనములో ఆరువేలజనమున్ను పాళెగారులలో నత్తం లింగమనాయుడు, మరుంగాపురి బూచినాయడు, కొమారవాడి లక్కినాయడు, యిలుప్పూరి కామాక్షినాయడు, కరిశపట్టి బొమ్మినాయడు, నెడువయిల్ అళగారినాయుడు, కొత్తకోట పల్లవరాయడు కొత్తూరి అక్కల్ రాజు, వీరమలె కమ్మినాయుడు, తోగమలె బసవప్పనాయుడు, రామగిరి సామినాయుడు, పిల్లెమువింగి ముద్దినాయుడు, కన్నివాడి అప్పనాయుడు యీపాళెగారులున్ను వారితెగలో పదిహేనువేల జనమున్ను ఆరుఫిరంగులున్ను తీసుకుని పరమగుడి పాళెమ్మకును వచ్చి తండ్రిగారి దహనాదివుత్తరక్రియలు చేశి తోడుతనే దండుతయారుచేశి మోర్జాలమీద మరికొన్ని ఫిరంగులు యెక్కించి నకముఖాలా కోటను ఇడకొట్టి తాను తనవెంటవచ్చిన దండున్ను వొకపార్శ్వమున్ను, ముందర, అచ్చట వుండినదండున్ను అల్లుడు మంగపతినాయుడు వొకపార్శ్వమున్ను, పాళెగాండ్లు రెండుపార్శ్వములయందున్ను యీ ప్రకారముగా లగ్గయెక్కేటప్పటికి తుంబిచ్చినాయుడున్ను నకముఖాలా అని బహుయుద్ధంఅయ్యేటప్పటికి చినకేశవప్పనాయిడి పార్శ్వం యెత్తించిన జనాన్ని కొట్టిలోచొచ్చిన మాత్రమే జయభేరివేశినంతనే మూడు పార్శ్వాలవారున్ను లగ్గయెక్కి చేయికలిశి లోపల వున్న కార్యస్థులనున్ను తుంబిచ్చినాయిణ్ణిన్ని తలకాయలు కోశి దళమంతా అచ్చటనే నిలిపివేశి చినకేశవప్పనాయడున్ను అల్లుడు మంగపతినాయడున్ను, మరి కొన్ని కార్యస్థులున్ను తుంబిచ్చినాయిడి తలతీసుకుని మానామధురకోటకు వచ్చి యేలినస్వామి సముఖమందు భేటీచేశినమాత్రమే చాలా సంతోషపడి చినకేశవప్పనాయిడికి తండ్రివుద్యోగమున్ను యిచ్చి అనేక బిరుదులున్ను రత్నాభరణభూషణాంబరములున్ను యిచ్చి మంగపతినాయిడికిన్ని వస్త్రాభరణములు యిచ్చిరి. తోడుతోనే మానామధురలో వున్న దళమంతా శేఖరించుకొని పరమగుడికి వచ్చిచేరి కోట యావత్తు యిడియకొట్టిరి. అప్పుడు తుంబిచ్చినాయిడి పెళ్లె బిడ్డలున్ను బిడ్డబిడ్డలిన్ని కాళ్లలోవేశి చాలాగా వంతపడ్డందున యేలినవారిక్కి దయవచ్చి వాండ్లకు పరమగుడి కావలిన్ని సాంబూరుగ్రామమున్ను యిచ్చి యిట్లావుండగా ఖండిదేశంరాజు మనకు నిండా హితముగావున్న తుంబిచ్చినాయిణ్ణి వీరు కొట్టినదుర్నాయని బహు ఆక్రోశముగా మాటలు వత్యాసముగా మాట్లాడినాడని వర్తమానం వీరువిని ఖండివారిప్రస్తాపం మనం శాయకనే వుండుట మనప్రస్తాపం వీరు శాయకపనియేమియని యి

తరం యీ బైయయిదుపాళెయకాండ్లున్ను శేఖరించి స్థోమశుద్ధి చేసుకొని రణభేరి వేయించి దండు సాగింపు కొనిపోయి దర్భశయనం మొదలు నవపాషాణాలవరకు యేకముఖముగా దండుదించి కరతురలలో కలిగిన పడగులంతా నవపాషాణం రేవుకురప్పించి వళమంతా పడవలమీద యెక్కించి తామున్ను పడవెక్కి - ఖండదేశం కరతోరమన్నారు రేవులో పోయిదిగి అప్పటనుంచి ఖండిరాజుకు వ్రాశి పేషకబ్జు కొంచురమ్మనిన్ని, భేటీకి రమ్మనిన్ని, రాశినందున ఖండిరాజు నేను శింహాసనాధిపతిని, కిరీటాధిపతిని. నేను వకరికి పేషుకబ్జు యిచ్చేది లేదని దండెత్తి వస్తున్నాడని విని రాజా పెదకృష్ణప్పనాయడువారు తమదండున్ను, పాళెకాండ్లున్ను రణభేరి వేశి యెదురెక్కసాగిరి. పుత్తరంసరల్లో వారు వచ్చి దిగిరి.

—సశేషము.

## గుడిలోని దైవమా!

గుడిలోని దైవమా! ఆలింపవోయి!
గుడిలోని దయ్యమా! పైకిరావోయి!
నీపాదపూజకై
వెదకి తెచ్చినపూలు
నీపాదసేవకై
నింపి తెచ్చిననీళ్లు
పనికిరావంటారు
మైలపడెనంటారు.
గుడిలోని దైవమా! ఆలింపవోయి!
గుడిలోని దయ్యమా! పైకిరావోయి!
మాలమెట్టిననేల
మాలముట్టిననీరు
మాలపాడినపాట
మాలలాడినమాట
మైలపడెనంటారు
పనికిరాదంటారు.
గుడిలోని దైవమా! ఆలింపవోయి!
గుడిలోని దయ్యమా! పైకిరావోయి!
ఆర్యఋషిసంతాన
మంటరానిదియంట
నీవు చేసినసృష్టి
కీ కళంకాలంట
నీకన్నకొడుకులము
నిను చేరరానీరు
పూజారులెవరోయి!
భూదేవులెవరోయి!
గుడిలోనిదైవమా! ఆలింపవోయి!
గుడిలోనిదయ్యమా! పైకిరావోయి!
కట్టగుడ్డ లేక
గాసిల్లమన్నారు
కుడువకూడూ లేక
కూలిపోచున్నారు
నీగుడికిరానీరు
నిను వేడుకోనీరు
నిన్ను రాతిగజేసి
నిలుపుకున్నారు
గుడిలోనిదైవమా! ఆలింపవోయి
గుడిలోనిదయ్యమా! పైకిరావోయి!

పురిపండా అప్పలస్వామి.

# ఆంధ్రభూమీ!

౧

ఆంధ్రభూమీ!
పూలపండుగ
కందగించిన
నీ వినూత్నో
త్సాహసంపదలే
వసంతుని
స్వర్గరాజ్యములు.

౨

పూతగిల్లిన
నీతలంపే
లేతవలపై
శ్రీవసంతుని
కంఠమున ము
త్యాలసరమై
కళలు గాంచినదీ.

౩

తొలకరించిన
నీమనమ్మున
మొలకలెత్తిన
జీవరాగము
తెలుగుతోటకు
నిండువెలుగై
వలపు నిల్పినదీ.

౪

కాపుకన్నియ
తీగకంఠము
కళలు రాగాం
బరము నింపుచు
నూర్జితమ్మగు
కావ్యలోకము
నూపివేసినదీ.

౫

తలపులన్నీ
నిత్యములుగా
పలుకులన్నీ
ముత్యములుగా
కర్షకుడు గొం
తెత్తిపాడెను
కావ్యలోకాన.

౬

ఆంధ్రవీరుల
పౌరుషమ్ముల
నందగిల్లిన
వీరగేయము
గౌతమీకృ
ష్ణా స్రవంతులు
కలిసిపాడినవి.

౭

మాయమైలో
కాలుదిరిగే
తీయగా హృద
యాలగాంచీ
వాయుమండల
మద్భుతమ్మగు
వార్త దెల్పినదీ

౮

కొండకోనల
నిల్చిపాడే
పండువలపుల
పల్లెపడుచే
జాతిగుండెలు
కరుగజాలే
రీతి జూపిందీ.

౯

కోలుపోయిన
ప్రణయజీవము
కాఱుకుఁ చీకటి
లో మునింగిన
రాగిణీహృద
యాన కరుణా
రసము పొంగిందీ.

౧౦

మేఘమాలిక
లందు వెలిగే
మెరుపుకన్నియ
నిత్యలీలా
ముగ్ధజీవుని
హృదయమున నిజ
ముద్ర వేసినదీ.

౧౧

సత్యమగు
ప్రేమమ్ముకోసము
నిత్యహృదయము
ధారవోసిన
భ్రమరజీవము
ఫలశ్రుతిలో
పసలు జూపినదీ.

౧౨

పండువెన్నెల
నిండువెలుగున
తాండవించే
ముగ్ధహృదయము
చందమామే
పొంగజాలు, ఫ
సందుజూపినదీ.

౧౩

గున్నమామిడి
కొమ్మనుండే
కోకిలము మృదు
గళముదీరిచి
ప్రకృతిపురుషుల
ప్రణయరూపము
పాడసాగినదీ.

౧౪

అమృతజీవని
యౌవసుందరి
యరమరలు
లేనట్టివలపున
నీదజాలెను
భావవార్ధుల
నీశ్వరునితోడన్.

౧౫

తొలకరించిన
భూములందీ
తెలుగుతోటను
నాటగానే
వలపునేర్చిన
చిన్నికృష్ణుడు
వచ్చెనమ్మ వసంతుడై

౧౬

చూడలేమా
విశ్వరూపము!
పాడలేమా
జీవగానము!
పాడిచూడం
గలము; తల్లీ!
భయము మన కేమి?

# పెళ్లికూతురు

## ౧౧

"ఎంతదారుణం! ఇంతకూ, పాపం, మూడోపెళ్లి గీతకూడా ఉంది కామట్లు," అన్నాడు రాఘవయ్య దీనంగా.

వెంకటేశ్వర్లుగారు చిరునవ్వాపుకుని దీపంకొద్దిగా పెద్దదిచేసి బాల్యస్నేహితుడివంక చూస్తూ ఊరుకున్నాడు.

రాఘవయ్య నూటిగా వెంకటేశ్వర్లుగారి మొహంవంక చూసి పదేళ్ళయింది. అంతక్రితం రాఘవయ్య, వెంకటేశ్వర్లుగారుకూడా కొంచెం అటూఇటూగా తన హోదాకు సమానమైన హోదాగలవాడేనన్నట్టు నటించారు. కాని పదేళ్లకిందట రాఘవయ్య కొన్నిపరిస్థితుల వల్ల దివాలాఎత్తటం, వెంకటేశ్వర్లుగారు రొక్కంపట్టున మరోఇరవై ఎకరాలు సుక్షేత్రమైన మాగాణీభూములు కొనటం జరిగింది. భగవంతు డింతపక్షపాతంతో ప్రవర్తించటం రాఘవయ్యకు చాలాఆగ్రహకారణమైంది. కాని వెంకటేశ్వర్లు తనబాల్యస్నేహితుడని నలుగురి చెవులావేస్తూండటం చాలాఅవసరమనీ, తనికమీద ఆయనవంక తేరిచూడలేకపోవటంవల్ల తనకు కలిగే హాని ఏమీలేదనీ తీర్మానించుకున్నాడు రాఘవయ్య. ఆ పెద్దమనిషి ఇప్పు డాప్రకారంగానే వెంకటేశ్వర్లు గారి దృష్టితప్పించి ఇల్లంతా కలియచూసి, "ఎట్లాగైనా ఇంటికిసంబంధించినజ్యోతి లేకపోయినతరవాత ఇల్లు కళావిహీనంగా ఉండటంలో ఆశ్చర్యం ఏమిటి? మళ్ళీ కొంతకాలం ఇట్లా—"

"తరవాత?" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

తనధోరణిలో తను అనదలుచుకున్న ముక్క వెంకటేశ్వర్లుగారి ప్రశ్నకు సమాధానంగా అనాలంటే రాఘవయ్యకు ఒక్కక్షణం నోరుపట్టేసింది—పాడబోతున్నవాణ్ణి పాడమన్నట్టు; కాని చాలాధక్కాముక్కాలు తిని చేవదేలినఘటం కాబట్టి తట్టుకున్నాడు.

"తరవాత ఏముంది? కళ్యాణం! ఆగుతుందా ఏమిటి?"

"నాకింకా ఆమాట తట్టలేదుసుమా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

ఆయనమాటలో ఎక్కిరింపు రాఘవయ్య గమనించలేదు.

"తట్టలేమా! ఇంకా నీదగ్గిరికి ఎవరూ రాలేదేమిటి? నాతో నీవిషయం నలుగురైదుగురు ప్రస్తావించారు. చిన్నవాడు, జమీందారు, బుద్ధిమంతుడు, మంచి పదవిలో ఉన్నవాడని శిఫార్సుచేశాను."

"ఎవరు చిన్నవాడు?"

"నువ్వే, ముప్పైఅయిదేళ్లవాడు ముసలివాడా ఏమిటి?"

"మనిద్దరికీ ఒక్కసారే అక్షరాభ్యాసమయింది. తెలుసునా? నీవయస్సెంత?"

రాఘవయ్య ఆశ్చర్యం నటించాడు. ఆయన వయస్సు నలభైఅయిదు కేమాత్రమో ఎక్కువేకాని తక్కువకాదు.

"అయితేమాత్రం! డెబ్భైఏళ్లకు పునర్వివాహం చేసుకున్నవాళ్లున్నారు"

"ఇచ్చేవాళ్లుంటే"

"నీ కిచ్చేవాళ్ళే లేరా? ఎనభైమంది పిల్లలు దొరుకుతారు. అపూర్చీనాది. కాని అన్నివిధాలా అనువైనపిల్ల నేను చూసినంతట్లో—"

"ఇచ్చేవాళ్లు నన్ను చూస్తారా? నా ఆస్తి చూస్తారా?"

"అది చాలా కష్టమైనప్రశ్న. కాని నిన్నుచూసి ఇచ్చేవాళ్లు లేకపోలేదు."

"ఒక్కర్ని చెప్పు."

"నేను." రాఘవయ్య చిరునవ్వునవ్వాడు.

వెంకటేశ్వర్లుగారు భావరహితమైన మొహంతో రాఘవయ్యవంక నిదానించి చూశాడు. రాఘవయ్య సైచ్ఛాన్నిగురించి ఆయన కేవిధమైన అనుమానం ఎన్నడూ లేదు.

"నేనూ మా శారదాంపు ఎక్కడ తగినసంబంధం దొరుకుతుందాఅని చూస్తున్నాను, వెంకటేశ్వర్లూ! ఇదే ఇంకోళ్ళయితే తొందరపడి పెళ్ళిచేసుకోనున్ను. కాని నాదగ్గిర నీకు అనుమానం ఎందుకు? చిన్నప్పటి నించీ పిల్లదాన్నెరుగుదువుకదా! కాని అందచందా లెరుగుదువుకదా! దాన్నింకొకరి కివ్వటానిక్కూడా నాకిష్టంగాలేదు."

వెంకటేశ్వర్లుగారు మాట్లాడలేదు. రాఘవయ్యకు కొద్దినిరుత్సాహం కలిగినా వెనక్కుతియ్యలేదు, ఆ వేడిమీదనే మరికొంచెం దెబ్బలు కొట్టిచూద్దామను కున్నాడు.

"నీ కట్లాగో పెళ్ళి కావలసిఉంది. నాపిల్లకూ వివాహం కావాలి. నీతో సంబంధమంటే నా కెంతఉత్సాహంగా ఉందో నీకూ అంతఉత్సాహంగానే ఉందని అనుకుం టున్నాను. ఆలోచించుకో. కొత్తవాళ్ళతో సంబంధం చేసుకొని పెళ్ళయిన కుర్నాటినించీ కష్టమైన సంసారం కంటె స్నేహితంలో బాంధవ్యం —"

వెంకటేశ్వర్లుగారు ఏసమాధానం చెప్పకుండా సరిగా అయిదునిమిషాలు కూర్చున్నాడాలోచిస్తూ.

"ఒక్కసారి మీపిల్లతో నేను మాట్లాడాలి!"

"అంతకన్నానా? ఇప్పుడు మాయింటికి పోదాం పద!"

రాఘవయ్య ఉత్సాహం చెప్పటానికి వీల్లేదు.

"ఈ పూట ఎనిమిదింటికి వస్తాను సరిగా."

రాఘవయ్య తనకుమార్తెవివాహం అయిపోయి నట్టే భావించుకొన్నాడు. ఇక తనకు డబ్బుకొరతలేదు. ఎస్టేటుకంతా తనే మేనేజరు. ఇంతఆస్తీ తనకూతురి సంతానానికే వస్తుంది. వెంకటేశ్వర్లుగారికి ప్రథమ కళత్రంవల్లకలిగిన కుమారుడు లక్ష్మీకాంతం ఉన్నాడు. మొదటినించీ శారదకు, ఆపిల్లవాడికీ స్నేహం. రాఘవయ్యదృష్టి చాలాకాలం లక్ష్మీకాంతంమీద ఉంటూ వచ్చింది. తనకుమార్తె ఇంకా పసిపిల్లగా ఉన్న రోజుల్లోనే "అదుగోనే బావ, బావను పెళ్ళిచేసుకుంటా వమ్మా?" అంటుండేవాడు రాఘవయ్య. కాని ఇప్పు డదంతాపోయింది. మూడేళ్ళకింద వెంకటేశ్వర్లుగారు కొడుకును ఇంట్లోనించి వెళ్లగొట్టాడు. మళ్లీ తండ్రీ కొడుకులు ఒకరిమొహం ఒకరు చూచుకోలేదు. ఈ వైరానికి-లక్ష్మీకాంతానికీ, సవతితల్లికీ ఏదో సంబంధం ఉన్నదని తప్ప మిగిలిన విశేషం లెవ్వరికీ తెలీలేదు. తండ్రి కొడుకు లిద్దరూ ఆవిషయం ఎవరితోనూ ఎత్త లేదు. లక్ష్మీకాంతం నిర్దోషి అనుకోటానికైనా ఈమూ డేళ్లనించీ అతన్నిగురించి చాలా చెడ్డకబుర్లు వినపడుతూ వచ్చినై.

వెంకటేశ్వర్లుగారి రెండోభార్యా పోయినతరవాత కూడా తండ్రి కొడుకులు కలవకపోవటం చూసి శారదకు యోగ్యుడు తప్పడనుకున్నాడు రాఘవయ్య. ఇక లక్ష్మీకాంతం పిత్రార్జితానికి బాహ్యుడే. పాపం రాఘవయ్య ప్రయత్నానికన్నీ అడ్డాలే అయినై. చివరకు వెంకటేశ్వర్లును చూడబొయ్యేటప్పుడుకూడా ఇంతా చేస్తే వెంకటేశ్వర్లు మళ్లీ పెళ్లిచేసుకుంటాడంటాడో లేదో నని అనుమానమే. ఇంతకు భగవంతుడు తనయందుండ బట్టే—

తనస్నేహితుణ్ణి వసారాగదిలో కూర్చోబెట్టి రాఘవయ్య అదివరకే పూర్తిగా అలంకరించి ఉన్న శారదను తెచ్చాడు.

"మేమిద్దరం కాస్సేపు రహస్యంగా మాటలాడుకో వాలి. నువ్వేదైనా పనిఉంటె చూసుకో," అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

రాఘవయ్య మనస్సులోనే "అంతకంటేనా?" అనుకుని బయటికి నిష్క్రమించాడు.

"ఖరలేదు, తలుపుతెరచేఉండనీ," అన్నాడు వెంకటేశ్వర్లు. రాఘవయ్య తలుపువతలనించి సంభాషణ వినటానికవకాశంలేనందువల్ల హతాశుడై తలుపుతెరిచి వెళ్లిపోయినాడు.

వెంకటేశ్వర్లు శారదనుచూసి "మాలక్ష్మి బతికుంటే ఈనాటికీపిల్లవయస్సుది. ఇంతబాగుండేదేమోకూడా," అనుకున్నాడు. శారదమాత్రం ఆయన్ను లక్ష్యం చెయ్యకుండా కొంచెంసేపు అటూఇటూ పచారుచేసి చివరకు అలమారుదగ్గిరికిపోయి తన ఒంటినిఉన్న

రెండుమూడునగలూ తీసేసి, అలమారులో పెట్టి తీరిగ్గా జడవిప్పుకోటం మొదలుపెట్టింది.

"అమ్మాయి నీకెన్నేళ్లు ?" అన్నాడు వెంకటేశ్వర్లు గారు.

శారద కనుబొమలుముడేసి "మీకన్న నలభైఏళ్లు తక్కువ" అన్నది.

వెంకటేశ్వర్లుగారు నవ్వేడు. "ఆఁ! అంత అన్యాయంగా ఉండదు. పదేళ్ళయినా లేవా నీకు ?"

"ఇంకా రెండేళ్లెక్కువే."

"జుట్టు విరబోసుకున్నా అందంగానే ఉన్నావు. పెళ్ళికూతుర్ని చేస్తే ఇంకా బాగుంటావు... నేను వచ్చిన పని తెలుసునా ?"

"ఆ! నాగొంతుకొయ్యటానికి. నాగొంతంత సులభంగా తెగదు."

"ఏమంతమాటన్నావు? నీకు కళ్యాణం అయే యేర్పాటు చేద్దామనుకుంటున్నానే "

శారద ధైర్యంగా వెంకటేశ్వర్లుగారిని సమీపించి ఆయనవంకే చూస్తూ నిలబడ్డది. నడుముకు చేతులుపెట్టుకోటం ఒక్కటే తక్కువనుకున్నాడు వెంకటేశ్వర్లుగారు. ఆయన కప్పుడే ఆపిల్లనుచూస్తే భయంకూడా ప్రారంభమయింది.

"నన్ను మానాన్న మీకిచ్చిచేస్తే నూతిలోపడతాను. జ్ఞాపకముంచుకోండి. నే నాడపిల్లలందరిలాంటి దాన్ని కాదు. మా అమ్మ నన్నెప్పుడు, శక్తి, అని పిలుస్తుంది." కిటికీలోనించి గాలివచ్చి ఆపిల్లజుట్టు అటూఇటూ కొట్టేస్తున్నది.

"దాదాపు అట్లాగేఉన్నావు. అయితే నన్నుచూస్తే నీ కంతమంచిఅభిప్రాయం కలగటానికి కారణం ?"

"మీరు మనిషి కాదు. అయితే కాంతాన్ని పెళ్ళాం మాటలువిని ఇంట్లోనించి వెళ్ళగొడతారా ?"

వెంకటేశ్వర్లుగారు కొంచెంసేపు జవాబుచెప్పలేదు.

"నువ్వెందరితో ఇట్లాగే మాటలాడుతావా ?"

"మాటలాడను."

"నాతోనేనా ?"

"ఆ,"

కొంచెంసేపిద్దరూ మౌనంగా ఊరుకున్నారు.

"కాంతంవల్ల తప్పులేదని నీకేంనమ్మకం?"

"నాకు తెలుసు, నేను కాంతాన్ని ఇంతదాన్నప్పటినించీ ఎరుగుదును."

"నే నెరగనా ?"

"ఎరగరు..."

"ఇప్పుడు కాంతం ఎవరితో తిరుగుతున్నాడు తెలుసునా ?"

"ఆ,"

"రౌడీలు, భోగంవాళ్లు."

"మీకన్నా, మీపెళ్లాంకన్నా మంచివాళ్ళే."

వెంకటేశ్వర్లుగారు దీనంగా నవ్వాడు.

"నీకెల్లా తెలుసు ?"

"లేకపోతే కాంతంవాళ్ళతో ఇన్నాళ్ళు కలిసి ఉండడు."

"కాంతం ఉన్నచోట చెడుండదా?"

"ఉండదు."

"నీ కింతధైర్యంగా మాట్లాడటం ఎవరు నేర్పారు?"

"మీఅబ్బాయి."

శారదకు కాంతంస్నేహితంకాక శిష్యత్వంకూడా ఉందన్నమాట !

"కాంతం ప్రతిరోజూ ఇక్కడికి వస్తుంటాడా?"

"ఆ."

"నావిషయం ఏమన్నా అంటాడా ?"

"అనడు. తననోటివెంట మీవిషయం ఎప్పుడన్నా మాట తూలిస్తే ఆరోజునించీ తనతో నన్ను మాటలాడవద్దన్నాడు."

వెంకటేశ్వర్లుగారు ఆశ్చర్యపడి "ఎందుకు ?" అన్నాడు.

"తెలివిగలవాడు కనక."

"అయితే అటువంటి దేదైనాజరిగితే వాడితో మాటలాడటం మానేస్తావా ?"

"మానను."

"ఏం ?"

"మిమ్మల్ని తిట్టటానికి నాకేమీ అభ్యంతరం లేదు...."

"అందరాదవాళ్లూ ఇట్లామాట్లాడటంనీకిష్టమేనా?"

"అందరికొడుకులూ కాంతం స్థితికి రావటం మీ కిష్టమా?"

"లేదు"

"నాకూ లేదు."

"అది కాంతం తప్పేమో."

"కాదు. అయితే ఇదీ నాతప్పే."

"అయితే వాడికోసం నువ్విట్లు మారిపోయి నావా?"

"ఆ"

వెంకటేశ్వర్లునవ్వుతుంటూ "నిన్నింకా ఎంతసేపు పరీక్ష చెయ్యను," అనుకున్నాడు బిగ్గరిగానే.

"ఇంతసేపు నన్ను పరీక్ష చెయ్యండి అని మిమ్మల్ని బొట్టు కాటిక పెట్టి నేను పిలవలేదు. బహుశా మానాన్న నడిగితే తెలుస్తుంది—ఇంకా ఎంతసేపు పరీక్ష చెయ్యాలో."...

"మా కాంతంవల్ల తప్పులేదని చాలా కాలంకిందటనే కని పెట్టాను."

"మీకామాట అనటానికి నామోక్షిలేదా? నిజం తెలిసినతక్షణం వెళ్ళి మీ అబ్బాయికాళ్లెందుకు పట్టుకో లేదు?"

"నాచేతకాలేదు. తగినసమయంకోసం ఎదురుచూస్తున్నాను."

"మీ అబ్బాయే పొరపాటుపడితే తెలిసినవెంటనే పోయి కాళ్ళుపట్టుకుంటాడు."

"అవును వాడికి తల్లిమంచిగుణాలన్నీ వచ్చినై."

"అటుకంటి భార్యపోతే పసువైతే తప్ప మారి పెళ్ళిచేసుకోడు."

"నీయిష్టంవచ్చినట్టను. నేను మొండెత్తువేశాను. చాలాకాలంకిందనే నాగుండె రాయయిపోయింది. ఒక అరిగిపోవలిసిందేకాని కరగదు."

ఈమాట కేవలం నిజంకాదు. ఆమాట అంటుండగానే ఆయనకళ్ళు చెమ్మగిల్లినై.

శారద తనకు పావనం ప్రాప్తమైందని కనుక్కుంది.

"ఇట్లారా అమ్మా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు. శారద మారుచెప్పకుండా మెల్లిగావచ్చి ఆయన పక్కనే నిలుచుంది.

"జడవేసుకోమ్మా నిన్ను మా కాంతం కిచ్చి చేస్తాను. ఒకఆడది మమ్మల్నిద్దర్నీ వేరుచేసింది. మళ్ళీమమ్మల్నిద్దర్నీ కలపటం నీవంతు." శారద తలవంచుకుంది. ఆపిల్లకళ్ళనించి రొండుబొట్లు రాలటం వెంకటేశ్వర్లెరగడు. కాని ఆయనకళ్ళనించీ కారినబిందువులు తనతలమీదపడటం శారదగమనించి అవే అక్షింతలకింద గ్రహించింది.

కొడవటిగంటి కుటుంబరావు.

# ఉగాది నాడు

ఈ మహాజ్వాల లెందాకమండనీ
    ఎన్ని లోకాలైన కాలనీ
ఈ యసంతాంభోధి భంగాలుపొంగనీ
    ఎన్ని భవనాలైన కుంగనీ
ఈ ఝంఝానిలప్రవీచు లిందెల్ల వీవనీ
    ఉర్వీతలంబెల్ల నుత్పాతలూపనీ
ఈ వుగాది నవయుగాది
ఈ మహోదయవేళ
శిథిలభారత వీణ జీవతంత్రులుగూర్చి
సర్వభౌతిత్వ సద్భావగీతి నేను
భారత జాతీయ ధర్మసౌధము నుండి
    వాసంత పికమునై
    మిన్నందు ఖగమునై
పైకెగిరి, పైకెగిరి, పాడకలను
ఆనందమయముగా నాడకలను.

పెమ్మరాజు రాజగోపాలము

# ఆంధ్రభూమి

౧

రాజయోగీంద్రుఁడైన శ్రీరామచంద్రు
మంగళపదంబు లంటిన మహిమతోడ
కర్మయోగార్థమునుజాటు ధర్మమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౨

శాతవాహనవంశవిఖ్యాతనృపుల
పాలనంబున పరరాజవందనీయ
పదముప్రాప్తించిమించిన భవ్యమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౩

కాకతినృపాల చంద్రుల ఖడ్గధార
కరినృపాలురు వెరచి జోహారువెట్ట
దక్షిణార్థంబునేలిన ధన్యమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౪

కృష్ణరాయనృపాలుని కీర్తికాంత
ఖండఖండాంతరముల స్వాగతముగాంచి
గళముసవరించి తనదు దిగ్గ్జయముఁ బాడ
నాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౫

భారతామ్నాయపరిమార్గ సారమెల్ల
విశ్వమోహనసత్కళావిభవ మెసఁగ
నాంధ్రభూముల జల్లిన యమృతమూర్తి
తిక్కయజ్వను గన్నట్టి దివ్యమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౬

అఖిలదక్షిణ దేశ గాయకసమాజ
పూజితానల్పమాధురీపూర్ణమూర్తి
త్యాగరాజసమర్చిత యోగమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౭

జీర్ణ భారతధర్మ సంజీవి నగము
నిఖిలలోక సమారాధనీయ కీర్తి
గాంధిఋషిచంద్రు నుపదేశ కాంతులందు
స్నానమొనరించుచున్న ప్రసన్నమూర్తి
కాంధ్రభూమికి మంగళ మగునుగాక!

౮

అజాంతగుహాలలో నజరామరంబైన
శిల్పసౌభాగ్యంబు చెలువునిల్పి
త్యాగరాజమనోజ్ఞరాగమాలికలలో
ప్రౌఢసంగీతంబుఁ బాడుకొల్పి
భారతామ్నాయవాగ్ధోరణీసంశ్రిత
కవితామరందంబుఁ గడలనించి
కరుణామయుండైన గాంధీమహాత్ముని
హరిజనోద్ధరణంబు ననుసరించి

ఉన్నతవికాసడోలిక నూగియూగి
నిత్యయౌవనమూర్తితో నృత్యమాడు
చిన్మయమనోజ్ఞహాసినీ! చేరికొలుతు
నాంధ్రమాతరో! వందన మందుకొనుము.

నండూరి. బంగారయ్య

# ఆసీస్సులు

౧

ఉదయభానుని బంగారునొఱపు మిఁగులు
కిరణములు చేసుతై యాదికిటివిశాల
దంష్ట్ర లుత్తుంగ స్తంభతఁ దనరుధరణి
నుయ్యేలగనూచు మాతంగు నుజ్జ్వలోక్తి
ఆంధ్రభూమి కాలంబన మగుత ! సతము.

౨

ఉక్తివైచిత్రి కావ్యమా యొప్పు లోక-
భావమయేదైన నేమని పల్కుచిలుకు
ప్రవరసేనుని దివ్యప్రబంధగీతి
మాయువకదంబములలోన మలయుగాక !

౩

కవి మహర్షియై, సర్వలోకాలనించు
చిత్రభావసుధాసాధసరణికతన ;
పుట్టపుట్టువు తాఁగ్రాణపొఱయునన్న
భట్టితోతోక్తియగుత మాపట్టులందు

౪

కర్త సున్నలు రెండైన, కిర్ణయొకట
నొప్పు నను సాహితీవీథినొజ్జల కివె
దండములటన్న బిల్హణు దారి మాకు
గ్రాంధికంమున్యులకుబ్రొక్కఁగ్రొక్కయగుత.

౫

లలితమాధుర్యసూక్తు లాలాపనంబు
సేయనేర్తు నాకవిత! చిత్రసీమ
శిశువు కవియగు, కవి-కవిశేఖరుఁడగు
నన్నహరవిజయునోక్తి మాకాత్మతృప్తి

౬

క్రమకవితార్థయుక్తుల కావ్యశోభ
విప్పివెలయించు నన్నయ్యయొప్పు, తెన్గు
తేట నిగ్గులజాటిన తిక్కయజ్వ
తీయదనమును తమ్ములఁదీర్పుగాక.

౭

పదకవిత్వంపు బంగారుపసిమిమిసల
నెదల గుదిగ్రుచ్చు నారాధ్య మృదులఫణితి
శ్రోత్రసీమల నడయాడు కుఱ్ఱవారి
హత్తికొని యంగరక్షగా నరయుఁగాక.

౮

సంస్కృతాంధ్రాల భేదంపు సరణి-తులసి
జాజిపూవుల వంటిది సరసులకును
అంచు నాంధ్రప్రశస్తి వచించునాటి
దండిమాట యైక్యమునకు దారినిడుత.

౯

తేనెసొనవోలె నాకవింతతీయదనము
సోకినంతనె గల్గించు సొగసుగలది
కావ్యమగు నన్న మొల్లమ్మ కమ్మమాట
శ్రోత్రకవిశేఖరుల వాణి హత్తుగాక.

౧౦

పోతన పొలాన, శ్రీనాథు భూమి, కృష్ణ
రాయు నాస్థాని, నాయకరాజు నగరి
అల్లిబిల్లిగ నాటల నాడినట్టి
శారదాదేవి మాకౌత విశాలహృదయ.

౧౧

పూలతావులు, బంగరుపొంక, ముదధి
లోతు, వెన్నెలచల్వలు, పాతువిడని
యద్రిగాంభీర్యగరిమ, మాయాంధ్రభూమి
వెలసి కమ్మని తావుల-వీచుఁగాక.

పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి.


# భూషణలక్ష

## మకుట



శిరముపై ధరించెడు భూషణమును మకుటమందురు. కిరీటమకుటము, కరండమకుటము, జటామకుటము అని మకుటములు మూడువిధములు. వీనిలో కిరీటమకుటము దేవుళ్లలో విష్ణువునకును, రాజులలో చక్రవర్తులకును అర్హమైనదని చెప్పబడియున్నది. కిరీటమకుటము వెదురు మొలకనుగాని (వేణుకర్ణ) వెదురుఆకునుగాని (వేణుపర్ణ) పోలియుండవలెను. పక్షిగ్రుడ్డునుగాని, తామరమొగ్గనుగాని, గొడుగునుగాని, తాంబేలునుకాని కూడ కిరీటములు పోలియుండవచ్చునని శిల్పరత్న అను గ్రంథము చెప్పుచున్నది. కిరీటమకుటమున చేర్చబడు వివిధాలంకారనామములు ఇవి: పూరిత, తుంగతార, అగ్రపట్ట, త్రివేదిక, త్రివేత్రక, పద్మ, కుట్మల, శిఖామణి. పూరిత అనబడు అలంకారమునకు సౌందర్యాధిక్యమునకై మకరములు ఉంచబడవలసియుండును. పూరితాలంకరణముల యొక్క మధ్యభాగమును, అగ్రభాగమును విలువగలరాళ్లచే పొదగబడవలసియుండును. మకరముల ముఖములనుండి లతాలంకారములుకాని, ముత్యాలకుచ్చులుకాని వ్రేలాడుచుండవలయును. పూరితము యొక్క మిగిలిన భాగములన్నియు తీగెలతోడను, ఆకులతోడను చెక్కబడియుండవలయును. కిరీటము యొక్క నాలుగుప్రక్కల లో ప్రతిప్రక్కయందును ఒక్కొక్కపూరితము ఉండవలయును. ఈపూరితము నుపోలి రాళ్లుపొదగబడు మరియొకఅలంకారము పట్టబంధము. నుదుటికిపైభాగమున కిరీటమునకుచుట్టును అమరియుండు పట్టమునకు అంటియుండునదియే పట్టబంధము. కిరీటమకుటమునకు ఇతరభాగముల.దు





అలంకరింపబడియుండు ఆభరణములు మౌళిబంధము, వల్లి (తీగ), ముక్తాహారము. కిరీటమకుటముయొక్క క్రిందిభాగము నుదుటిచెంత చంద్రవంకవలె వంకదేరియుండవలయును. చెవులకు సరిగాపైన ఆకులవంటి అలంకారికమండలములను కలిగియుండవలెను. వీనినే కర్ణపాత్రలందురు. ఈకిరీటముయొక్కక్రిందియంచున ముక్తాహారములపరంపర వ్రేలాడుచుండవలయును. చెవులకుపైన కర్ణపాత్రలనుదిగువను చెవితలతో కలసియుండుప్రదేశమున కర్ణపుష్పములు ఉండవలయును. ఈకర్ణపుష్పములనుండి ముత్యాలహారములు, విలువగలరాళ్లపూసలు వ్రేలాడుచుండవలయును. కిరీటమకుటములోపల అంతయు మండలాకారమున నుండవలయునని చెప్పబడియున్నది. (౮, ౬ అంకెలుగలబొమ్మలను చూడుడు. గతమాసమున భూషణలక్షణములలో ప్రచురింపబడిన దేవతావిగ్రహముశిరముపైనున్న కిరీటమకుటమునుకూడ చూడుడు.)

కరండమునుపోలియుండు మకుటము కరండమకుటము. అది పొడుగై అదొకగానుండును. లేదా విశేషము ఎత్తులేక చిన్నపరిమాణముననుండును. ఈకరండవవిధమైన కరండమకుటములో ఒకదానిపైనమరొకటి పరిమాణము నక్రమమునతగ్గుచుండు కరండములతో కూడియుండును. ఈకరండములసంఖ్య ౩ కాని, ౫ కాని, ౭ కాని యుండవచ్చును. ఇతరవిధము లయిన మకుటములకువలెనే ఈకరండమకుటము కూడ పూరితములు, పట్టములు, పట్టబంధములు, ము



ంము



క్తాహారములు, శిఖామణి వీనిచేత అలంకరింపబడును. ఈ కరండమకుటము దేవీవిగ్రహములను, సామంతరాజులకును నిర్దేశింపబడినది.


[3-5-సంఖ్యగల బొమ్మలను చూడుడు.]

జటామకుటము అన్నివైష్ణవాగమములయందును ప్రాశస్త్యముగ వర్ణింపబడియున్నది. జటామకుటమునుగూర్చిన ఈక్రిందివర్ణనము ఉత్తరకామికాగమములోనిది. జట అనగా అల్లినజడకట్టు అనికాని, విరియబోసినజుట్టుఅని కాని అర్థము. ప్రాక్తనకాలమున గుట్టపెరిగియుండేయుండవలయును కాని మెలిపెట్టబడియుండలేదని చెప్పవచ్చును. మెలిపెట్టబడిన జటలతో పొడుగువాటి కిరీటాకృతిగా చేయబడినదానికే జటామకుటమని పేరు. సాధారణముగానున్న ఐదుజటలను తీసికొని మూడుఅంగుళములఎత్తుగానుండు ముళ్ళుగా పైని ఒకటి లేక మూడు ఉంగరముల చుట్టగా చుట్టి మిగిలినవాయలనుకట్టి సాగించుకొనిపోయి మకుటముయొక్క యిరుపార్శ్వములయందును వ్రేలాడునట్లు చేయవలయును. ఈమకుటము మకరకూటము, పత్రకూటము, రత్నకూటము, పూరితము అను అలంకారమండలములతో అలంకరింపబడవలయును. జటామకుటముయొక్క ముఖభాగమును అలంకరింపవలసిన మకరకూటముయొక్క మధ్యకేంద్రముచుట్టును ఏడు రంధ్రము లుండును, మిగిలిన మూడువైపులయందును ఒక్కొక్కప్పుడు నాలుగువైపులయందును-పూరితములు ఉండవచ్చును. లేదా కుడి ఎడమపార్శ్వములందు పూరితములును, ముఖభాగమున మకరకూటమును, వెనుకభాగమున పత్రకూటము గాని రత్నకూటము గాని ఉండవచ్చును. పూరితములచేత పంజరాకృతి గుళ్ళము లుండవలయును. ఈరీతి మకుటము లుండుగు వారి శిరముతో సమమై యుండవలయును. ఈ మకుటము అగ్రభాగముయొక్క వెడల్పు మట్టుయొక్క వెడల్పులో ఏడవవంతు గాని, ఎనిమిదవవంతు గాని, తొమ్మిదవవంతు గాని ఉండవలయును. శివునకు ఉద్దేశింపబడిన జటామకుటమగుచో దానికి కుడిప్రక్కన ఉమ్మెత్తపూవులు, నాగేము, గంగావిగ్రహమును; ఎడమప్రక్కన అర్ధచంద్రబింబమును ఉండవలయును. ప్రతిజటయు చిటికెనవ్రేలంత దళసరిని ఉండవలయును. (౧౨ సంఖ్యగల చిత్రములను చూడుడు.)



ము లు




౧. శిఖామణి, ౨. నిట్మల, 3. పద్మ,
౪. పూరిత, ౫. మకర, ౬. శ్రీకేదిక
౭. పట్టబంధ, ౮. కర్ణపాత్ర, ౯. త్రినేత్రక
౧౦. పుష్పపట్టి ౧౧. ముక్తాహార, ౧౨. పట్ట,
౧3. కర్ణపుష్పము, ౧౪. రత్నహార.

# దివంగతుడు అప్పారావు.

"కోయిలొకటి సారొచ్చి కూసి పోయింది,
పండొకటి చేతిలో బడి జారిపోయె,
మెఱుపొకటి మింటిపై మెఱసిపోయింది."

శ్రీ బసవరాజు వేంకటఅప్పారావు మరణవార్త వినుటతోడనే అతడే వ్రాసిన పై పంక్తులు స్మృతిపథమున తట్టినవి. ఈ అకాలమరణముచే ఆంధ్రసారస్వతప్రపంచమున పుట్టిన విషాదము ఇంతటంతట పోవునది కాదు.

కవి, గేయకారుడు, విమర్శకుడు అయి అప్పారావు ఆంధ్రభాషాయోషను సేవ చేసినాడు. ఆ వేళము ఆతనిసొమ్ము.

"నన్నెవ్వ రాపలే రీవేళా
నాభాటి కోపలే రీవేళా
నోట పలికేదంత పాటగా మోగేను
కోటివరహా కెత్తుకెత్తుగా తూగేను
నన్నెవ్వ రాపలే రీవేళా."

అని చాటుచు ఆతడు 'కావ్యమే జీవము'గ గడుపుచు

'కావ్యపానము జేసి కైపెక్కినానే
దివ్యలోకాలన్ని తిరిగొచ్చినానే'

అని గానముచేయువాడు. 'దివ్యలోకాలన్ని తిరిగొచ్చినానే' అని గానముచేయుట కలవడినట్టి ఆకవి ఇపుడు ఆంధ్రభూమికి తిరిగిరాకుండగ దివ్యలోకమునకు పోయినాడు. నలుబదివత్సరముల నడివయస్సు

భార్యాభర్తల అన్యోన్యప్రేమ ప్రదర్శించు ఆతనిఖండకావ్యములందు అప్పారావు భావలాలిత్యమును మనము పసిపట్టవచ్చును ఆతని 'పేరంటము' అను కావ్యమునందు భర్తభావములను, 'నోము' అనుకావ్యమునందు భార్యభావములను ఎంతలలితముగ ప్రదర్శింపబడినవో చూడుడు.

"...... ...... .. .. వనిత గ్రీష్మ
తప్తగాత్రయయ్యెను, నాహితమ్ముగోరి.
... ..............................
యట్లు 'పేరంటమునకేగు ......"

అను 'పేరంటము' లోని భర్తయు;

"దేవి కారగించుపుగ నిద్దురయుజాము
పండు గైకొని ..... పంచెవన్నె
రామచిలుకను దినిపించి, 'శ్యామ, ప్రభుడు
చేతితోడ పట్టుకయు భుజింపుచుంటి
గాదె ........................"

అను 'నోము' లోని భార్యయు ఆదర్శప్రాయములైన పాత్రలు గదా!

ఈఖండకావ్యములవలన అప్పారావు కవియై జీవితమున లాలిత్యము గ్రసింపగలిగినవాడుగా కనుపించుచున్నను ఆతనిజీవితము మాధుర్యమునకు నోచిపుట్టలేదు.

"బసవరాజు వెంకటఅప్పారావు బెజవాడలో న్యాయవాదమునకు పూనుకొనెను. ప్రకృతివైచిత్ర్యముల దిలకించుటకై ఉరుకులిడు భావోద్రేకతకలిగిన అప్పారావు తప్పుడుసాక్ష్యములను తీర్చి దిద్ది నేర్పుటకెట్లు హృదయమును వంచింపగలడు? న్యాయవాదవృత్తి అప్పారావును అర్ధాకలితో పండబెట్టినది. ఉద్యోగముచేసియైన బ్రతుకుదమని బయలుదేరినాడు. అదియు గగనకుసుమమై ఆంధ్రావనిలో అందరానిదైపోయినది. ఇంతలో ఢిల్లీలో పత్రికాసంపాదకత్వమున కాహ్వానము రాగా పయనమై పోయినాడు. అక్కడికి వెళ్లుట

తోడనే ప్రాద్దుమణిగినది. ఉవ్విళ్లూరించిన ఉద్యోగము నకు ఉశ్వాసనము వచ్చినది.''

—ప్రజామిత్ర; జూను, 14.

'కాన్యహానపు కైపులో' ఎక్క గాని కొండ లెక్కివచ్చిన ఆతని వెనుకటిగీతము గు

'కత్తిబెట్టి పొడిచినావోయ్' దేవా!

............ ..... ............''

ఇక ఇప్పుడు సులువుగ అర్థమగును.

"తలవాల్చి నాస్థితి దలచి కుంగేను,
కుళ్లికుళ్లి లోన కుమిలిపోయేను
రాజులలో కవిరాజు నే నౌను
పాడుగుహలో నేడు పొరాడనాయె!
కోకిలలందు పుంస్కోకిల నేను
గొంతునొక్కుకు మూల కూరుచోనాయె!

అని ఆతడు పాడికున్నచో ఆశ్చర్య మేమి?

'అమృతహస్తా! చిల్కు మధుపోటుం డొకటి
గొంతెండిపోయిన కోయిల నోట!'

అని ఆతడు ప్రార్థించినాడు ఆతని ప్రార్థనము అరణ్యరోదనమైనది. అగుట నాదుర దృష్టవంతుడు

'అమృతపాత్ర దొంగిలించావ్, దేవా!
అందులో విసము నింపావ్, దేవా!'

అని ఆక్రోశించినాడు.

'అమృతపాత్ర' లో విసమును తాగినను ఆతని గేయములు అమృతనిష్యందినులై యున్నవి 'బాపూజీ—మాబాప్', 'కొల్లాయి గట్టితే నేమి, మాగాంధి కోమటై పుట్టితే నేమి' అను ఆతని గేయములలోని అమృతమును నేటిఆంధ్రులు పలువురు ఉచ్చిష్ట మొనర్చియున్నారు.

అప్పారావు కవి, గేయకారుడుమాత్రమే కాడు; సాహిత్యవిమర్శకుడును. ప్రభవవత్సరపుఆంధ్రపత్రికఉగాదిసంచికలోని 'ఎంకిపాటలగాలిదుమారము' అనువిమర్శకవ్యాసమును, ౧౯౩౭ ఫిబ్రవరిమాసమున ప్రచురింపబడిన 'ఆంధ్రకవిత్వచరిత్రము' ను ఆతనివిమర్శకశక్తికి మనము చూపగల ఉదాహరణములు. 'శక్తి' తొలిసంచికలో 'శబరి' పై అతడు వ్రాసినకొలదిపంక్తులు ఆతనినిరంకుశవిమర్శనమునకు నిదర్శనములు.

అప్పారావు తనప్రకృతినిగూర్చి కొండొకచోట ఇట్లు చెప్పుకొన్నాడు:

"నేను మొత్తంమీద నిగంకుశుణ్ణి—జీవితంలోనూ, సాహిత్యవిమర్శనలోనూ, కవిత్వంలో కూడా. ఎవడికీ లొంగేదికాదీప్రకృతి' విశ్వామిత్రుడిగోత్రంలో పుట్టినవాడిని, ఒకణ్ణి జయించాలి, బ్రహ్మఋషిపట్టం అధిష్ఠించాలి. అందులో ప్లీడరీఒకటి వెలిగించానుకదూ భారతీదేవితో జగడమాడి బెజవాడ వెళ్లిం తరవాత."

— భారతి; ఫిబ్రవరి, 33.

'ప్రజామిత్ర' చెప్పినటుల 'ఆంధ్రదేశము ఆతనిప్రతిభను గుర్తింపలేకపోయినది. ఆతని శక్తిని వినియోగించుకొనలేకపోయినది. అప్పారావుకు ఏబదిరూప్యముల జీతమొసంగకలిగిన నాథుని ఈ తెలుగుసీమ కలిగియున్నచో, ఇత డింతటి దుర్మరణమునకు పాలుగాకుండ నుండెడివాడు.''

'వెలలేనిమణిని బాడేసావ్, దేవా!'

అని విచారించుటతో కాలముద్రోయక ఈభాషాసేవకుని రచనములన్నియు ఈతని పూర్తిజీవితచరిత్రముతో చేర్చి ఒక్కసంపుటముగ ప్రకటించుటకు ప్రయత్నింపవలసిన బాధ్యత ఈతనిమిత్రులపై నిలచియున్నది. ఈప్రయత్నమున 'ఆంధ్రభూమి' యథాశక్తి ని తోడ్పడగలదు.

శ్రీ అప్పారావు పవిత్రాత్మకు భగవానుడు శాంతిని ప్రసాదించునుగాక!

# చంద్రుడు

మొయిలు పెన్నెరుల
నడనడ త్రోసుకు
తొంగిచూచు ఆ
సాంత్వన కరుడగు
చంద్రుని జూడగ
నిజప్రియూషను
దప్పిపోసెడు
జక్కవ కవలను
నవ్వుల నింపెడు
లోకమోహనుడై
స్ఫురియించున్,
లోకము మోహన
మనిపించున్.

భూసరితంబౌ
జుట్టుచీల్చుకొని
కావిరి మెసవిన
రాగిమోముతో
దప్పి లభింపని
దాహాతురుడై
నాసటను రేగిన
పుండుబావితో
రక్తబాష్పములు
జలజల రాలగ
క్షామ నిపీడిత
కర్మకారు గతి
ఎగుపు మంటలే
ఊర్పుసెగలుగా
లోకము నింపెడు
చలువ చందురుడు
ఆర్తగీతితో
ఆక్రందనతో!
చంద్రుని కౌముది
గంగ గలిసెను.
లోకము జ్వాలా
క్రాంత మయ్యెను.

జనమంచి కామేశ్వరరావు.

# ఆంధ్రభూమి

శ్రీముఖాబ్దము
సిరుల కిరవై
చిన్నినగవులు
చిలుకరించెడి
ఆంధ్ర తేజము వెల్లివిరియ
ఆంధ్రభూమి నలంకరింపర!
క్రొత్తచివురులు రేకెత్తగ
క్రొత్తసుమముల చెలువొలయగ
క్రొత్తతావులు దిశలబర్వగ
క్రొత్తపాటలు కోకిలాంగన
కుతుకను సవరించిపాడగ
క్రొత్తతలపులు కొనలసాచగ
తత్తరిల్లుముదీక్షితుడవై
జయమునీకగు జయమునీకగు
జయమునీకగు ఆంధ్రపుత్రుడ!
శ్రీముఖాబ్దము
చెలువుకొలువై
శీర్షమున నా
శిస్సులుంపగ
ఆంధ్ర తేజము వెల్లివిరియగ,
ఆంధ్రభూమి నలంకరింపర!

[illegible]

# సంపాదకీయసమాలోచన

## ప్రత్యేకకర్ణాటరాష్ట్రము:

### లండనురాయబారము:—

బొంబాయిరాజధానియందును, చెన్నపురి రాజధానియందును, కూర్గుసంస్థానమునందును చెదరియున్న కన్నడజిల్లాలను నొకటిగా కలిపి నూతనసంస్కరణప్రణాళికయందు ప్రత్యేకరాష్ట్రముగా ఏర్పఱుప జాయంటు పార్లమెంటరీకమిటీ ఎదుట నివేదించుటకును, ప్రత్యేకకర్ణాటరాష్ట్రవిషయమై విచారణసలుపుటకు కమీషను నియమింప రాజప్రతినిధిని కోరుటకును-లండను మహాపట్టణమునకును, సిమ్లాకొండలకును-కర్ణాటకప్రముఖులు రాయబారము పోవుచున్నారు ఈ విషయమై కర్ణాటకసమ్మేళనసమావేశకార్యనిర్వాహకసంఘము వారు చూపుచున్నత్వర, ఉత్సాహము ఆంధ్రులకు అనుసరణీయములుగ నున్నవి. కాని-స్వయముగ తోచకపోయిన మానె-చూచియైన నేర్చుకొనుపాటిబుద్ధి ప్రత్యేకరాష్ట్రసంపాదనవిషయమున ఆంధ్రులకు కలుగకున్నది. ప్రత్యేకరాష్ట్రమును కాంక్షించిన వారిలో ఉత్కళులు, కన్నడులు, ఆంధ్రులు ముఖ్యులు, అందు ఉత్కళులు రాష్ట్రమును సంపాదించుకొనిరి. కన్నడులు సంపాదింప విశ్వప్రయత్నము లొనర్చుచున్నారు. ఆంధ్రుల పక్షమున ప్రయత్నలేశమైన లేదు ఆంధ్రదేశము మొత్తముమీద ఏపదుగురు వ్యక్తులో ఈ విషయమై కొంత ఆందోళన పడుచున్నారు. కొందఱు సముద్రముదాటి సీమకును పోయియున్నారు. కాని ఏమి లాభము? దేశము హుషారీయనిది వారికి కార్యాచరణమున ఎట్లుఉత్సాహముండును? ఈ విషయమై సీమకుపోయిన వారిప్రధానలక్ష్యము ప్రత్యేకాంధ్రరాష్ట్రసంపాదనమనుటకంటె ఆంధ్రప్రాంతములను ఉత్కళములో చేర్పకుండచూచుటయే అయిఉన్నదనుట సత్యసమీపము. ప్రత్యేకరాష్ట్రవిషయమున ఆంధ్రవిశ్వమునందు వ్యాపించియున్న ఈపర్లిప్తతకు కారణమేమి?

### పత్రికలలో వ్యాసములు, శాసనసభలో ప్రశ్నలు చాలవు:—

"రాజధానిపట్టణమగు చెన్నపట్టణము రాజధానికి మధ్యను లేదు. అది ఆంధ్రులకంటె తమిళులకు అనుకూలముగనున్నది. ఆంధ్రులకంటె తమిళులే ఎక్కువమంది ఉద్యోగములలోనుండుట కిదియొక కారణము. పాలకులదృష్టి ఆంధ్రులమీదకంటె వారిమీదనే ఎక్కువగ ప్రసరించుచుండును. తమిళులకున్న సౌకర్యములు ఆంధ్రులకు లేకుండుటచే ఆంధ్రదేశమునందు మెట్టూరుప్రాజక్టువంటి ప్రాజక్టు, పైకారా విద్యుచ్ఛక్తి యేర్పాటువంటియేర్పాటు లేకున్నవి. ఇది ఆంధ్రుల కన్యాయమేగాని వేరుకాదు" అని ఆంధ్రనాయకులు అద్దేపల్లి హరిశ్చంద్రుడుగారు ప్రత్యేకాంధ్రరాష్ట్రము వెంటనే యేర్పడవలసిన అవసరమును గూర్చి ఆంధ్రపత్రికలో వ్రాయుచు ప్రస్తావించిరి. ఉద్యోగముల విషయమున ఆంధ్రులకు జరుగుచున్న అన్యాయమును వారుగడచిన మదరాసు శాసనసభలో ప్రశ్నలువైచి బయటపెట్టిరి.

అయితే ఈ అన్యాయమునకు, ప్రత్యేకాంధ్రరాష్ట్రము నిర్మింపబడువఱకు వల్లకుండవలసినదేనా? వల్లకుండరాదు. సగమునకు పైగా ఉద్యోగములు ఆంధ్రులపాలు కావలసియున్నది. ఈ ఉద్యోగములందు చొఱబాఱి అనుభవము సంపాదించిన ఆంధ్రులు ప్రత్యేకాంధ్రరాష్ట్రముపుతొలిజట్టుఉద్యోగులు కావలసియుందురు. కావున ఈ అన్యాయమును తొలగించుట అత్యవసరకార్యము. అయితే ఇందుకు పత్రికలలో వ్యాసములు, శాసన సభలో ప్రశ్నలును చాలవు. తెరపియెఱుగని ఆందోళన జరిగినగాని మదరాసుప్రభుత్వమున పీటలు పెట్టుకొనియున్న అరవవానిప్రాబల్యమునకు సడలుపాటు, ఆంధ్రునిప్రాబల్యమునకు శుభారంభము జరుగదు. అట్టి తెరపియెఱుగని ఆందోళనకు శ్రీ హరిశ్చంద్రుడుగారివంటి సమర్థులగు నాయకులు పూనుకొని కార్యము తెఱగిట్టిదని ఇతరుల కుపదేశింప వలసియున్నది.

**స్వభాషాభిమాన మిట్లుండ వలయును:—**

మారిస్ కెవాలియర్ ఫ్రెంచిదేశస్థుడు. ప్యారిసుపట్టణ మాతని జన్మస్థలము. సినీమాలో వేషములువేయుట ఆతనివృత్తి. ఆత డీనడుమ 'లవ్ మి టునైటు' అను ఇంగ్లీషుటాకీలో నటించెను. ఆఫిలుమును ప్యారిసుపట్టణమున ప్రదర్శించుటకు తెచ్చిరి. ప్రదర్శనము ప్రారంభమయ్యెను తమజాతీయుడును, విశేషించి తమ పట్టణమున జనించినవాడును అగు కెవాలియర్ పరభాషయగు ఆంగ్లమున ముచ్చటించుచుండగా చూడజాలక వారు ఆఫిలుము ప్రదర్శనమును నిలిపివైవవలెనని పట్టుబట్టిరి. ఫిలుము చూడవలయునను కొండంతకుతూహలమును కూడ స్వభాషాభిమానమున వారుకడద్రోసి నిలిచిరి. స్వభాషాభిమాన మిట్లుగదా యుండవలయును? ఫ్రెంచివారి స్వభాషాభిమాన మట్లున్నది. మఱి మనఆంధ్రులదో? వారికి ఆంగ్లభాషమీదను, హిందీభాషమీదను ఉన్నప్రేమ తెనుగుపై లేదు. వివాహమునకు ఆహ్వానపత్రికలుకూడ ఆంగ్లమున ముద్రించుటయే ఆచారమైయున్నది. శ్రీ భోగరాజు పట్టాభిసీతారామయ్యగారు ఈ విషయమున ఆంధ్రు లున్నశోచనీయస్థితిని వారి 'జన్మభూమి' పత్రికలో వెల్లడించియే యున్నారు. అయినను ఆంధ్రులలో ఇంకను స్వభాషాభిమానము రేగలేదనియే చెప్పవలసియున్నది. స్వభాషాభిమానవిషయమున మనకంటె మనపొరుగువారగు కర్ణాటకులు, తమిళులు మేలు. ఈ మాసమునకూడిన మైసూరుసంస్థాన శాసనసభ కార్యక్రమమంతయు కన్నడమునందే జరిగినదని వినుచున్నాము. శ్రీ రవీంద్రనాధటాగూరిగారి విశ్వభారతియందు ప్రార్థనాగీతములందు తమిళగీతములను కూడ చేర్పింప అచ్చటి తమిళులు ప్రయత్నించి కృతకృత్యులైరని మిత్రులొకరు చెప్పుచున్నారు. ఈ చిన్నియంశములు వారివారి స్వభాషాభిమానమును నిదర్శించుటకు చాలియున్నవి. నేటి ఆంధ్రప్రముఖనాయకులలో నొకరగు శ్రీ వేమవరపు రామదాసు పంతులుగారితో ఈరచయిత కొలదిదినములక్రితము మాట్లాడు నవసగమున శ్రీవారు తామీనడుమ సేలములో ఉపన్యసించినపుడు తెనుగునందే ఉపన్యసించితిమనియు, దానికి సేలమునందలి తెనుగువారు నిర్భరానందము పొందిరనియు సెలవిచ్చిరి. శ్రీ పంతులుగారివంటి నాయకులు ఇట్టి ఆదర్శమును చూపుటకు దీక్షవహించుచో తెనుగున మాట్లాడుట నామోషీయనుకొను మన ఆంగ్లమానసపుత్రుల భ్రమ తొలగిపోగలదు.

### ఆంధ్రోత్కళసమస్య:

**శ్రీ గిడుగు సీతాపతిగారు:—**

ఆంధ్రోత్కళసమస్యసందర్భమున ఉద్యోగమును గోల్పోయినవారు శ్రీ సీతాపతిగారొక్కరే. వీరి ఆంధ్రాభిమానమునకు కంటగిల్లి ఉత్కళులగు శ్రీ పర్లాకిమిడి రాజావారు తమకళాశాలనుండి సీతాపతిగారిని ఏవియో సాకులుచూపి తొలగించిరి. ఈ తొలగింపు సీతాపతిగారి ప్రజాహితజీవితమునకు పట్టానిచ్చినది. పర్లాకిమిడి ఆంధ్రప్రజాలోకము శ్రీవారిని తమతాలూకాబోర్డు అధ్యక్షపదవితో సత్కరించినది. ఈ సత్కారమును పొందియు శ్రీవారు ఆంధ్రోత్కళసమస్యవిషయమున తమశ్రద్ధను సడలింపలేదు. ఊపిరి సలుపని ఆందోళనము సల్పిరి; సభలు చేసిరి; తీరుమానములు గావించిరి; నిద్రించినవారిని మేల్కొల్పిరి; మేల్కొనియున్నవారికి హుషారిచ్చిరి. ఇంతమాత్రముతో తృప్తినొందక వారీవిషయమై లండనుకుకూడ పోయియున్నారు. తాటాకుమంటవంటి ఉద్రేకమునకు మాత్రము పేరుమోసిన ఆంధ్రులలో నిట్టి కార్యదీక్ష అరుదనుటకు సందేహము లేదు. దీక్షగలచోట జయము నిస్సంశయముకావున శ్రీవారి ప్రయత్నము సఫలమై తీరును.

### వీరేశలింగవీరున కీరీతిపూజయా? :—

ఆంధ్రదేశమునందలి హరిజనోద్యమమునుగూర్చి వ్రాయుచు ఈనడుమ 'హరిజన' పత్రిక "ఈ ఘనకార్యమునకు మొదట రావుబహదరు కందుకూరి వీరేశలింగము పంతులుగారే పునాదిని వేసిరి. అతడు బీదలు, వ్యాధిగ్రస్తులు, బాధితులు నగువారి నుద్ధరించుటకు చేసిన పనికంటె నధికప్రోత్సాహకమగునది ఆంధ్రదేశీయులకు మఱేదియునుండజాలదు" అని ముగించుచున్నది. ఇట్లు రాష్ట్రేతరులచే బహుముఖముల కీర్తింపబడుచున్న శ్రీవీరేశలింగముపంతులుగారిని, మన మెట్లు గౌరవించుచున్నాము? వారికార్యదీక్షకు ప్రదర్శనభూమియైన రాజమహేంద్రవరమున వారిశిలావిగ్రహమును ప్రతిష్ఠింప కొంతప్రయత్నము జరిగినది. ఆంధ్రదేశము పేరుచెప్పి శిలావిగ్రహప్రతిష్ఠయే లేదు. అగుట పంతులుగారి ఈ శిలావిగ్రహప్రతిష్ఠ ఆంధ్రదేశమున తొలుతటిది కాగలదనియు, తనకు కీర్తి తెచ్చిన పౌరుని శిలావిగ్రహప్రతిష్ఠచే ప్రథమమున గౌరవించిన మాట రాజమహేంద్రవరమునకు దక్కుననియు తలంచితిమి. కాని వీరేశలింగముపంతులుగారు మరణించి పదునైదువత్సరములు కావచ్చుచున్నను ఈ విషయము కార్యరూపము దాల్చు సూచనలు కానరాకున్నవి. ఈ శిలావిగ్రహప్రతిష్ఠకొఱకు కొంతపని చేసియున్న రాజమహేంద్రవరపౌరులు శ్రీ కంచుమర్తి రామచంద్రరావుగారిపుడీలోకమున లేరు. వారియనంతరము ఈకార్యమునుగూర్చి శ్రద్ధవహించుచున్నవారును కానరారు. ఆంధ్రదేశపు రామమోహనరాయలు, ఆధునికయుగప్రవర్తయగు వీరేశలింగవీరుని మనమిటులనా పూజించునది?


### సభలనైన చేయుడు:—

ప్రత్యేకాంధ్రరాష్ట్రసంపాదన విషయమై మనప్రస్తుతకర్తవ్యమునుగూర్చి ఆంధ్రపత్రికలో ప్రస్తావించుచు శ్రీజయంతి వేంకట కిరీటరావుగారిట్లు వ్రాయుచున్నారు. "ఆంధ్రమహాసభతరఫున వేంకటగిరికుమారరాజాగారును, బరంపురము పర్లాకిమిడి ప్రాంతములను ఉత్కళమునందు చేర్పరాదని విన్నవించుటకు సర్ కూర్మా వెంకటరెడ్డి

నాయుడుగారును ప్రస్తుతము లండనుపోయి యున్నారు. వా రచట చేయుకృషికి చేయూ తగనుండునట్లు ఆంధ్రులు స్వదేశమున తఱుచుగ ప్రతిముఖ్యపట్టణమునందును పెద్ద నాయకుల ఆధిపత్యమున బహిరంగసభ లొనర్చి, ఒరిస్సారాష్ట్రముతోబాటు ప్రత్యే కాంధ్రరాష్ట్రమునుకూడ నిర్మింపవలెనని యు, ఆంధ్రప్రాంతము లేవియు ఒరిస్సాలో చేర్పరాదనియు తీర్మానించి ఆతీర్మానము లను ఇండియాప్రభుత్వమువారికి, లండను జాయింటుకమిటీకి పంపెవలెను." నోరుగల వాని దేరాజ్యము. ఈయుగమున సభలు, తీరు మానములే ఒకనికి నోరుగలదని చెప్పుటకు సాధనములు. ఈ సాధనముల నుపయోగిం చుటలో దుర్భరమగువ్యయముకూడ కాదు. విశేషవ్యయమునకు అవసరము లేకుండియు విశేషఫల మీయగల ఈసాధనములనుప యోగించుటకుకూడ ఆంధ్రు లుత్సాహము చూపకుండుట విచిత్రముగనున్నది. ఈ విష యమున దేశమున ఒక్కసభకూడ కూడలే దనుటకు విషాదము కలుగుచున్నది. ఏలూరు యువకన్యాయవాదులలో వర్ధమానచం ద్రులనదగిన శ్రీ అడవి రామారావుగారీ నడుమ పూనా, బొంబాయియందలి ఆంధ్ర సభలలో ఉపన్యసించుచు "ప్రత్యేకాంధ్ర మహాసభ కధ్యక్షతవహించిన సర్ కూర్మా వేంకటరెడ్డినాయుడుగారు పర్లాకిమిడి, బరం పురము మొదలయిన ఆంధ్రప్రదేశములను ఉత్కళమున చేర్చుట అన్యాయమనియు, ఈ అన్యాయము తొలగనియెడల ఆంధ్రులు నూతనసంస్కరణములకు భంగముకలిగింతు రనియు చెప్పియుండిరి. వారును, తదితరులును జాయింటుకమిటీకి నివేదింప లండను వెళ్లియు న్నారు. కమిటీ వారికి మన అభిప్రాయము కూడ తీర్మానములద్వారా వెంటనే తెలియ చేయుట అవసరము" అని చెప్పియున్నారు. కాని ఆంధ్రులలో పెద్దతరమునాయకు లీవిష యమున మూకీభావము వహించినట్లే కనిపిం చుచున్నది. కావున శ్రీయుతులు కిరీటరావు, రామారావు గార్లవంటి యువకులైన ఈ సమయమున నడుములుకట్టి ఆంధ్రదేశము నందలి ప్రతిమండలపట్టణమునకును బోయి తీవ్రతరప్రచారముచేయవలసినది ముఖ్యా వసరమగుచున్నది.

**శ్రీచల్లపల్లిరాజాగారి విజయము:—**

ఒకజిల్లాయందలి ప్రజలు తమ ఆమోద మునందినవారికి చేయగల గౌరవములలో వారినిజిల్లాబోర్డుఅధ్యక్షులుగ ఎన్నుకొనుట నునది శిఖరమునిలుపదగినది. అట్టిగౌర వమును కృష్ణామండలప్రజాలోకము మొ న్న శ్రీచల్లపల్లిరాజా శ్రీయార్లగడ్డ శివరామ ప్రసాదుబహదూరువారికి గావించెను. ఇది శ్రీరాజావారి ప్రజామిత్రత్వమునకు పట్టా. ఈ విషయమున శ్రీరాజావారికి గలిగిన విజయము యువకులవిజయముగ మేము భావింతుము. శ్రీవారు కళాశాలను విడనాడి పట్టాభిషిక్తులై పట్టుమని పదిసంవత్సరము లైన కాలేదు. ఈ లోపుననే వారు తమ జిల్లాప్రజలచే పొందగల అఖండసన్మాన ము నందిరి. ఇది వారి శుభోదర్కమును సూచించుచున్నది. తమ జమీందారీపలుకు బడికి సుదూరమున నున్న కొండపల్లి ఫిర్కా లోకూడ శ్రీవారు విజయమును బడయుటచే వారు ప్రజాహృదయము నెంతగ అధిష్ఠించి యున్నారో సులభముగ నిర్ణయింపవచ్చును. యువకులగు శ్రీరాజావారి హయామునందు కృష్ణాజిల్లాబోర్డు పరిపాలనము ఉత్సాహ పటుత్వములకు పేరెక్కి జిల్లాప్రజల సాము దాయకసౌఖ్యమునకు తావలము కాగలదని నమ్ముచున్నాము.




## మే, 1933.

౧౧:—తెనాలి. ఆంధ్రనటశేఖరులు శ్రీపిల్లలమఱ్ఱి సుందరరామయ్యగారు మరణించిరి.

౧౩:—బెజవాడ. శ్రీ అరిపిరాల సత్యనారాయణ మూర్తిగారు తమచే రచియింపబడిన 'గానకళా చంద్రిక'ను శ్రీకాశీనాధుని నాగేశ్వరరావుపంతులుగారికి మహాసభలో కృతిసమర్పించిరి.

౧౪:—శ్రీ బొబ్బిలి రాజావారి సోదరులగు శ్రీజనార్దన రంగారావుగారికి ప్రధమపుత్రికాజననము.

౧౯:—నెల్లూరు. 'రూరల్ ఇండియా' అనుపక్షపత్రికను ప్రచురింప జి. రాజరత్నముగారు జిల్లామేజస్ట్రేటు వద్ద డిక్లరేషను పొందిరి.

౨౪:—టెక్కలి. తాలూకాబోర్డుసభలో టెక్కలి తాలూకాను ఏర్పడబోవు ఉత్కళరాష్ట్రమున చేర్పరాదను తీర్మానము అధికసంఖ్యసభ్యులచే ఆమోదింపబడియు అధ్యక్షులచే నిరాకరింపబడెను.

:—గుడివాడ. శ్రీ అనుమోర అప్పయ్యచౌదరిగారు తాలూకాబోర్డుఅధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

:—కైకలూరు. శ్రీ గుడివాడ సూర్యనారాయణ నాయుడుగారు తాలూకాబోర్డు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

:—నందిగామ. శ్రీజయంతిపురము రాజాగారు తాలూకాబోర్డు అధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

౨౬:—బరంపురము. శ్రీగాది బలరామదాసు, ఎం. వి. రమణరావుగార్లు 'భారతీపత్రిక' అను క్రొత్త తెనుగువారపత్రికను ప్రచురించిరి.

౨౭:—ప్రత్యేకాంధ్రరాష్ట్రావశ్యకతనుగూర్చి లండను జాయింటు కమిటీయెదుట సాక్ష్యమిచ్చుటకు వెంకటగిరి కుమారరాజాగారు బొంబాయినుండి బయలుదేరిరి.

౨౮:—ఆంధ్రప్రతినిధులగు సర్ కూర్మ వెంకటరెడ్డి నాయుడుగారు లండను చేరిరి.

౨౯:—గాంధిమహాత్ముని ఉపవాసయజ్ఞసమాప్తి.

:—ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి ఆరవ వర్ధంత్యుత్సవము.

:—ఉదకమండలము. తుంగభద్రప్రాజెక్టు రెవిన్యూ విషయకమైన సాధకబాధకములను గూర్చి ఆలోచించుటకు జి. డబ్లియు. ప్రీస్టిలీ ఐ. సి. యస్. గారు నియమింపబడిరి.

౩౦:—పూనా. ఆంధ్రసభవారి యాజమాన్యమున రస్తాస్ పేటలో ఆంధ్రసభాభవనమున ఏలూరు కాపురస్థులు రావుసాహెబు గారపాటి ఆంజనేయ చౌదరిగారు తాము క్షయరోగవిషయమై చేసిన పరిశోధనగురించి డా. మూర్తిగారి యాధిపత్యమున ఉపన్యసించిరి.

౩౧:—బందరు. కృష్ణాజిల్లాబోర్డుకు శ్రీచల్లపల్లిరాజాగారు అధ్యక్షులుగను, శ్రీగొల్లపల్లి రాజాగారు ఉపాధ్యక్షులుగను ఏకగ్రీవముగ ఎన్నుకొనబడిరి.

—:ఏలూరు. పాలకొల్లువారులు శ్రీయుత బోళ్ల వేంకటసుబ్బారావుగారు పశ్చిమగోదావరిజిల్లా బోర్డు ఉపాధ్యక్షులుగ ఎన్నుకొనబడిరి.

## జూను, 1933.

౧:—ఉదకమండలము. శ్రీ బండి శ్రీహరిరావునాయుడిగారికి దివానుబహదూరు బిరుదలాంఛనము గవర్నరుగారిచే నొసగబడెను.

౨:—రాజమండ్రి. 14-వ ఆంధ్రదేశప్రకృతివైద్య మహాజనసభ. డాక్టరు శి. వెం. రామారావు గారు అధ్యక్షులు.

:—కావలి. రా. సా. వెన్నెలకంటి కృష్ణస్వామి రావుగారు-కావలి తాలూకాబోర్డు అధ్యక్షులుగ నుండినవారు-మరణించిరి.

౩:—లండను. సర్. కె. వి. రెడ్డినాయుడు గారు ఆంధ్రోత్కళసమస్యనుగూర్చి ఇర్విను ప్రభువుగారితో సంభాషించిరి.

:—'దేవాంగజ్యోతి' నడపినవారును, 'ఆంధ్రప్రకాశిక'ను పునరుద్ధరించినవారును అగు శ్రీదొంతం శెట్టి నాగేశ్వరరావుగారు మదరాసునందు మరణించిరి.

:—బెజవాడ. మునగాలరాజాగారి పెద్దకుమారులు శ్రీరామకృష్ణారెడ్డి ఎం. ఏ గారు శ్రీకట్టమంచి కొళందరెడ్డిగారి పెద్దకుమార్తె శ్రీమతి కమలాదేవిగారిని వివాహమాడిరి.

౪:—బెజవాడ. 16-వ ఆర్యవైశ్యమహాసభ, ఆహ్వానసంఘాధ్యక్షులు: ఆలపాటి కుటుంబరావుగారు; సభాధ్యక్షులు సామి వెంకటాచలం శ్రేష్ఠిగారు.

:—బెజవాడ. మునగాలరాజాగారి రెండవకుమారులు శ్రీగోపాలకృష్ణారెడ్డి బి. ఏ., (క్యాంటబ్) గారు శ్రీ కట్టమంచి కొళందరెడ్డిగారి రెండవకుమార్తె శ్రీసరోజనీదేవిగారిని వివాహమాడిరి.

౫:—బెజవాడ. 9-వ వైశ్యమహిళాసభ. శ్రీమతి కొల్లూరి మహాలక్ష్మమ్మగారు అధ్యక్షురాలు.

:—ఉదకమండలము. గంజాంమండలమునందలి ఒకభాగమును ఉత్కళమున చేర్పనుండుటచే తెలుగుజిల్లాల కొన్నిటి సరిహద్దులు మారుటనుగూర్చి ప్రభుత్వమువారు చేయుచున్న ఆలోచనల సందర్భమున శాసనసభపూర్వపు టధ్యక్షులు శ్రీనరసింహరాజుగారు రెవిన్యూ సభ్యునితో సంప్రదించిరి.

౬:—రేపల్లె తాలూకా గ్రంథాలయమహాసభ. మంతెనవారిపాలెము. అధ్యక్షులు శ్రీ డా. వెం శ్రేష్ఠిగారు.


౯:—ఆంధ్రవాఙ్మయసేవకులలో నొకరగు శ్రీ బసవరాజు వెంకటఅప్పారావుగారు బెజవాడకు సమీపమునమన్న కొమ్మమూరులో చనిపోయిరి.

౧౦:—కృష్ణానదినుండి మూలపాడుదగ్గర కాలువను నిర్మించు స్కీము సాధ్యపడదని ఇంజనీర్లు అభిప్రాయమిచ్చుటచే మదరాసు ప్రభుత్వమువారు దానిని విడిచిపెట్టుటకు ఉత్తరువు గావించిరి.

౧౨:—పర్లాకిమిడి తాలూకాబోర్డు అధ్యక్షులు శ్రీ గిడుగు సీతాపతిరావుగారు పర్లాకిమిడిని ఒరిస్సాలో చేర్చుటకు ఆంధ్రులు సమ్మతింపరని జాయంటుకమిటీ ఎదుట సాక్ష్యమీయ బొంబాయి మీదుగా లండనుకు పయనమైరి.

:—ఆంధ్రవిశ్వవిద్యాలయోపాధ్యక్షులు సర్. యస్. రాధాకృష్ణన్ గారు జినీవాకు బొంబాయిమీదుగా ప్రయాణము.

౧౩:—సికిందరాబాదు. వనపర్తిసంస్థానముకేసులో నైజాముగారి ఫర్మానా: మునగాల రాజాగారి మనుమడగు వనపర్తిమైనరురాజా రామేశ్వరరావుగారికి యుక్తవయస్సు రాగానే సంస్థానమువారి పరము చేయుటకును; అంతవఱకు కోర్టు ఆఫ్ వార్డ్సువారి అధీనమున నుండుటకును; సంస్థాన వ్యవహారము చూచు వారికి రూపాయిలో నాలుగు అణాలు, రాజా రామేశ్వరరావుగారికిని, వారి ప్రత్యర్థియగు రామదేవురావుగారికిని చెరి ఆరు అణాలు వంతున చెందుటకును.




## కీ. శే. శ్రీరాజా దామెర వెంకటసీతారామయ్య బహదూరువారు.

తూర్పుగోదావరిమండలమునందలి జమీందారీలలో కాట్రావులపల్లిపోస్టు జగ్గంపేటజమీందారి ఒకటి. ఆ జమీందారీని బాగుగ నభివృద్ధికి తెచ్చినవారిలో కొలదివత్సరములకు పూర్వము దివంగతులైన శ్రీరాజా దామెర వెంకటసీతారామయ్య బహదూరువారు ముఖ్యులు. వారు విశాఖపట్టణము జిల్లాయందలి లింగాలవలస గ్రామమున 1886-వ సంవత్సరమున జననమునొందిరి. వారివంశము కవులవంశము. వారి పూర్వులలో పెక్కురు కవిత్వాభిరుచి గలిగియుండిరి; కావ్యములను వ్రాసిరి. వానినెల్ల శ్రీదామెర వేంకటసీతారామయ్య బహదూరుగారు ప్రచురించియుండిరి.

శ్రీరాజావారు బొబ్బిలియందును, మద్రాసునందును విద్యనందిరి. 1902-వ సంవత్సరములో శ్రీవారు మద్రాసునందలి తమవిద్య పరిపూర్తినందినతోడనే కాట్రావులపల్లి వెళ్ళిరి. అప్పటికి జగ్గంపేట సంస్థానమునకు శ్రీరాజా చెలికాని అప్పారావు బహదూరు వారు ప్రభువులు. వారికి మగసంతతిలేదు. ఒక్క స్త్రీయే కూతురు. ఆమెను శ్రీఅప్పారావుబహదూరువారు శ్రీ వేంకటసీతారామయ్య బహదూరువారి కిచ్చి వివాహము చేయ నిశ్చయించియుండిరి.

ఈ సందర్భముననే శ్రీ వేంకటసీతారామయ్య బహదూరువారు మద్రాసున తమవిద్యాపరిపూర్తియైన వెంటనే కాట్రావులపల్లిచేరిరి. కాట్రావులపల్లికి వీరిరాక జగ్గంపేట సంస్థానమునకు శుభములరాకయయ్యెను. శ్రీ వేంకటసీతారామయ్య బహదూరువారు జగ్గంపేట చేరిన మరునాడే ప్రీవీకౌన్సిలులో సంస్థానమునుగూర్చి అదివఱకు జరుగుచుండిన దావా శ్రీవారికాబోవుమామగారగు శ్రీరాజా చెలికాని అప్పారావుబహదూరిగారి పక్షమున తీర్పుచెప్పబడుటయు, సంస్థానముపై వారికి పూర్ణమైనహక్కు ఏర్పడుటయు జరిగెను. కొలది వత్సరములకు పిమ్మట శ్రీవారి వివాహము జరిగెను. జగ్గంపేట సంస్థానము శ్రీవారికి వివాహకట్నముగా ఒసంగబడెను.

ఈవివాహము జరుగుటకు ఒక సంవత్సరమునకు పూర్వము శ్రీవారి మామగారు శ్రీరాజా చెలికాని అప్పారావు బహదూరుగారు చనిపోయిరి. అగుట శ్రీవారు సంస్థానమును అత్తగారగు శ్రీరాజా వెంకయ్యమ్మగారి పేర పరిపాలింపదొడగిరి. వీరిపరిపాలనము ప్రారంభమైనతోడనే సంస్థానము పెక్కురీతుల అభివృద్ధికి వచ్చెను. పాడైయున్న ఒక పెద్దచెఱువును శ్రీవారు బాగుచేయించి తమమామగారిపేర వెలయించిరి. సంస్థానమునకు ఏలేటివలన కలుగుచున్న జలాధారమునకు ఇదికూడ తోడై అచటిరైతుల అభ్యుదయమునకు కారణమయ్యెను. ఈబాగుచేయించిన చెఱువు చుట్టుపట్టులనున్న ఐదుగ్రామములకు ముఖ్యజలాధారమైయున్నది. ప్రీవీకౌన్సిలువఱకు వెళ్ళిన దావాలమూలమున సంస్థానమునకైన ఋణములనన్నిటిని దీర్చివైచి శ్రీరాజావారు ధనమును నిలువచేసిరి.

శ్రీరాజా దామెర సీతారామయ్య బహదూరువారు ఉదారహృదయులు, దానప్రియులు. స్వజనమునకును, ఇతరులకును వారు చేతనైన సాయముచేయుచుండువారు. ప్రీవీకౌన్సిలుతీర్పు వ్యతిరేకముగనున్నను శ్రీ

[illegible]వారు తమ ఆత్మీయులతో చెప్పి తమయొక్క సోదరుల కుమార్తెలకు వివాహము చేసి, ఎస్టేటును ఇచ్చిరి. తమయొక్క సోదరియగు శ్రీ [illegible] అమ్మగారు [illegible] తమ ఆస్తికి [illegible] సత్రమునిర్మించ [illegible] శ్రీవారు [illegible] ఉండిన [illegible] చెప్పి [illegible] సత్రమును [illegible]. [illegible] సత్రమునకు [illegible] శ్రీవారు [illegible] సత్రమును [illegible] చెప్పి [illegible]. తమయొక్క [illegible] శ్రీవారు [illegible] శ్రీ [illegible] స్వామి [illegible] [illegible] శ్రీవారు [illegible].



[illegible]

[illegible] శ్రీవారు [illegible] వాసులు [illegible] శ్రీవారి [illegible] శ్రీవారు [illegible] శ్రీవారు [illegible]. శ్రీవారి [illegible].

శ్రీ [illegible] వారి [illegible] శ్రీ [illegible] [illegible] శ్రీ [illegible] ౧౯౨౨లో [illegible] శ్రీ [illegible] శ్రీవారు [illegible] సంస్థానమును [illegible]!

శ్రీవారు [illegible] సంస్థానము [illegible].

శ్రీవారు [illegible] శ్రీవారు [illegible] శ్రీవారు [illegible] వారికి [illegible]

# గ్రంథాలయోద్యమము



"గ్రంథాలయములు దేశమునకు ఊపిరితిత్తులు."

"ప్రస్తుతముహిందూదేశమునందు చదువుకొనినవారు నూటికి పదిమందికి తక్కువగనున్నారు. కాని ఇతరదేశములలో నూటికి నలుబదిమంది, అరువదిమంది యున్నారు. మనప్రక్కనున్న జపానుదేశములో నలుబది ఏండ్లక్రితము చదువుకొనినవారు నూటికి నలుబదిమంది మాత్రము ఉండెడివారు. కాని నేడు ఆదేశమున నూటికి నూర్గురు చదువుకొనినవారే. ఒకానొక కాలమున ప్రపంచమున కంతకును గురుపీఠ మలంకరించి యుండిన మనహిందూదేశమున ఇప్పుడు నూటికి తొంబదిమంది చేవ్రాలైనచేయజాలని వారుగానున్నారు. ఇట్టిశోచనీయపరిస్థితులలోనున్న మనదేశమునందు విజ్ఞానమును వ్యాపింపజేయుటకు గ్రంథాలయములే ముఖ్యసాధనములు. మానవునకు ఊపిరితిత్తులు ఎంతఅవసరమో దేశమునకు గ్రంథాలయములంత అవసరము గ్రంథాలయములతరఫున రాత్రిపాఠశాలలు ఏర్పఱచియు, పురాణకాలక్షేపముల కొనసాగించియు విద్యావ్యాప్తి గావింపవచ్చును. మనగ్రామములలో రైతులు తమకాలమును పేకాటమొదలగు దుర్వ్యాపారములయందు వ్యర్థపఱచుచుందురు. రైతుల నీవృథాకాలక్షేపములనుండి తమదిక్కునకు మరలించుకొనగలుగునేని గ్రంథాలయములు దేశమునకు చేయుమేలు నిరుపమానమగును."

—మాగంటి బాపినీడు.

ఆంధ్రులు: గ్రంథాలయోద్యమము.

"భారతదేశమునందు గ్రంథాలయోద్యమవిషయమున బరోడా తరువాత ఆంధ్రదేశమే పేర్కొనదగినది. దేశభక్తి, సంఘసేవలను ఉద్దీపింప చేయుటయందును; ఉత్తమమైన సాంఘికజీవన మలవడజేయుటయందును ఆంధ్రదేశగ్రంథాలయోద్యమమొనర్చినకృషివంటి కృషి భారతదేశమునందలి ఏఇతరభాగములోని గ్రంథాలయోద్యమమును చేసియుండలేదు. ఈవిషయమున ఆంధ్రగ్రంథాలయములు అగ్రస్థానమును అలంకరించుచున్నవనిన సత్యమునకు దూరముకాదు. బరోడాసంస్థానమునందలి గ్రంథాలయోద్యమము అచటిప్రభుత్వసహాయసంరక్షణలక్రింద వ్యాపించినది. మనఆంధ్రదేశమునందన్ననో స్వార్థరహితులగు ఆంధ్రయువకుల కార్యదీక్షయు, ఆంధ్రమహాజనుల ఆదరభావములే గ్రంథాలయోద్యమవ్యాప్తికి పట్టుకొమ్మలైయున్నవి. అఖిలభారతగ్రంథాలయప్రథమమహాసభను ౧౯౧౯-లో మదరాసునందలి గోఖ్లేమందిరమున జరుపుటకు పూనుకొని జయప్రదముగ జరిపినవారు ఆంధ్రదేశగ్రం

థాలయసంఘమువారే. నాలుగుసంవత్సరములకుపిమ్మట అఖిలభారతగ్రంథాలయద్వితీయమహాసభను ౧౯౧౩-లో కాకినాడయందు శ్రీ యం. ఆర్. జయకరుగారి అధ్యక్షతను జరిపినదియు నాంధ్రదేశగ్రంథాలయసంఘమువారే. ఆ సభ యందే అఖిలభారతగ్రంథాలయసంఘ మేర్పరుపబడి ఆసంఘనిర్వహణమునకు అవసరమగు నియమావళిగూడ ఏర్పరుపబడెను. అప్పటినుండియే అఖిలభారతగ్రంథాలయమహాసభ ప్రతిసంవత్సరము భారతదేశములో ఎచటనో యొక్కచోట జరుపబడుచున్నది. అప్పటినుండియే గ్రంథాలయోద్యమము అఖిలభారతీయోద్యమముగా పరిణమించినది. ఇది ఆంధ్రుడు గర్వింపదగిన విషయములలో నొకటి. ”


—అయ్యదేవర కాళేశ్వరరావు.

♦ ♦ ♦

బరోడా: గ్రంథాలయోద్యమము.

“బరోడాలో పుస్తకభాండాగారోద్యమము 1910-లో ప్రారంభమయ్యెను. బరోడా రాజావారు ఈ ఉద్యమవ్యాప్తికి డబ్లియు. ఏ. బోర్డనుగారియు, న్యూటనుదత్తుగారియు తోడ్పాటునొందిరి. బరోడాలో కేంద్రభాండాగారమున్నది. గ్రామములందు, పట్టణములందును భాండాగారములున్నవి. కేంద్రభాండాగారము మాతృసంఘమయి వీనికి తోడ్పడుచుండును. అక్కడ ఉచితముగా పుస్తకములను ఇండ్లకుకూడ నిచ్చెదరు. ఇదిగాక దానికిచేరి పత్రికాపఠనమందిరము ఉండును, స్త్రీల యుపయోగార్థముకూడ అందుపేర్పాటుకలదు. పిల్లలకు క్రీడామందిరమొకటి యున్నది. అక్కడ బాలురు వినోదముగ కాలక్షేపము చేయుటకు తగిన యేర్పాటులున్నవి. చదువుకొనువారికి కేంద్ర పుస్తకభాండాగారమునుండి చాలపుస్తకములు పంపుచుందురు. మన దేశములోని భాండాగారములలో నిది మూడవది. ఇందు 124,000 పుస్తకములున్నవి. గతసాలున 132,500 సంపుటములను చదువుకొనుటకిచ్చియుండిరి. పట్టణములకు, గ్రామములకు పుస్తకములు తీసికొనిపోయియు నక్కడకు పెట్టెలలో పంపించియు పుస్తకము లిచ్చుచుందురు. పుస్తకములు కోరిన పాఠశాలలకుగాని, గ్రంథాలయములకుగాని మరి ఇతరసంఘములకుగాని వారుచితముగ పుస్తకములు పంపించుచుందురు. భాండాగారశాఖవారే పంపుటకును, తిరిగి తెప్పించుకొనుటకును అగు ఖర్చులను భరించుచుందురు. ఇట్లు నిరుడు 22000 సంపుటములను ప్రజలు చదువుకొనుటకు పంపించియుండిరి. గ్రామభాండాగారములకు సంస్థానమువారు ధనసహాయము చేయుదురు. 1906 నుండి ఇదిజరుగుచున్నది. 1919 నుండి పుస్తకభాండాగారశాఖనొకటి నెలకొల్పిరి. గ్రామస్థులుగాని, పట్టణవాసులుగాని రు 100, రు. 300, రు. 700 లో చందా వేసికొనినప్పుడు అంతసొమ్మును భాండాగారశాఖవారిచ్చెదరు. జిల్లాబోర్డువారు కూడ నింతసొమ్మునిచ్చెదరు. కొన్నిసమయములలో మునిసిపాలిటీలు కూడ సొమ్మునిచ్చుచుండును. భాండాగారభవనమునకు ప్రజలు మూడవవంతు సొమ్మును పోగుచేసినయెడల తక్కిన సొమ్ములో చెరిసగమువంతున ప్రభుత్వమువారును, జిల్లాబోర్డువారును ఇచ్చెదరు. క్రొత్తగ గ్రామములలో భాండాగారములను ప్రారంభించినప్పుడు నూరురూపాయల గుజరాతీ పుస్తకములను పాతికరూపాయలకే గ్రామస్థులకిచ్చెదరు. తక్కిన ముప్పాతికరూపాయలను ప్రభుత్వమువారు భరింతురు. ”

—డాక్టరు వంగల వెంకటశివరామ్ ఎం. ఏ.,




# ఖరగపురాంధ్రుల కర్తవ్యములు

ఖరగపురమున నివసించు మన యాంధ్రుల స్థితిగతులంగూర్చి క్రిందటి సంచికలో వివరించియున్నాను ఇపుడు వారికర్తవ్యాంశములనుగూర్చి యొకింత ముచ్చటించుట యప్రస్తుతము మాత్రము కాఁజాలదు.

విషయాంతరములయందు మనవారు మిగుల కృషిసల్పుచుఁ గృతార్థులగుచున్నను విద్యావిషయమున మాత్రము వెనుకబడియున్నారను నంశ మిదివఱకే వివరింపఁబడియున్నది. మన యాంధ్రజాతీయత - వ్యక్తిత్వము ప్రపంచమం దంతటను బ్రకటితమై యాంధ్రులకు గౌరవౌన్నత్యములు కలుగవలెనన్న భాషావాఙ్మయాభివృద్ధి యవశ్యకర్తవ్యము. ఆంధ్రులు కారణాంతరముల వలన విదేశములకు వలసపోయియున్నను స్వజాత్యభిమానము విడుచుట కష్టముగదా! మానవస్వాభావికమగు నామమత మెట్లున్నదో యట్లే పుట్టినదాదిగా సర్వవ్యవహారములకును మూలమైన తెలుఁగుతల్లియందు గూడ గౌరవముంచి యామెయెడఁగూడ మమత్వము కలిగియుండవలెను. తెలుఁగుభాష రమారమి రెండుకోట్ల యేఁబదిలక్షల జనుల ముఖములఁ దాండవమాడుచు భారతదేశమునందు మూఁడవదిగా నెన్నఁగొనఁబడుచున్నది. అట్లయినను రాష్ట్రేతరవాసులగు నాంధ్రులు భాషాంతరములను గౌరవించినట్లు స్వభాషను గౌరవించుచుండలేదని తెలుపుటకు విచారము కలుగుచున్నది. తమయిండ్లలోఁ బసిబాలురకు వారువారు నివసించు రాష్ట్రభాషనే మక్కువతో నేర్పుచు, స్వభాష నుపేక్షించుట యిందుల కుదాహరణము. ఆపిల్లలు తమ పసితనమునుండియు నాంధ్రేతరులేయగుట దానికి ముఖ్యఫలమగుచున్నది. మనవారు తమ పిల్లల కితరభాషను నేర్పరాదని చెప్ప సాహసింపముగాని స్వభాషను విడుచుటమాత్రము కూడదని చెప్ప సాహసింతుము.

ఖరగపురాంధ్రులకు భాషావాఙ్మయాభివృద్ధి కనుగుణములగు సౌకర్యములు చాలఁగలవు. "ఇండియన్ ఇన్‌స్టిట్యూటు"లోని గ్రంథాలయమునందుఁ దక్కిన గ్రంథములకంటె నాంధ్రగ్రంథములే యధికముగ నున్నవి. కాన మనవారు ఆగ్రంథములను దగినయుపయోగమునకుఁ దీసికొనివచ్చి యాంధ్రగ్రంథముల సంఖ్యను గ్రంథాలయమున ఎప్పటికప్పుడు పెంచుచుండుటకు ప్రయత్నింపవలసియున్నది.

రైల్వేయుద్యోగుల పిల్లల విద్యాసౌకర్యమునుగూర్చి యాలోచించి రైల్వేశాఖవారు హిందూఉన్నతపాఠశాలను స్థాపించియున్నారు. అందు విద్యనభ్యసించు నాంధ్రబాలురసంఖ్య యధికముగనున్నను హిందీ-బెంగాలీ మొదలగు నితరభాషలకున్న ప్రాముఖ్యము ఆంధ్రమునకు లేకపోయినది.

ఆంధ్రబాలురుకూడ నాంధ్రేతరులతోఁ బాటు హిందీ మొదలగు భాషల నభ్యసించుచుఁ దమ మాతృభాషను మఱచిపోవు స్థితియందున్నారు. ఖరగపురాంధ్రు లీవిషయమున నాందోళనములను సలుపకున్నను కలకత్తానగరమున జరిగిన యాంధ్రమహాసభవా రాందోళనసల్పి (౧౯౨౭) యుండిరి. అపుడు వంగప్రభుత్వమువారు [వంగదేశప్రభుత్వపుకార్యదర్శి వ్రాసిన యుత్తరమున నీవిషయముకలదు. చూడుము- 'రాష్ట్రేతరాంధ్రులు' సంపుటము ౨ సంచిక 3. సెప్టెంబరు, ౧౯౨౯.] ఆంధ్రు లెక్కువగనున్నస్థలములందుఁగల విద్యాలయములలో నాంధ్రమునకుఁ బ్రాధాన్యముండుట తమకు సమ్మతమేయనియు, మెట్రిక్యులేషను పరీక్షలోనదియుఁ బరీక్షింపఁ బడుననియు, నాంధ్రమునకుఁ బ్రత్యేకముగ నుపాధ్యాయుని నియమింపవచ్చుననియుఁ, దక్కిన వానికివలె దీనికిని ప్రభుత్వమువారు గ్రాంటునీయఁగలరనియుఁ దెల్పియున్నారు కాని ఖరగపురాంధ్రు లేలయుపేక్షించిరో తెలియకున్నది. పాఠశాలావిచారణసంఘమున సభ్యులైన యాంధ్రు లీవిషయమున నుపేక్షవహించుట మిక్కిలి యన్యాయము. ఇఁకనైనను మనవారందఱు నావిషయమునఁ బ్రయత్నించి కృతార్థులయ్యెదరుగాక !

ఆంధ్రజనసంఘమువారు ఆంధ్రవిద్యానిధికిఁజందాలను వసూలుచేయుచు నాంధ్రవిద్యాభివృద్ధికిఁ బాటుపడియున్నారు. కాని యిప్పు డావిషయమేమైనదియు వివరముగఁ దెలియుటలేదు. పైసంఘము వారేనడపుచున్న పత్రిక నిలువఁబడిపోవుటకూడ నందుకుఁగారణము కావచ్చును కావున వాఙ్మయాభివృద్ధినిగోరు మనవారు తిరిగి పత్రికానిర్వహణమునకై పరిశ్రమించి ఆంధ్రవిద్యానిధినిగూర్చి తమకును, తమ్ములను బట్టి యాంధ్రావనికిని మహోపకారములఁ గూర్తురుగాక!

సంఘబలమున్నగాని మీఁదికార్యములు కొనసాగుట కష్టముకానఁ బైసంఘమువారు తగినశ్రద్ధతీసికొని వివిధస్థలములయందున్నరాష్ట్రేతరాంధ్రులనందఱిని బురికొల్పి తమసభ్యులుగఁ జేర్చుకొని సంఘబలము కూర్చుకొనుట ముఖ్యకర్తవ్యము. సంఘమునందలిసభ్యులు తమసభ్యత్వమును సార్థకము చేసికొనినచో నాంధ్రులకుఁ బైసాకర్యము లేకాక యభిలషితములగు పనులు-మిగిలియున్నవన్నియును సాఫల్యమునొందఁ గలుగుటనిక్కువము.

పూర్వము ఖరగపురమున నాటకకళయభివృద్ధిఁబొందినట్లును, ఇప్పుడు నామావశిష్టమైనట్లును ఇదివఱకే చెప్పఁబడినది. దేశాంతరకళాసంపర్కమువలన నిపు డాంధ్రనాటకరంగము నూతనకళల వెలయించుచు భారతనాటకరంగమున మేలుచేయి వడయుచున్నది. సుప్రసిద్ధులగు నితరరాష్ట్రవాసు లాంధ్రనటకులను వేనోళ్లఁ బొగడుచున్నారు. ఆంధ్రకీర్తికాంత యున్నతపదవి నొందుటకు నాటకకళ యొకమెట్టని చెప్పకతప్పదు. ఖరగపురాంధ్రు లీకళను బునరుద్ధరించినచోఁ దక్కిన రాష్ట్రేతరాంధ్రు లెల్లరును వీరి మార్గము ననుసరించుట నిక్కము. కావున నాంధ్రులకీర్తిప్రతిష్ఠలకుఁ బాటుపడు ఖరగపురాంధ్రులు నాటకకళంగూడ నుద్ధరింతురుగాక!

—బులుసు వేంకటరమణయ్య.

# ఇన్స్యూరెన్సు విషయములు

**౫. భీమా యొక్క ప్రాముఖ్యము:—**

భీమాయొక్క ముఖ్యోద్దేశము సాంఘికసేవ. మానవుని స్వీయరక్షణమే పైకి గోచరించుచున్నను సాంఘిక బాంధవ్యము, పరోపకారచింతయు నిందిమిడియున్నవి. మానవుని జీవితపథమునుండి అనిశ్చయములను తొలగించి; కుటుంబపోషణకర్త అకాలమరణముచే సంభవించు యిక్కట్టులను, క్షేమిని పోగొట్టి సౌఖ్యమొనగూర్చుటలో భీమా సాటిలేనిది. ఇతరవిషయములలో సైతము భీమా అపాయముల నివారించి విధిని కొంతవఱకు జయించుట కుపకరణమైనది. వ్యాపారమువలన లాభము కలుగవచ్చును, లేక నష్టము కలుగవచ్చును; పైరులు పండవచ్చును, లేక యెండవచ్చును; పడవ దరిజేరవచ్చును, లేక సముద్రమున మునుగవచ్చును; గృహము సురక్షితముగానుండవచ్చును, లేక అగ్నికాహుతి గావచ్చును; మానవుడు దేహసౌందర్యమును కాపాడుకొనవచ్చును, లేక అంగవైకల్యమును పొందవచ్చును; బ్రతుకు నూరేండ్లు కావచ్చును, లేక యింతలో మరణము సంభవింపవచ్చును; సేవకుడు విశ్వాసనీయుడు కావచ్చును, విశ్వాసఘాతకుడును కావచ్చును; యజమానుడు గుమాస్తాలయెడ సానుభూతి చూపవచ్చును, లేక కష్టనష్టములకు లోనుగావింపవచ్చును; ద్రవ్యము సంరక్షింపబడవచ్చును, లేక చోరుల చేతికి చిక్కవచ్చును. అన్నియు బాగుగ నెరవేరుచు వచ్చిన మంచిదే. లేనిచో నష్టముకల్గును. అట్లు నష్టమురానీక ముందుజాగ్రతపడు రక్షణకే యిన్స్యూరెన్సు, లేక భీమాయనిపేరు. ఈవివిధరక్షణలకై మానవుడు తన బుద్ధిబలముచే వివిధభీమాపద్ధతులను కనుగొన్నాడు. భీమా ఈకష్టములబాపి రక్షణయొసగు పరమసాధనము. భీమాబాధ్యత ఒక్కమానవమాత్రునిమాత్రమే చెందక, సంఘమునకే చెందుచున్నది. పురములందు పాఠశాలల నేర్పరిచి, దారులలో దీపములువేయించు బాధ్యత పౌరులందరి మేలుకై జనులెల్లు వహించుచున్నారో అట్లే భీమాబాధ్యతకూడను సమిష్టిబాధ్యతయే యగును. జీవితభీమా విలాసవస్తువుకాదు, అనవసరమైన సౌఖ్యము కాదు. కుటుంబరక్షణకు మిక్కిలి ఆవశ్యకమైనది. భీమాలాభములను గుర్తెరిగినవాడు తప్పక భీమాచేయ కోరును. భీమాచేయుటకు ముఖ్యముగవలసినవి ఆరోగ్యము, ద్రవ్యము. ద్రవ్యముచే ఎట్టిరక్షణనైనను పొందవచ్చును గాన ద్రవ్యసముపార్జనము, దానిపోషణము భీమాసంస్థల ముఖ్యోద్దేశమును; ఆర్థికశాస్త్రవేత్తల యాదేశమును అగుచున్నది. ఆరోగ్యమునందున్నపుడు ప్రతి మానవుడు తన్ను తనకుటుంబమును పోషించుకొనుట కవకాశము పొందుచున్నాడు. అట్టి సమయమున సులభముగ భీమాచేయుటకును శక్తిని పొందియున్నాడు. అట్లు భీమాచేయక తాను మరణించినచో దారాసుతాదులు రాబడిలేనందున కూటికి లేక మలమలమాడుచు, అనుదినమును కాయకష్టములుపడుచు జీవితమును దుఃఖముతో గడుపవలెను. లేదా బ్రతికియుండి ముసలితనము ప్రాప్తించినయెడల స్నేహితులపైగాని, బంధువులపైగాని, ఆధారపడవలసియుండును. తన సంసారమునకు తన అనంతరము జీవనోపాధి క్రమముగ జరుగుటకు తగిన యేర్పాట్లు చేయవలసినవిధి ప్రతిభర్తకు, తండ్రికి గలదు ఈవిధిని వారు తీర్చవలసినదే. ఇందుకు భీమా వారి కెంతయు నుపయోగించును. భీమా ప్రేమచిహ్నము. ముదిమియందు తాను లాభముపొందుటయేగాక, తన కొకవేళ మరణము సంభవించిన తనభార్యాపుత్రులు నడివీధి పాలుకావలసినపనియుండదను ధైర్యము గల్గినచో అతనిజీవిత మెంతసుఖవంతమగును? భీమాకై

వెచ్చింపబడు ద్రవ్యము యితరత్రా వెచ్చింపబడు ద్రవ్యముకంటె అధికలాభము లొనగూర్చును. భూసంపదకంటె మిన్నయైనది భీమాసంపద. కారుమబ్బులు క్రమ్మిన ఆకసమున భీమాయొక మెరుపువంటిది; తన కుటుంబముపై యింటియజమానుడు ద్రవ్యరూపమున చూపు అభిమానమేభీమా. ధనమును వృద్ధిపఱచునది, గృహములను రక్షించునది, లేమిని దూరముగ తొలగించునది, ఎపుడుకోరిన అపుడు లభించునది, అవసరమును గడుపునది భీమాయని రూఢిగ చెప్పవచ్చును. నమ్మకమును, నిశ్చయమును అయినపెట్టుబడి యిదియే. భూమిలో పాతిపెట్టబడిన ద్రవ్యము చిరకాలము బ్రతుకు కాకివలె నిరుపయోగమైనది. జాగ్రత్తగ ఆధనమును తగువిధముల నుపయోగించుచో తాత్కాలిక భారము తగ్గుటయేగాక, భావికాలమునకు సాయపడును. మానవహృదయతంత్రుల దాకి, కుటుంబపోషణను మరచిన వారికి వారివిధుల నెరుక పఱచుటలో భీమా నిరుపమానమైనదగుచున్నది. జీవితమునందలి సంతోషమును పీల్చి పిప్పిచేయు తహతహలు, ఆలోచనలు భీమాచేసినవానినంతగా బాధింపజాలవు. వానిజీవితము శాంతియుతముగనేయుండును. గృహమే దేశగౌరవమును చాటుచున్నది. గృహమే సంఘమునకును, ప్రభుత్వమునకును పునాది. కుటుంబదార్ఢ్యముపైననే భావిదేశీయస్థిరత్వము ఆధారపడియున్నది. అట్టిగృహమును మంచిపునాదులపై నిలుపునది భీమా.

## ౫. హిందూదేశమున భీమావ్యాపారము:—

'ఇండియనుఫినాన్సుయియరుబుక్' (1932) ప్రకారము 1929 వ సంవత్సరమువరకు సగటున

| | | |
|---|---|---|
| అమెరికావారు | ... | రూ. 2318·2 |
| కెనడావారు | ... | రూ. 1760·9 |
| న్యూజిలాండువారు | ... | రూ. 9[illegible]4·5 |
| ఆస్ట్రేలియావారు | ... | రూ. 750·7 |
| బ్రిటనువారు | ... | రూ. 731·5 |
| స్వీడనువారు | ... | రూ. 563·7 |
| ఇటలీవారు | ... | రూ. 418·0 |
| నార్వేవారు | ... | రూ. 376·7 |
| నెదర్లాండువారు | ... | రూ. 333·2 |
| ఇండియావారు | ... | రూ. 55 |

భీమాచేసియున్నారు. ఈ పట్టీవలన హిందూదేశస్థులీవిషయమున ఎంత వెనుకబడియున్నారో తెలియగలదు. ఒకదేశమున భీమావ్యాపారము ఉన్నతదశలోనున్నదనగా ఆదేశస్థులు అర్జనాతృష్ణగలవారనియు, ఆర్జించినధనమును జాగ్రత్తగ కాపాడకలవారనియు, పొదిమియొక్క విలువ తెలిసినవారనియు సులభముగ నిర్ణయింపవచ్చును. భీమావ్యాపారాభివృద్ధి ఆదేశముయొక్క ఆర్థికసుస్థితికి దర్పణమైయుండుననుటలో సందేహములేదు. అనేకవిషయములందువలెనే భీమావ్యాపారమునందును మనము ప్రారంభదశయందు ఉన్నాము. హిందూదేశమున కోట్లకొలది జనులు భీమాచేయుంచుకొను శక్తిగలవారయ్యు భీమావలని రక్షణమును పొందుటకు సుముఖులుగాలేరు. దీనికి కారణము వారు భీమావలనిలాభములను ఇంకను పూర్తిగ అవగాహనము చేసికొనకపోవుటయే. అమెరికాసంయుక్తరాష్ట్రములయందు కుటుంబరక్షణకై భీమాచేయబడు ద్రవ్యము వందబిలియనుడాలర్లపరిమితిని దాటినది. (బిలియను అనగా సహస్రకోటి. ఒకడాలరుకు సగటున 4 రూపాయిలగును) హిందూదేశమున భీమావ్యాపారవిషయమున 1912-వ సంవత్సరమునుండి కొంతయభివృద్ధికానవచ్చెను. ఆసంవత్సరమున ఈ దేశమున తొలుత భీమాచట్టమేర్పరుపబడెను. 1914-వ సంవత్సరమున ప్రారంభమై ప్రపంచమును కలగుండువెట్టిన ఐరోపామహాసంగ్రామముగొనివచ్చిన అరిష్టముల ప్రాబల్యముచే మనదేశజులు కొంతవఱకు భీమాయొక్క అవశ్యకతను గుర్తించిరి. 1920-వ సంవత్సరమునుండి హిందూదేశమున భీమావ్యాపారము క్రమాభివృద్ధినంది 1929-వ సంవత్సరమున 82 కోట్లవ్యాపారమును, నేడు 150 కోట్ల వ్యాపారమును సాగుచున్నది.

—ఆలూరు రామచంద్రయ్య, బి.ఏ,

# మహిళాలోకము

## స్త్రీలకు వ్యాయామవిద్య:—

మదరాసుప్రభుత్వమువారు ౧౯౩౧-వ సంవత్సరమునుండి స్త్రీలకు వ్యాయామవిద్యాప్రదానవిషయమున శ్రద్ధ వహించుచున్నారు. ఆసంవత్సరముననే వారు వ్యాయామవిద్యాపారీణయగు స్త్రీని ఈవిషయమున పనిచేయ ప్రత్యేకముగ నియమించిరి. ప్రతివిద్యార్థినియు తనకుతగిన శరీరవ్యాయామమునుపొందునట్లు చూచుటయే ప్రభుత్వమువారి యుద్దేశమైయుండెను. దీనికిగాను వారు కొందఱుస్త్రీలను వ్యాయామవిద్యయందు తరిబీదుచేసి ఉపాధ్యాయినులుగ నియమింపవలసిన అవసరమేర్పడెను. అగుట మదరాసుపట్టణమునందలి సెకండరీపాఠశాలలలోని ఉపాధ్యాయినులకు ప్రతిశనివారము ఉదయమున వ్యాయామవిద్యాశిక్షణమునకై తరగతులు ఏర్పాటుచేయబడుటయు, దానిపై చక్కని అజమాయిషీ ఉంచబడుటయుజరిగెను. పట్టణేతరప్రాంతమున వ్యాయామవిద్యాశిక్ష, పరీక్ష గావించుటకు వేఱుఏర్పాటు లొనరింపబడెను. ౧౯౩౭-వ సంవత్సరమున వ్యాయామవిద్యలో ఉపాధ్యాయినులకు సర్టిఫికెట్టునిచ్చు పరీక్షలు రద్దుగావింపబడి వ్యాయామవిద్యాశిక్షణమునకై తరగతి ప్రారంభింపబడెను. ఆతరగతిఏర్పాటు ఇపుడును అమలునందున్నది. వ్యాయామవిద్యయందు కొందఱికి ప్రత్యేకశిక్షణ మీయబడెను. పట్టభద్రలైనవారును, సెకండరీగ్రేడు ట్రెయిన్డుసర్టిఫికెట్టుగలవారును మాత్రమే ఈతరగతిలో చేర్చుకొనబడుదురు. వారైనను శారీరకముగ ఇందుకు తగినవారని డాక్టరువలన సర్టిఫికెట్టు పొందవలెను. కోర్సుముగిసిన తరువాత వారికి డిప్లమో ఒసంగబడును. డిప్లమోనుపొంది వారు వ్యాయామశాస్త్రోపాధ్యాయినులుగ నియమింపబడుటకు అర్హతనుపొందుదురు. రాజధానిమొత్తముమీద నలుబదిముగ్గురు వ్యాయామశాస్త్రోపాధ్యాయినులకు తావు ప్రత్యేకింపబడెను. ఇంతదనుక ఆనలుబదిమూడుస్థానములలో రెండుమాత్రమే నిండియున్నవి. ఇట్లగుట విద్యావతులగు మనస్త్రీలు వ్యాయామవిద్యాసముపార్జనమున శ్రద్ధపెట్టుటలేదని తేటతెల్లమగుచున్నది. చెన్ననగరమునందలి స్త్రీలపెద్దకళాశాలల మూడిటియందును వ్యాయామశాస్త్రోపాధ్యాయినులు గలరు. వ్యాయామవిద్యావిషయమున ప్రభుత్వమువారీరీతిని శ్రద్ధను చూపుచున్నదానికి సంతసమే; కాని ఈవిషయమున చేయవలసినపని, చూపవలసిన శ్రద్ధ ఇంకను ఎక్కువగనే ఉన్నది.

## ఉపాదేయమైన విషయము:—

గాంధిమహాత్ముని ఆదర్శముచే ఆంధ్రస్త్రీలలో కలిగిన సంస్కారావబోధము కొలదిఇడరానిదిగనున్నది. దేశసేవలో కారాగారములనుమెట్టుట వారికి పరిపాటియైనది. అస్పృశ్యులను వారు ఆత్మజులుగ జూడకలుగుచున్నారు. కాని వారు—కడుపునపుట్టినవారి మలమూత్రములను కుడియెడములు లేక బాగుచేయుటకు అలవడియున్నవారైనను—గాంధి ఆదర్శముచే చూపిన పాకీదొడ్డిని శుభ్రపఱచుపద్ధతినిమాత్రము గ్రహించుట

లో సంకోచింతురనుటనిశ్చయము. ఇట్టిసంకోచమును కట్టిపెట్టి గాంధిగారికి నిజమైన శిష్యురాలు అనిపించిన ఆంధ్రస్త్రీయొకతె గలదు. ఆమె తెనాలివాస్తవ్యురాలు. పేరు శ్రీమతి కొల్లా కనకవల్లి తాయారమ్మ. ఆమె ఆత్మగృహమునందలి పాకీదొడ్డిని చాల మంది ఆడవారియెదుట శుభ్రపరచినది. గొప్ప యింటియందు పుట్టియు, గొప్పయింటిని మెట్టియు ఆమె ఈకార్యము నొనర్చి తనకుగల ఉత్కృష్టాదర్శమును వెల్లడించినది. స్త్రీలలో ఇంతటి ఉచితజ్ఞతప్రబలుచో జనపదములు శుచిదేవతకు విహారస్థలములు కాగలవు. ఉపాదేయమైన ఈవిషయముపై స్త్రీలోకము శ్రద్ధాదృష్టులను బఱపును గాక!

## ౧౯౩౧ జనాభా లెక్కలు: స్త్రీలు:—

మొన్నటి జనాభాలెక్కల ప్రకారము భారతీయులు నూటికి పదునొకండుగురు వంతున అభివృద్ధినొందిరి. సిక్కులు నూటికి ముప్పదిముగ్గురు వంతునను, క్రైస్తవులు నూటికి ౩౨.౬ వంతునను, మహమ్మదీయులు నూటికి పదముగ్గురు వంతునను, హిందువులు నూటికి పదుగురు వంతునను అభివృద్ధినందిరి. భారతదేశపు మొత్తపుజనాభాలెక్కలను పరికించి చూడగా స్త్రీలకంటె పురుషులసంఖ్య హెచ్చుగానుండుట తెలియవచ్చును. హిందూదేశమున స్త్రీలకంటె పురుషులు పదునొకండు మిలియన్లు అనగా ఒకకోటి పదిలక్షల మంది ఎక్కువగానున్నారు. ఐరోపామహాఖండమున పశ్చిమభాగపుదేశములయందు పురుషులసంఖ్యకంటె స్త్రీలసంఖ్యతక్కువగానున్నది. దామాషాని నలుగురుపురుషులకు ఒక్కొక్కస్త్రీ చొప్పున ఉన్నారని ఆదేశములజనాభాలెక్కలు తెలుపుచున్నవి.

సుప్రసిద్ధశాస్త్రవేత్తలు పలువురు ఏదేశమునందలిజనులు సారవంతమైన ఆహారమును తినుచున్నారో ఆదేశమునందలి జనుల సంఖ్యలో స్త్రీలు విశేషించి యుందురనియు, ఏదేశమునందలి జనులు నిస్సారమైన ఆహారముతినువారుగాగాని, లేక కడుపునిండని ఆహారముతో దినములు వెళ్లబుచ్చవలసినవారుగా కాని ఉందురో ఆదేశములందలి జనుల సంఖ్యలో పురుషులు విశేషించియుందురనియు చెప్పుచున్నారు. జేమ్సుబ్రూను మహాశయుడు సారవంతమైన ఆహారము తినుజాతులలో స్త్రీలసంఖ్య నిస్సందేహముగ హెచ్చియుండునని సిద్ధాంతీకరించుచున్నాడు. జంతువుల విషయమున లింగభేదమును కనుగొనుటలో జీవితమును వెచ్చించుచున్న కావల్ యూస్కికూడ ఇదే అభిప్రాయమును వెల్లడించియున్నాడు. తిను ఆహారమునందు శరీరపోషకపదార్థములు కొరవడియుండునెడల మగబిడ్డను, పోషకపదార్థములు నిండాఱియుండునెడల ఆడుబిడ్డను స్త్రీ కనునని అతడు పరీక్షచేసి చెప్పుచున్నాడు. ఈవిషయములను గమనించిన తరువాత మనదేశమున స్త్రీలకంటె పదునొకండుమిలియనుల పురుషులు హెచ్చుగా నున్నారనుటను చూచితిమేని ఆహారవిషయమున హిందూదేశపు స్త్రీలకు చాల అన్యాయము జరుగుచున్నదనుట ఊహ్యమగుచున్నది. భారతస్త్రీలు తినుతిండిలో శరీరపోషకపదార్థములు చాల కొరవడియున్నవనియు, ఈవిషయమై విశేషమగు ఆందోళనము జరిగి వారి ఆహారము సారవంతమగుటకు తగువీళ్లు కలిగింపనిచో పురుషసంఖ్యాధిక్యము దేశమునకు మఱి కొన్ని క్రొత్తసమస్యలను గొనివచ్చుననియు తెలిసికొనవలసియున్నది.

# ఆరోగ్యవిజ్ఞానము

## సీమవంకాయలు ఆహారపదార్థములలో ఉత్తమమైనవి.

సీమవంకాయలను ఆంగ్లమున టొమాటోలందురు. బెజవాడప్రాంతములందు వీనినే జనసామాన్యము 'రాంములక్కాయలు' అని వ్యవహరించుచున్నది. తెలుగుదేశమున ఈకాయలు ఇంకను బాగుగా ప్రచారమునకు రాలేదనియే చెప్పవలసియున్నది. ఆహారపదార్థములలో ఉత్తమమైనవిగా పరిగణింపబడుచున్న ఈ సీమవంకాయలనుగూర్చి తెనుగువారింకను అజ్ఞానమున బడియుండుట శోచనీయము. ధనికులలో పలువురు వీనిని పేదవారు మాత్రమే తినదగినవానిగా పరిగణించుచున్నారు. శాస్త్రవేత్తలు ఈనడుమ తీవ్రపరిశోధనలు గావించి పండిన సీమవంకాయల రసమునందు ఎ. బి. సి విటమినులు మూడును కలవని కనుగొనియున్నారు ఈ మూడు విటమినులును కలసియున్న ఇతర ఆహారపదార్థములలో దుంపకూరలయందు పండని ఎఱ్ఱముల్లంగిదుంపలును, ఆకుకూరలలో కాబేజి, కాలిఫ్లవరు, లెట్యూసులును పేర్కొనదగినవి. కాని ఈ విటమినులు టొమాటోయందున్నంత శక్తిమంతములుగా వీనియందు లేవనుటకు ఎడమున్నది. విశేషప్రచారమునుండి బహుజనామోదము నందియున్న నారింజపండులో స్కర్వీవ్యాధిని కుదుర్చుటలో సమర్థమైయున్న, ఒక్క సి. విటమినుమాత్రము విశేషించియున్నది, నరములను యథాస్థితి యందుంచు బి. విటమిను మిక్కిలికొద్దిగానున్నది. ఎ. విటమిను అసలే లేదనవచ్చును. ఎ. విటమిను శరీరమును లెస్సగా పెంచుటయేగాక ఆమాశయమును శుభ్రపఱచి దేహమును రోగకారకక్రిములకు దూరము చేయును ఎ. విటమినునకు ఇట్టిశక్తికలదనుటను ఈమధ్యనే శాస్త్రజ్ఞులు కనుగొనియున్నారు. పండిన టొమాటోరసములో ఈ ఎ. విటమిను బి. సి. విటమినులతో కలసియుండుటను; ఈరసము రుచికరముగా కూడనుండుటను, ఈ రసమున తెలిసీతెలియని పులుపు కలిసియుండుటను; ఈరసము సీసాలకెత్తబడి ఎన్నినాళ్లయినను నిలవయుండుటకు వీలుగా చేయబడి బజారులయందు విక్రయింపబడుటను ఇది ఇక విరివిగా ప్రచారమునకు రాగలదని నమ్మవచ్చును. ఎ. బి సి విటమినులు ప్రతివాని ఆహారమునందు ముఖ్యముగా శిశువులయు, పిల్లలయు ఆహారమునందుండి తీరవలసినవి. శాకసంబంధమైన ఆహారపదార్థములలో ఈమూడువిటమినులు సమగ్రముగా కలసియున్నది ఈ ఒక్కటొమాటోరసమునందే. కాచిన పాలలో పండినసీమవంకాయరసమును పిండి పాలు త్రాగు పసిపిల్లలకు నిరభ్యంతరముగా ఈయవచ్చును. దీని క్రమసేవనముచే పసిపిల్లలు బాగుగా కండపట్టి బొద్దుగా ఎదుగుదురు. ఈ విటమినులేగాక ఈ 'రాంములక్కాయల' రసమునందు కాల్షియము, ఫోస్ఫేటు మొదలగు లోహసంబంధమైన లవణములు గలవు ఈలవణములు రక్తమును తాజాస్థితియందుంచుటలో చాలఉపయోగకరములైనవి.

## ౯. గాలియే ప్రాణాధారము.

ప్రతిజీవియు నిముసమునకు ౧౬, ౧౮ సారులు ఊపిరి పీల్చును. ఎఱుగకయే ప్రతివ్యక్తియు సాధారణస్థితిలో దినమునకు ౨౬వేల సారులు ఊపిరిపీల్చును. ఒక్కొక్కనిశ్వాసముతోడను శరీరములోని శతాధికములగు కండరములు సంబంధించి యుండును. ప్రతినిశ్వాసమునకును ౨౯, ౩౦ అంగుళముల ఘనపరిమాణము

గల-అనగా దినమునకు ౩౨, ౩౭ పౌనుల-వాయువు కావలసియున్నది. ఒక్కొక్కనికి అతను గ్రహించు అన్నమునకును, నీటికిని ఏడురెట్లు ఎక్కువ గాలి ఒక్కొక్క దినమునకు ఆవశ్యకము. ఒక్కొక్క ఊపిరి ఊపిరి తిత్తులలో ౧౫౫ చతురపుఅడుగుల ఆవరణకు సమమైన మేర రక్తశుద్ధిచేయుచు తిరుగును. రమారమి ౧౬౦ అంగుళముల ఘనపరిమాణముగల వాయువు ఎల్లవేళల ఊపిరితిత్తులలో నిలిచియుండును. ౨౫, ౩౦ అంగుళముల ఘనపరిమాణముగల గాలి ఊపిరి వదలబడును. జీవికి గాలి ఎంతముఖ్యమైనదో ఇందువలన తెలియును. అట్టి గాలి ఎంతపరిశుభ్రముగనున్న జీవికి అంతమంచిది.

౯. పాదరక్షలు: దేహారోగ్యము.

శరీరము యొక్క స్వాస్థ్యమునకు పాదముల ఆరోగ్యస్థితి అతిముఖ్యమైనది. ఫాషనుల పేర మనవారు చిత్రవిచిత్రమైన ఆకారముగల జోళ్లను వాడి తమ పాదములకు లేనిరోగములను తెచ్చుకొనుచున్నారు. బూట్సులమడమ కొంతఎత్తుగనుండుట ఆరోగ్య శాస్త్రసమ్మతమేకాని నడకనే యొకకష్టకార్యముగ నొనరించు మిక్కిలి ఎత్తుమడమలుగల బూట్సుల ఉపయోగము తెగడతగినది. పాదములను నొక్కిపట్టి వానికి గాలితగులకుండజేయు కాలిజోడును శత్రువుగా పరిగణింపవలెను. మృదువైన చర్మముతో చేయబడినవి, పాదమును నొక్కిపట్టక ధారాళముగ గాలిప్రసరించుటకు అవకాశము నిచ్చునవి, కాళ్లకు నేలయొక్క చెమ్మను ఎంతమాత్రము తగలనీయనివి అగు పాదరక్షలు ఆరోగ్యప్రవర్ధకములు. మానవుని ఒక్కొక్క పాదమున ఇరువదియారు ఎముకలు, పెక్కు కండరములు, అసంఖ్యాకములగు నరములు కలవు. వీనివీనికి నిర్ణీతములైన పనులనొనరించుటలో పాదరక్షలు అడ్డంకిగానుండవు సరిగదా మీదుమిక్కిలి తోడుపడును. పాదరక్షలు వాడుటచే రక్తచలనము తాజాస్థితి యందుండును, నరములు సౌమ్యస్థితి యందుండును; పాదములకు తేమతగులకుండును, రోగకారకక్రిములు పాదముల ద్వారా శరీరమున ప్రవేశించుటకు అవకాశములేకుండును. కన్ను, ముక్కు, శిరోజములు వీనిఆరోగ్యము చాలభాగము పాదముల ఆరోగ్యముపై ఆధారపడియుండు ననువిషయము సర్వదా జ్ఞప్తియందుంచుకొనవలయును.

౧౦. తవుడు యొక్క విలువ:—

తవుడులో కాలరీలు మిక్కిలితక్కువ. కాని బి. విటమినులు హెచ్చు. ఒకపౌనుతవుడులో నలుబదియైదు యూనిట్ల బి. విటమినులు ఉన్నట్లు పరిశోధనల వలన కనుగొనబడినది. రక్తమును బాగుగా పెంపొందించుటలోహామూను శరీరమునకు కలిగించుటలో తవుడును మించిన పదార్థము మఱియొకటిలేదు. పశుపుల కాలేయు (బీఫ్‌లీవరు) భక్షణముచేకలుగు రక్తవృద్ధికరములగు లోహములకంటె తవుడులోని ఆలోహములు ప్రశస్తతరములు. బీఫ్‌లీవరు తినుటచే మనిషి పుష్టినొందుటకు తోడు ఆతనితూకమును హెచ్చును. కాని తవుడు తినుటచే మనిషి బాగుగా పుష్టి నొందుటయే గాని అనవసరముగ ఆతనితూకము హెచ్చదు. తూకము హెచ్చకుండ శరీరపుష్టికలిగించుకొనదలచిన వారికి తవుడును మించిన ఆహారపదార్థములేదు. శాకసంబంధమైన తవుడులోనే రక్తవృద్ధికరములగు లోహములు సమృద్ధిగనుండగా ఆలోహములకొఱకు జంతుసంబంధమగు బీఫ్‌లీవరుకై జంతుహింస చేయనేలయని ఒకపాశ్చాత్యవైద్యుడు తనజాతీయులను ప్రశ్నించుచున్నాడు. భారతీయులు బీఫ్‌లీవరుఉపయోగించుపాపమున కింకను ఒడిగట్టకున్నను తవుడుయొక్క విలువను మాత్రమింకనుగ్రహింపలేదని చెప్పవలసియున్నది. దంపుడుబియ్యము వాడినంతకాలము వారి ఆహారమున కొంతవఱకు తవుడు ఉండుటకు అవకాశముండినది. ఫ్యాక్టరీబియ్యము వచ్చినతరువాత వారిఆహారమున తవుడు ఎంతమాత్రమును లేదనియే చెప్పవలసియున్నది. ఫ్యాక్టరీబియ్యమునే ఉపయోగింపకతీరనివారు తమ ఆహారమున బి. విటమిను ఉండుటకుగాను అప్పుడప్పుడు తవుడుతో రొట్టెలుచేసికొని తినుచుండుట చాలమంచిది.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## 3. భారతనీతులు

ఆంధ్రులకుఁ బరిచితపూర్వులగు శ్రీయుతులు వాజపేయయాజుల రామసుబ్బారాయఁడుగారి సతీమణిచే నిందలి పద్యములు గ్రథితములు. ఇందు వివిధములగు నీతులు చిన్నపద్యములలోఁ జెప్పఁబడుట నందఱకును సులభావగాహములు. పుస్తకాంతమునఁ గఠినపదముల కర్థములు సైతము వ్రాయఁబడినవి. ఇది పాఠశాలలలోఁ జదువుకొనువారి కెంతయుఁ బఠనీయము. నీత్యుపదేశమునకై శ్రీమతి వాజపేయయాజుల మహాలక్ష్మమ్మగారిచేఁ గూర్పఁబడిన యీ పుస్తకము నెల్లరు నాదరింతురు గాక! ఇది కొల్లాపురపు స్నేహలతాకవితాసంఘపక్షమునఁ బ్రకటింపఁబడినది. డెమ్మిసైజు. ౨౦ పుటలు. వెల ౦-౪-౦. —సూ. కృ

## ౪. ఆత్మోపదేశము

మీర్జాపురము రాణీగారి యాస్థానపండితురాలగు శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారిచే విరచితము. "మనమా! యేల వృథాశ్రమంబు! కనుమా మాయాపహారిన్ హారిన్" అని మకుటముగా నలుబదిపద్యము లిందుఁ గలవు. ఐహికవిషయములు నిస్సారములని నిరూపించుచుఁ బరాత్పరుని సేవింపుమని యుపదేశముచేయుటయే యీపద్యముల యాశయము. ఇందలి పద్యములలోఁగొన్ని పత్రికలలోఁ బ్రకటితపూర్వములు. పద్యములలోని ధార సరసముగనున్నది. వీ రీవఱకుఁ గొన్ని పుస్తకముల రచించినట్లుగ పీఠికామూలమునఁ దెలియుచున్నది. భాషాసేవ చేయుచున్న యీవిదుషీరత్నము ఇంకను బెక్కుపుస్తకములను రచించి యితోధికముగు సారస్వతప్రచారము చేయునట్లు పరమేశ్వరుఁ డనుగ్రహించుఁగాక! ఇదియు స్నేహలతాకవితాసంఘముపక్షమునఁ బ్రకటితము. 30 పుటలు. చిరునామా: శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు, గవర్నెస్, రాజభవనము, మీర్జాపురము ఎస్టేటు, నూజవీడు. —సూ. కృ.

## ౫. రామామృతము

శ్రీవాజపేయయాజుల రామసుబ్బారాయ విరచితము. మిత్రుల కోరికపై విలాసముగఁ జెప్పఁబడిన శ్రీరామచరిత్రప్రదర్శకములగు ౨౪ పద్యము లిందుఁగలవు. ఆశువుగఁ జెప్పఁబడినను పద్యములు ధారాశుద్ధిగలిగియున్నవి. ఈ గ్రంథకర్తృరచనలు పత్రికలమూలమున నాంధ్రలోకము చిరకాలమునుండి చూచుచున్నది. స్నేహలతాకవితాసంఘమున కధ్యక్షులైన వీరు ఈయాశుకృతిని తత్సంఘమునకే యంకితమొనర్చిరి. సారస్వతసేవాదీక్షితులగు వీరికి చిరాయురారోగ్యములను భగవంతుడు ప్రసాదించును గాక! ౭ పుటలు. డెమ్మిచిన్నసైజు. చిరునామా: వాజపేయయాజుల రామసుబ్బారాయఁడుగారు, బి. ఏ. ప్రెసిడెంటు, స్నేహలతాకవితాసంఘము, కొల్లాపురము, జటప్రోలుసంస్థానము. —సూ. కృ.

## ౬. స్నేహలతాకవితాసంఘము.

ఈ సంఘ మొనర్చుచున్న భాషాకృషిని బ్రశంసించుచుఁ బలువురు ప్రముఖు లిచ్చిన యభిప్రాయములన్నియు సంఘాధ్యక్షులచే నొకటిగాఁ గూర్పఁబడినవి. శ్రీపాద కృష్ణమూర్తిగారు, చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు మొదలగు పండితప్రకాండు లీసంఘకృషిని మెచ్చుకొనిరి. దీనికి శ్రీమతి చేబ్రోలు సరస్వతీదేవిగారు అనునొకవిదుషీమణి యుపాధ్యక్షురాలు. ఇంకను గొందఱు స్త్రీసభ్యురాండ్రుసైత మిందుఁ జేరి పనిచేయుచుండుట యీసంఘగౌరవమును జాటుచున్నది. వివిధరీతుల సారస్వతసేవచేయుచున్న వారి నిట్లు సంఘముగ నేర్పఱచి ఆంధ్రభాషాయోషను సేవించుచున్న శ్రీరామసుబ్బారాయుడు గారెంతయు ప్రశంసార్హులు. ఆంధ్రు లెల్ల

రీసంఘమునకుఁ దగిన చేయూతనిచ్చి యాదరింతురు గాకయని కోరెదను. —సూ. కృ.

## ౭. నవ్వగలవా?

శ్రీయుతులు కాంచనపల్లి వేంకటరంగారావుగారిచే రచింపబడినది. నవ్వుపుట్టించురచనలు. వినోదైకప్రాధాన్యముగల రచనలు తెలుఁగుభాషయందుఁ దక్కువ. ఇట్టిరచనలు ఉత్కృష్టములగు హాస్యగ్రంథరచనమునకు ప్రోత్సహించుచో వీనిఉనికి సార్థకముకాగలదు. ౧౩ పుటలు వెల ౦-౨-౯. పైసలు. డెమ్మి చిన్నసైజు. చిరునామా: కాంచనపల్లి వేంకటరంగారావుగారు, బాపూరు, బరంపురము —సూ. కృ.

## ౮. పెళ్లాన్ని యెలా పిలవడం?

ఇది యొకవినోదరచనము ఇదియును కాంచనపల్లి వేంకటరంగారావుగారిచేతనే రచియింపబడినది. భార్యనెట్లు పిలుచుట? యను నాలోచనాతరంగములలో నొకయువకుఁడు కొట్టుకుపోయి దారితెన్నుఁ దెలియక పోయినాఁడు. కాలక్షేపమునకై చదువుకొనవచ్చును. ఐదు, లేక ఆఱువత్సరములకు పూర్వము శ్రీతల్లాప్రగడ రామారావుగారిచే ప్రచురింపబడుచుండిన 'ఆంధ్రభారతి' మాసపత్రికలోని 'పెళ్లాన్ని ఎల్లా పిలవడం?' అను వ్యాసమున కిది కొంతవఱకు అనుకరణ మనజెల్లును. వెల ౦-౧-౦. ౧౮ పుటలు. బరంపురమునందలి వేగుఁజుక్క ముద్రణాలయమునందు ముద్రితము. చిరునామా పైదే. సూ. కృ.

## ౯. శిశువుల యకృత్ ప్లీహ వ్యాధులు

శిశువుల యకృత్ ప్లీహ (లివర్ అండ్ స్ప్లీన్) వ్యాధుల నిర్మూలనమునకు పరమహంసక్రియ యనఁదగు ఔషధరాజమును కనిపెట్టి దానిని అర్హమగు విశేష ప్రచారమునకుఁగొనివచ్చి మానవసేవచేయుచున్న డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారిచే ఇది గ్రథితము. శిశువులే దేశసంపద. వారిమేలే దేశముమేలు. ఏదేశమున శిశుమరణములు విస్తరించియుండునో ఆదేశము అన్నివిషయములందును వెనుకబడియున్న దేశముగా పరిగణింపనగును. హిందూదేశమున శిశుమరణములు హెచ్చు అగుట సర్వజనసువిదితము. ఇట్టి శిశుమరణములకు కారణమైన వ్యాధులలో యకృత్ ప్లీహవ్యాధులు-ముఖ్యముగా మద్రాసు, వంగరాష్ట్రములందు-ప్రముఖస్థానము వహించుచున్నవి. అల్లోపతిక్ వైద్యమున ఈ వ్యాధులను నమ్మకముగా కుదర్చగల మందులేదు. అగుట డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి లివర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్ నేటి ఆయుర్వేదవైద్యమునకు గొప్పకీర్తి నార్జించునదిగా నున్నది. పాశ్చాత్యవైద్యశిఖామణులుకూడ పలువురు దీనిని ప్రశంసించియున్నారు. దేశమునందలి వివిధవ్యక్తులచే నిది పొందిన యోగ్యతాపత్రములకు లెక్కలేదు. అందు ముఖ్యమైన యోగ్యతాపత్రములు కొన్ని ఈ గ్రంథమున ముద్రితములు. యకృత్ ప్లీహవ్యాధిగ్రస్తులైనప్పటియు, ఈ ఔషధము సేవించినతరువాత రోగవిముక్తులైనప్పటియు శిశువుల చిత్రములీగ్రంథమున గలవు. పెక్కు ప్రదర్శనములలో ఈమందు అర్హసన్మానము నందియున్నది. నేటి ఆంధ్రులు ఆయుర్వేదమున తమ ప్రతిభను చూపుకొనుటకు కారణమైన మందులలో నొకటియగు ఈ లివర్ అండ్ స్ప్లీన్ స్పెసిఫిక్ నుగూర్చిన ఇంకను అనేకోపయోగవిషయము లిందు గలవు. కోరువారికి ఉచితముగ పంపబడును. గ్రంథమున డాక్టరు జమ్మి వేంకటరమణయ్యగారి చిత్రముగలదు గ్లేజు కాగితములమీద సుందరముగ ముద్రింపబడియున్నది. చిరునామా: 8, శాస్త్రివీథి, మైలాపూరు, మదరాసు.

## ౧౦. తర్కసంగ్రహము

తర్కశాస్త్రపారంగతుడగు అన్నంభట్టు విద్యార్థులకు సులభార్థబోధకముగ నుండునటుల ఆ శాస్త్రమును సంగ్రహపఱచి తర్కసంగ్రహమను గ్రంథమును సంస్కృతమున రచియించెను. దానికిపుడు ఆంధ్రతాత్పర్యమునురచియించి చరకమతదీపికాఖ్యాయుర్వేదమతవివరణముతో ఆయుర్వేదాచార్య డాక్టరు ములుగు విశ్వేశ్వరశాస్త్రి యల్. ఐ. యమ్., హెచ్. పి. ఐ. యమ్. గారు వెలువరించియున్నారు. ఈ గ్రంథమును గూర్చి విపులవిమర్శనము పైమాసమున ప్రచురింతుము. ఈపుస్తకప్రకాశకులు: పండిత, ములుగు రామలింగయ్యగారి ఇండియన్ మెడికల్ స్టోర్సు, తెనాలి. ఫుల్‌స్కాప్ చిన్నసైజున ౯౨ పుటలు. వెల రు. ౧-౦-౦.